
దర్శించండి - తరించండి
# స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ




శ్రద్ధాంజలి
మా పెద్దలు
అవనిగడ్డ ప్రకాష్ రావు గారి
ఆకస్మిక మరణం మాకు తీరని
లోటు....వారి ఆత్మకు శాంతి
కలగాలని భగవంతుని
ప్రార్థిస్తూ...
కుటుంబ సభ్యులు



| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 70 | ది. 16-6-2026 | మంగళవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 70 | Date : 16-6-2026 | Tuesday | Pages : 8 | Rs.1/- |


# భారత్ దూసుకెళ్తున్న ఆర్థిక శక్తి - ఏపీ కీలక చోదకశక్తి

● ఆర్టీఐహెచ్‌లో ఆవిష్కరణలు, స్టార్టప్‌లకు వెంచర్ క్యాపిటల్ పెట్టుబడులు ● ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ల తయారీకి ఏపీ అనుకూలం ● సింగపూర్ పర్యటనలో వెంచర్ క్యాపిటలిస్టులతో సీఎం చంద్రబాబు సమావేశం ● భారత హై కమిషనర్ శిల్పక్ అంబులేతోనూ ముఖ్యమంత్రి భేటీ




**సింగపూర్, జూన్ 15 (వార్తాప్రభ) :** సంస్కరణలతో భారత్ దూసుకుపోతున్న ఆర్థిక శక్తిగా మారిందని, ఇందులో ఆంధ్రప్రదేశ్ కీలక చోదక శక్తిగా ఎదుగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. చైనా లాంటి దేశాలు ఆర్థిక వృద్ధికి దశాబ్దాల కాలం పట్టిందని.. భారత్‌కు అంత సమయం అవసరం లేదని సీఎం అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఆధునిక ఆలోచనలు, సంస్కరణలతో భారత్‌ను అద్భుతమైన వేగంతో అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. సింగపూర్ పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి తొలిరోజు సోమవారం వెంచర్ క్యాపిటలిస్టులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. మెడికల్ టెక్నాలజీ సహా ఆధునిక పరికరాల తయారీలో భారత్ ఇప్పుడు అగ్రస్థానంలో ఉందన్నారు. వివిధ రకాల ఎలక్ట్రానిక్స్ పరికరాలు ఇప్పుడు భారత్ నుంచి ఎగుమతి అవుతున్నాయని అన్నారు. డెమోగ్రాఫిక్ డివిడెండ్‌తో అతిపెద్ద యువశక్తి ఉన్న మానవ వనరుల దేశంగా భారత్ నిలిచిందన్నారు. భారత్ తయారీ రంగంలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తోందని ముఖ్యమంత్రి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 5వ జనరేషన్ ఫైటర్ జెట్‌లు సహా వివిధ రక్షణ రంగ ఉత్పత్తులు తయారు చేసేలా ప్రాజెక్టులు ఏర్పాటు అవుతున్నాయని సీఎం వివరించారు. మెడికల్ టెక్నాలజీ, ఇతర ఆధునిక పరికరాల తయారీలో భారత్ అగ్రస్థానంలో ఉందన్నారు. తయారీ రంగాన్ని ప్రోత్సహించేలా ఆంధ్రప్రదేశ్‌లో వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ అనే విధానాన్ని అనుసరిస్తున్నామని సీఎం తెలియచేశారు. ఏపీకి అడ్వాన్స్ డ్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ (సూపీజూా), గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ లాంటి పరిశ్రమలకు వేగంగా అనుమతులు, భూములు కేటాయించామని ముఖ్యమంత్రి వారికి వివరించారు. ఏపీలో వివిధ పారిశ్రామిక ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు ఇదే సరైన సమయం అని.. పెట్టుబడిదారులు ముందుకు రావాలని సీఎం పిలుపునిచ్చారు. శ్రీసిటీ లాంటి ప్రత్యేక పారిశ్రామికవాడలు పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయని అన్నారు. ఏపీలో పౌరసేవలతో పాటు అన్ని అంశాలకూ టెక్నాలజీని అనుసంధానించాం అన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా పెట్టుబడులకు ఆస్కారం ఉందన్నారు. వెంచర్ క్యాపిటలిస్టులు ఆర్టీఐహెచ్ ప్రోత్సహించిన స్టార్టప్‌లకు పెట్టుబడులు అందించే అవకాశం ఉందన్నారు. అత్యుత్తమ ఆవిష్కరణల్ని పోత్సహించేందుకు వెంచర్ కాపిటలిస్టులు ముందుకు రావాలని కోరుతున్నానని సీఎం అన్నారు. ఈ సమావేశానికి ఆరిజన్ వెంచర్స్, ఆటోమోనిక్స్, ఏలెవ్ 8 వెంచర్స్, ఆప్టిమమ్ సొల్యూషన్స్, క్వోనా కాపిటల్, జంగిల్ వెంచర్స్ తదితర వెంచర్ క్యాపిటల్ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.

**షిప్ బిల్డింగ్ పరిశ్రమకు ఏపీ అనుకూలం..** తొలిరోజు పర్యటనలో ముందుగా... సింగపూర్‌లోని భారత హై కమిషనర్ శిల్పక్ అంబులే ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. భారత్‌లో సింగపూర్‌కు ఉన్న ఆర్థిక, వాణిజ్య ఒప్పందాలను ముఖ్యమంత్రికి వివరించారు. ఏపీ అభివృద్ధి ప్రయాణంలో సింగపూర్ కీలక భాగస్వామి కావాలని సీఎం స్పష్టం చేశారు. సింగపూర్ కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించాలని సీఎం కోరారు. ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, క్వాంటం టెక్నాలజీ సహా వివిధ రంగాల్లో పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయని సీఎం వివరించారు. ఏపీలో కొత్తగా అందుబాటులోకి పోర్టులు అందుబాటులోకి వస్తున్నందున షిప్ బిల్డింగ్, సివిల్ ఏవియేషన్, మెయింటెనెన్సు, రిపేర్స్ ఓవర్ హాలింగ్ కేంద్రాలకు నెలకొల్పేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఏపీలో హార్టికల్చర్ ఉత్పత్తుల ట్రేసింగ్, సర్టిఫికేషన్‌కు వెళ్తున్నామని సీఎం వివరించారు. రోబోటిక్స్, మెడికల్ డివైజెస్, హార్డ్ వేర్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో సింగపూర్ సహకారం కోరుతున్నామని అన్నారు.

# ప్రజా ప్రభుత్వం ప్రజలకు చేరువైంది - ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, జూన్ 15 (వార్తాప్రభ) :** రాష్ట్ర ప్రభుత్వం మార్చి 16 నుంచి జూన్ 12 వరకు చేపట్టిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంతో ప్రజా ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువైందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. 99 రోజుల పాటు రాష్ట్రమంతటా జరిగిన కార్యక్రమాలపై సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. విభాగాల వారీగా చేపట్టిన కార్యక్రమాలు, వాటి ద్వారా వచ్చిన ఫలితాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. రాజ్యసభ ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రితో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్ని విభాగాలు తాము జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు చేపట్టిన కార్యక్రమాల వివరాల నివేదికలను సమర్పించాయి. 99 రోజుల యాక్షన్ ప్లాన్లో చురుగ్గా పాల్గొన్న విభాగాలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు. ప్రధాన కార్యదర్శుల నుంచి జిల్లా కలెక్టర్ వరకు అన్ని విభాగాల ఉన్నతాధికారులు ప్రతినెలా క్షేత్రస్థాయికి వెళ్లాలని గతంలోనే ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లని అధికారులు, జిల్లా కలెక్టర్లపై తనకు నివేదిక ఇవ్వాలని చీఫ్ సెక్రటరీని సీఎం ఆదేశించారు. వారిపై క్రమశిక్షణా ఉల్లంఘన చర్యలు ఎందుకు తీసుకోకూడదో.. వెంటనే వివరణ కోరాలని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలను పాటించని అధికారులను ఉపేక్షించవద్దని హెచ్చరించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో చేపట్టిన కార్యక్రమాలను కొన్ని విభాగాలు ఆశించినంతగా చెప్పుకోలేకపోయాయని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. వెంటనే అన్ని శాఖలు తాము చేపట్టిన కార్యక్రమాలకు తగినంత ప్రచారం కల్పించాలని సూచించారు. సంబంధిత ఉన్నతాధికారులు ఆ బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు. మీడియా, డిజిటల్ మీడియా ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలకు తాము చేసిన మంచి పనులు చెప్పుకోవాలని అధికారులకు సూచించారు. వివిధ స్థాయిల్లో జరిగిన కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, ప్రజల నుంచి వచ్చిన ఫీడ్ బ్యాక్ను నమోదు చేయాలని, గ్రామాల్లో వచ్చిన సమస్యలను కూడా ఆయా శాఖలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ మూడు నెలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, చేసిన శంకుస్థాపనలు, ఆస్తుల వివరాలన్నీ నమోదు చేయాలని చెప్పారు. ఇప్పటికీ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ భవనాలు లేని గ్రామాలుంటే.. వెంటనే ఆ జాబితాను సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ అధికారులను సీఎం ఆదేశించారు. అక్కడ కొత్తగా గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలను కూడా చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. అన్ని పాఠశాలల భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. విద్యా, వైద్య విభాగాల్లో అన్ని స్థాయిల్లో ఫేషియల్ రికగ్నిషన్ విధానం అమలు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పాఠశాలల నుంచి కాలేజీల వరకు, పీహెచ్ సీ నుంచి ఉస్మానియా, గాంధీ ఆసుపత్రి వరకు ఉద్యోగులందరికీ ఇదే అటెండన్స్ విధానం పాటించాలన్నారు. రాష్ట్రస్థాయిలో 99 రోజుల యాక్షన్ ప్లాన్పై సమీక్ష నిర్వహించినట్లే.. జిల్లాల వారీగా వెంటనే ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై వెంటనే సమీక్ష జరపాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమీక్షలకు రాష్ట్ర స్థాయి నుంచి ప్రతి జిల్లాకో సీనియర్ ఐఏఎస్ అధికారిని స్పెషల్ ఆఫీసర్ గా నియమించి, ఆ జిల్లాకు పంపించాలని చెప్పారు. స్పెషలాఫీసర్ ఆ జిల్లా కలెక్టర్ కలిసి అన్ని విభాగాల్లో 99 రోజుల పాటు జరిగిన ప్రత్యేక కార్యక్రమాలు, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, వివిధ పథకాలపై వచ్చిన స్పందనలన్నింటినీ సమీక్షించాలని ఆదేశించారు. జిల్లాల వారీగా ఈ ప్రగతి నివేదికలను విడుదల చేయాలని చెప్పారు. జిల్లాలతో పాటు నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల వారీగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందుకున్న లబ్ధిదారులు, ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వీటిని డ్యాష్ బోర్డులో అందుబాటులో ఉంచాలని చెప్పారు. ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తర్వాత జిల్లాల పర్యటనలు, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై సీఎం అధికారులను ఆరా తీశారు. నియోజకవర్గాల వారీగా ముఖ్యమంత్రి హామీల పురోగతిపై నివేదిక ఇవ్వాలని ప్లానింగ్ విభాగాన్ని ఆదేశించారు.


## వేలం ప్రకటన

మహారాజశ్రీ కృష్ణాజిల్లా
మచిలీపట్నం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి
(జూనియర్ డివిజన్) వారి కోర్టులో
E. P. No.90 / 2025
in
O.S.No. 407 / 2019
Between :
కరెడ్ల ఉమామహేష్
--------D. Hr
మరియు
1.బూర కృష్ణకుమారి
2) బూర నాగరాజు
--------J. Drs

పై నెంబరు డిక్రీ బాకీని రాబట్టుకునే నిమిత్తం J. Drs యొక్క సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములలోగల యీదిగువ షెడ్యూలు దాఖలాఆస్థిని ది. 30.06.2026న ఉదయం గం. 10.30 ని.ల నుండి పై కోర్టు వారి యెదుట వేలం వేయబడును. కావున పాడుకొనదలచినవారు సదరు వేలం పాటలో పాల్గొని వేలం షరతులకు లోబడి పాట పాడుకొనవచ్చును.

**షెడ్యూలు :**

కృష్ణా జిల్లా, మచిలీపట్నం సబ్ రిజిస్ట్రారు వారియిలాకా మచిలీపట్నం టౌన్, ఉల్లింగిపాలెం, మున్సిపల్ వార్డు నెం. 30 (R.S.No. 254,బందరు ఈస్ట్ రెవిన్యూ వార్డు నెం. 3) D. No. 30/684 లో గల చ. గ. 100లు లేదా చ. మీ. 83.60లు నందు గల RCC బిల్డింగ్ నకు హద్దులు :- **తూర్పు :** బుర్రా రామస్వామి ఇల్లు, స్థలం - 30అడుగులు, **దక్షిణం :** జాయింటు మార్గం - 30 అడుగులు, **పడమర:** రోడ్డు -30 అడుగులు , **ఉత్తరం:** P.మార్తమ్మ ఇల్లు, స్థలం -30 అడుగులు. యీ హద్దుల మధ్య చ. గ. 100లు లేదా చ. మీ. 83.60లు నందు పై డోర్ నెం. గల RCC బిల్డింగ్, కరెంటు సర్వీస్, మీటర్ డిపాజిట్ వగైరా కరెంటు సర్వీస్ నెం. 55396 అన్ని ఇన్స్ట్రుమెంట్స్ తో సహా.
D.Hr విలువ : Rs. 5,00,000/-
అమీనా విలువ : Rs. 12,00,000/-
మార్కెట్ విలువ : Rs. 4,47,000/-
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వేలం తేది. 30.06.2026
S.S.S.సాయిబాబు
P.ఉమాగిరి
D. Hr తరపున అడ్వకేట్స్
మచిలీపట్నం


# 55 లక్షలకు చేరిన 'యోగాంధ్ర' రిజిస్ట్రేషన్లు

● ఏర్పాట్ల వారీగా జిల్లాలకు ర్యాంకులు
● విజయంతంగా నిర్వహించేలా అధికార యంత్రాంగం కృషి

**అమరావతి,జూన్ 15 (వార్తాప్రభ) :** ' యోగాంధ్ర-2026 'కార్యక్రమాల్లో భాగస్వాములయ్యేందుకు రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం మధ్యాహ్నం వరకు 55 లక్షల రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఈ నెల 7 నుంచి ప్రారంభమైన రిజిస్ట్రేషన్లు రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఆదివారం ఒక్క రోజే 24 లక్షల రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. జిల్లాల వారీగా పరిశీలిస్తే అత్యధికంగా కర్నూలు జిల్లాలో 5,34,217, అనంతపురం జిల్లా-4,98,758, నెల్లూరు జిల్లా-4,94,757, కడప జిల్లాల్లో 4,79,510 చొప్పున రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఈ నెల 21న జరిగే రాష్ట్ర స్థాయి కార్యక్రమాల్లో కోటి మందిని భాగస్వాములను చేయాలన్న ప్రభుత్వ లక్ష్య సాధనకు అనుగుణంగా జిల్లాల అధికారులు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఈ సంఖ్య రానున్న రోజుల్లో భారీగా పెరగనుంది. వైద్య విద్యార్థులు కూడా అధిక సంఖ్యలో యోగాసనాల కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. యోగాంధ్ర కార్యక్రమాల నిర్వహణ, ఏర్పాట్లపై సోమవారం వర్చువల్ గా జరిగిన సమావేశంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కు ఆయుష్ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, ఇతర అధికారులు వివరించారు.

**వేదిక మార్పు..** తొలుత నిర్ణయించిన ప్రకారం కృష్ణానది బ్రిడ్జి (వెస్ట్ బైపాస్ రోడ్డు) పైన కాకుండా. విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం లో ఈ నెల 21న రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. మరోవైపు వాతావరణం శాఖ జారీచేసిన హెచ్చరికల ప్రకారం ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.


మహారాజశ్రీ కృష్ణాజిల్లా
మచిలీపట్నం ప్రిన్సిపల్ జూనియర్
సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P.No.82 / 2025
in
O.S.No. 76 / 2021
Between:
ఓల్లి మధుసూదనరావు
--------D. Hr
మరియు
మాదాసు మాణిక్యమ్మ
--------J. Dr
TO:-
J. Dr : మాదాసు మాణిక్యమ్మ W/o.సత్య వర ప్రసాదు శ్రీమహలక్ష్మి టిఫిన్ మరియు కర్రీస్ పాయింటు, D.No. 25/271 , 272, దుర్గా మహల్ రోడ్, M.S.R. గ్రాఫిక్స్ దగ్గర, కెనడీ రోడ్, మచిలీపట్నం.

పై నెంబరు E.P.నందు J. Dr అయిన మీకు నోటీసు అమలు నిమిత్తం ది.02-07-2026 నకు వాయిదా అయియున్నది. కావున సదరు వాయిదారోజున ఉదయం గం. 10.30 ని.లకు పైకోర్టు వారి యెదుట మీరు స్వయముగా గానీ లేదా న్యాయవాది ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల మీపరోక్షమున తదుపరి గ్రంధములు జరిపించ బడునని ఇందుమూలముగా తెలియ జేయటమైనది.
( శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం )
వాయిదా తేది : 02-07-2026
లంకిశెట్టి బాలాజీ
D. Hr తరపున న్యాయవాది
మచిలీపట్నం
సెల్ : 98482 12612


# జెన్ జీ తరాన్ని గందరగోళపరచే శక్తులున్నాయి

● ఫ్యాషన్ పేర్లు పట్లా ... ఫాన్సీ సిద్ధాంతాల పట్ల జాగ్రత్త అవసరం ● చదవండి.. తెలుసుకోండి.. పరిశీలించండి.. నిర్ణయం తీసుకోండి ● దేశ క్షేమం, శ్రేయస్సు, భద్రత, భవిష్యత్తు ప్రధానం ● కాంగ్రెస్ హిపోక్రసీ రాజకీయాలు మానుకోవాలి ● తెలంగాణలో జనసేన నిస్వార్థంగా పోరాడుతుంది● నరేంద్ర మోదీ బలమైన దేశభక్తి గల నాయకుడు ● ఢిల్లీలో 'జాతీయ సమైక్యత కోసం.. సేన ప్రస్థానం' సమావేశం ముగింపు సందర్భంగా ప్రసంగించిన జనసేన అధ్యక్షులు, ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



**న్యూఢిల్లీ,జూన్ 15 (వార్తాప్రభ) :** 'ప్రతి తరంలోనూ సమాజంలో జరిగే కొన్ని విషయాల పట్ల కోపం, కసి, వేదన, బాధ ఉంటాయి. సామాజిక, రాజకీయ పరిస్థితులను బట్టి అవి యువతరంలో వివిధ దశల్లో ఉండటం సహజం. యౌవన దశలో కచ్చితంగా అతివాద భావాలుండటం సాధారణం. ఆ భావాలకు దేశభక్తిని జోడించి పరిష్కారం చేపట్టాలి. నా దేశం, నా నేల అనే భావన ప్రతి ఒక్కరిలో కచ్చితంగా ఉండాలి. నేటి తరం ఏ విషయాన్ని అయినా చదవండి... తెలుసుకోండి... పరిశోధించండి.. పరిశీలించండి.. ఆ తర్వాతే దానిపై స్థిరమైన భావాన్ని ఏర్పరచుకోండి. అప్పుడే మనకు దేశానికి మేలు చేసే సానుకూల ఆలోచనలు పుడతాయి. కేవలం ఫ్యాషన్ గా ఉండే పేర్లకు, మెదడును గందరగోళపరిచే అంశాలకు జెన్ జీ దూరంగా ఉండటం మేలు' అని జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. నేటి జన్ జీ తరం అయినా, ఏ తరం అయినా దేశ సమగ్రత, సమైక్యత, సార్వభౌమాధికారం, సచ్ఛీలతను కాపాడేలా ఆలోచించాలని చెప్పారు. ఢిల్లీలో సోమవారం జరిగిన జాతీయ సమైక్యత కోసం.. సేన ప్రస్థానం' సమావేశం ముగింపు సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడారు. పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... "దేశానికి వాణిజ్య రాజధాని అయిన ముంబయిలో 72 గంటలపాటు ఉగ్రవాదులు చేసిన మారణహోమం భారతీయులందరికీ గుర్తే. దీనిపై నేను చాలా కలత చెందాను. మా నాన్న గారి అస్థికలను వారణాసిలోని గంగనదిలో కలిపేందుకు వెళ్తూ.. కాశీ విశ్వేశ్వరుడ్ని బలంగా వేడుకున్నాను. దేశానికి ఉగ్రవాదం పీడ తప్పించే బలమైన నాయకత్వం ఇవ్వమని కోరాను. దేశాన్ని ముందుకు నడిపించే, ఐక్యంగా ఉంచే నిస్వార్థ నాయకుడే నరేంద్ర దామోదర్ దాస్ మోడీ భారతదేశానికి ఉన్న గొప్పదనం ఏమిటంటే క్లిష్ట పరిస్థితులు ఎదురైన ప్రతిసారీ ఓ బలమైన నాయకుడ్ని తయారు చేసుకుంటుంది. అది ఈ దేశానికి ఉన్న సత్తా. మోదీ దేశం గురించి అంత గొప్పగా ఆలోచిస్తారు కాబట్టే, నేను ఆయనకు అంత బలంగా మద్దతు పలుకుతాను. దేశ గతిని మలుపు తిప్పుతూ, ప్రపంచంలోనే దేశాన్ని అత్యున్నత శిఖరం మీద నిలిపిన గొప్ప నాయకుడు మోదీ . ఆయన నాయకత్వానికి జనసేన పార్టీ సంపూర్ణ మద్దతు పలుకుతుంది. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన నాయకుల్లో అత్యంత ఎక్కువ రోజులు దేశ ప్రధానిగా పనిచేసిన మోదీ కి మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నాను.

**సైనికులకు ప్రాంతీయత చూస్తామా..?..** దేశంతో మనం ఇంత భద్రంగా ఉంటున్నామంటే సరిహద్దుల్లో కాపాలా కాసే సైనికుల పుణ్యమే. సియాచిన్ వంటి గడ్డకట్టే చలిలో సైతం వారు దేశానికి చేసే సేవ అపూర్వం. వారెప్పుడూ మా ప్రాంతం అనే భావన చూపించరు. నా దేశం అనుకుంటారు. కానీ వారు నివసించే ప్రాంతంలో మాత్రం సైనికుల కుటుంబాలపై ప్రాంతీయ తత్వం ప్రభావంపడుతోంది . ఇదెలా కరెక్టు. నేను ప్రతిసారీ ప్రాంతీయతను విస్మరించని జాతీయవాదం అని ఎందుకు అంటానంటే మొదట మన ప్రాధాన్యం దేశం అవ్వాలి. తర్వాతే ప్రాంతం. దేశం కోసం కష్టపడుతున్న వారిని ప్రాంతాలకు ముడిపెట్టడం సబబు కాదు. జాతీయ పార్టీ అంటే కేవలం ఎన్ని రాష్ట్రాల్లో, ఎన్ని ఓట్లు వచ్చాయని గుర్తించడం కాదు. జాతీయ పార్టీ అంటే దేశాన్ని కలిపేందుకు ఎంతలా పాటుపడుతోంది..? దేశ సమగ్రత కోసం ఎంత కష్టపడుతోందనేది చూడాలి. రాజ్యాంగ విలువల్ని పూర్తిగా పాటిస్తూ, దేశం కోసం పనిచేసే పార్టీనే జాతీయ పార్టీ అనుకోవాలి.

**రాష్ట్రానికి ఒక సిద్ధాంతం.. దేశానికి ఒక సిద్ధాంతం తప్పు..** భారత్ జోడో యాత్ర ద్వారా దేశమంతటా తిరిగి అందరినీ కలిసిన పార్టీ- నేను తెలంగాణలో తిరుగుతాను అంటే మాత్రం అనుమతి ఇవ్వదు. 1200 మంది తెలంగాణ కోసం బలిదానాలు చేసిన యువతకు నివాళి అర్పించేందుకు పర్మిషన్ ఇవ్వరు. కాంగ్రెస్ పార్టీ - దేశానికి ఒక సిద్ధాంతం.. పాలిస్తున్న రాష్ట్రాలకు మరో సిద్ధాంతం అనడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. కాంగ్రెస్ పార్టీ హిపోక్రసీ రాజకీయాలు అపేయాలి. నాకు తెలంగాణ యువత పోరాటాల మీద గౌరవం ఉంది. నేను ఆంధ్రాలో పుట్టినప్పటికీ, నేల గురించి ఎన్ని త్యాగాలు చేయడానికి అయినా సిద్ధపడే తెలంగాణ యువత ఆకాంక్షల మీద గౌరవం ఉంది. తెలంగాణలో కొందరు నాయకులు యువతను బలి చేసి గద్దెలనెక్కారు. నాకు తెలంగాణలో ఎలాంటి పదవులు వద్దు. కానీ తెలంగాణ యువత కోసం, వారి ఆశలు, ఆశయాల కోసం మనస్ఫూర్తిగా జనసేన పార్టీ పనిచేస్తుంది.

# ప్రజా వ్యతిరేక విదానాలపై పోరాటాలు ఉద్భతం చేయాలి - సీపీఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ




**పెనుగంచిప్రోలు, జూన్ 15 (వార్తాప్రభ) :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విదానాలపై పోరాటాలు మరింత ఉధృతంగా ముందుకు తీసుకెల్లాలనీ జాతీయ సీపీఐ కార్యదర్శి కె. రామకృష్ణ పిలుపు నిచ్చారు.ఎన్ టీ ఆర్ జిల్లా పెనుగంచిప్రోలు లోని స్నేహా గార్డెన్ లో జరుగుతున్న సీపీఐ రాజకీయ సైద్దాంతిక శిక్షణా తరగతుల కార్యక్రమంలో రాష్ట్ర సీపీఐ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన రామకృష్ణ మాట్లాడుతూ "రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు సీపీఐ వైఖరి" అనే అంశం తో పాటు కేంద్రం లో బిజెపి అనుసరిస్తున్న పరిస్థితుల విధానాలపై మోడీ పాలన తీరుపై ఉపన్యసించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి శిక్షణా తరగతులకు పెద్ద సంఖ్యలో హాజరవ్వడం పై సంతృప్తి వ్యక్త పరిచారు.ఇదే స్ఫూర్తి తో జిల్లా ల్లో శిక్షణా తరగతులు నిర్వహించాలనీ సూచించారు.ఇటీవల దేశ, ప్రపంచ వ్యాప్తంగా ఆశ్చర్యకర మైన రాజకీయ పరిణామాలు జరిగాయన్నారు.అమెరికా, బరితెగించి వ్యవహారిస్తుందని తీవ్ర స్థాయి లో విమర్శించారు. ప్రధాని మోడీ పూర్తిగా ట్రంప్ కు తల్గొరని మండి పడ్డారు.ట్రాంప్ తీరును ఖండించ లేని స్థితిలో ప్రధాని మోడీ వున్నారని అన్నారు.ఇరాన్ పై జరుగుతున్నాయని, దాన్ని చూసి ప్రపంచమే ఆశర్య పోతుందన్నారు, ఫిబ్రవరి 28 నుంచి అమెరికా ఇజ్రాయల్ కలిసి యుద్ధం చేస్తున్నా, ఏమాత్రం ఎనుకడుగు వేయకుండా ఇరాన్ ధైర్యం గా ఎలా ఎదురు దాడీ చేస్తుందో వివరించారు, భారత దేశం లో ఎంతో మంది ప్రధానులు చూసాము కాని ఇంతగా ఏ ప్రధాని లొంగ్గి పోయిన దాకా లేవని అన్నారు.ఆగస్టు 6 తేదీ నుండి 15 తేదీ వరకు దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రలలో ప్రచార పాదయాత్రలు చేయాలని పిలుపు నిచ్చారు.ప్రజలను ఆకట్టుకునేలా పాదయాత్ర లు నిర్వహించాలని సూచించారు. సెప్టెంబర్ ఒకటో తారీకున్న "చల్లో ఢిల్లీ " కార్యక్రమం జయప్రదం చేయాలన్నారు. ప్రజా సమస్యల పై పోరాటాలకు పూర్తి స్థాయి లో సమాయత్తం అవ్వాలన్నారు. రాష్ట్రం లో చంద్రబాబు పాలన గాడి తప్పిందన్నారు., సూపర్ సిక్స్ హామీలను నేర వేర్చలేని పరిస్థితి లో ప్రభుత్వం ఉందని, కూటమి పాలనలో అవినీతి పెరిగి పోతుందన్నారు.అప్పులల్లో పాలన నెట్టు కోస్తునారని విమర్శలు చేశారు.పోరాటలకు భారీగా జన సమీకరణ చేయాలన్నారు.ప్రజలలో పెరుగు తున్న అసంతృప్తి, అగ్రహాన్ని, గుర్తించి వాటిని ప్రజాఉద్యమాలుగా మలచాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రతి మనిషి బాగుండాలనే సిద్ధాంతమే కమ్యూనిజం అని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మరియు కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. మండల కేంద్రమైన పెనుగంచిప్రోలు లో భారత కమ్యూనిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి రాజకీయ సైద్దాంతిక శిక్షణ శిబిరం బైస్ అన్నారు. ముప్పాళ్ళ నాగేశ్వరరావు మరియు గద్దం కోటేశ్వరరావు కలిసి రచించిన కృష్ణా- గోదావరి గ్యాస్ మన హక్కు అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. తదనంతరం ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు ఎక్కడ బలహీనపడలేదని ప్రతి శ్రామిక వర్గానికి వెన్నుదన్నుగా నిలబడుతూ ప్రజలతో మమేకమవుతూ ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేసి సమస్యలకు ఎదురు వెళుతూ శ్రామికుడికి అండగా ఉండేదే ఎర్రజెండా అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, రాష్ట్ర సీపీఐ నాయకులు ముప్పాల నాగేశ్వర రావు, జే వి సత్య నారా యణ,రాష్ట్ర మహిళా సమైఖ్య అధ్యక్షురాలు పి. దుర్గా భవాని,రాష్ట్ర కౌలు రైతు సంఘం కార్యదర్శి జమల య్య, జిల్లా రైతు సంఘం నాయకులు యలమందయ్యా, చూండూరు సుభారావు, వలం కొండ బ్రాహ్మం, పొన్నం నరసింహారావు, పద్మాల వెంకటేశ్వర్లు, చల్లాల. శివాజీ,జక్కులూరి వెంకటేశ్వర్లు, వేల్పుల కాంతయ్య, కోలకాని అర్జునరావు. గద్దం శ్రీను. శర్మ.. పొన్నం జాన్సీ, వలం కొండ భాను తదితరులు పాల్గొన్నారు...

# పతక విజేత పారా క్రీడాకారులకు ఘన సన్మానం



**విజయవాడ, జూన్ 15 (వార్తాప్రభ) :** జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణంగా నిలిచిన పారా క్రీడాకారులను సత్కరించేందుకు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో విజయవాడలోని టాగోర్ లైబ్రరీలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రంథాలయ శాఖ చీఫ్ లైబ్రేరియన్ రమాదేవి , ఇండియన్ బ్లైండ్ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ అజయ్ రెడ్డి హాజరై పతక విజేత క్రీడాకారులను అభినందించారు. వారి కృషి, పట్టుదల మరియు విజయాలు సమాజానికి ఆదర్శమని కొనియాడారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్‌ల ప్రతినిధులు, కార్యవర్గ సభ్యులు, క్రీడాకారులు, కోచ్‌లు మరియు క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన పారా క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు. పారా క్రీడల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న జిల్లా సంఘాల ప్రతినిధులను కూడా ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమం పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు గోనుగుంట్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో, సంఘం కార్యదర్శి రామస్వామి సహకారంతో విజయవంతంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, రాష్ట్రంలో పారా క్రీడల అభివృద్ధికి మరింత కృషి చేస్తామని, ప్రతిభావంతులైన దివ్యాంగ క్రీడాకారులకు అవసరమైన ప్రోత్సాహం మరియు అవకాశాలు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు.

# తాసిల్దార్ కు జనసేన నేతల సత్కారం



**కోడూరు,జూన్ 15 (వార్తాప్రభ) :** కోడూరు తాసిల్దార్ గా బాధ్యతలు చేపట్టిన కే పూర్ణచంద్రరావును కోడూరు మండల జనసేన పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో ఆయనను కలుసుకొని శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. మండల జనసేన పార్టీ అధ్యక్షులు బడే వారి పాలెం పిఏసిఎస్ చైర్పర్సన్ మరే గంగయ్య, కోడూరు పట్టణ అధ్యక్షులు కోట రాంబాబు, పూత బోయిన సీతారత్న సాయిబాబు, బచ్చు వెంకటేష్, వర్రే రాంబాబు,లంకె రవి, పెద్ది బాబురావు, మల్ల వెంకటేశ్వరరావు, కాగిత రామారావు, బచ్చు పూర్ణచంద్రరావు, పరిసే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అజాతశత్రువు జన్మదిన ఉత్సవ మహోత్సవ వేడుకలు




**విస్సన్నపేట,జూన్ 15 (వార్తాప్రభ) :** టిడిపి రాష్ట్ర నాయకులు అజాత శత్రువు నెక్కలపు వెంకటేశ్వరరావు అలియాస్ బద్దె జన్మదిన ఉత్సవ మహోత్సవ వేడుకలను తెలుగు తమ్ముళ్లు ఘనంగా నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత నుండి సోషల్ మీడియాలో ఆయన పుట్టినరోజు వేడుకలకు సంబంధించి భారీ ఎత్తున పలు పోస్టులు హల్చల్ చేశాయి. వాట్సప్, ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్, టెలిగ్రామ్, ఎక్స్ తదితర మాధ్యమాలతో పాటు పరోక్షంగా ఫోన్ల ద్వారా ప్రత్యక్షం గా ఫ్లవర్ బొకేలతో కొందరు కేక్ కటింగ్ కార్యక్రమాలతో మరికొందరు వేలాదిమంది జన్మదినోత్సవ సంబరాలను నైనానందకారంగా ఘనంగా నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. సుదూర ప్రాంతాలలో ఉన్న తిరు వూరు నియోజకవర్గ సీనియర్ యువ నాయకులు ఎన్ఆర్ఐ వల్లభనేని గిరిబాబు ఫోను ద్వారా జన్మదిన శుభాకాంక్షలు ప్రత్యేకంగా తెలియజేశారు.

# పల్లె పాలెం ఇంగ్లీష్ టాపర్ విద్యార్థిని కు సన్మానం



**కృత్తివెన్ను,జూన్ 15 (వార్తాప్రభ) :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పల్లె పాలెం నందు పదవ తరగతి పరీక్షలలో ఇంగ్లీష్ నందు పాఠశాల లోఅత్యధిక మార్కులు (90)సాధించిన సందర్భంగా సోమవారం బొడ్డు ధనుశ్రీ ఆంగ్ల ఉపాధ్యాయులు కొప్పినీడి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో ప్రధాన ఉపాధ్యాయులు టీవీ వీ ప్రసాద్ దుస్సాలువా తో సత్కరించారు. ఈ సందర్భంగా హెచ్ ఎం ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని అన్నారు. సూర్య ప్రకాష్ మాట్లాడుతూ ధనుశ్రీ ని ఆదర్శంగా తీసుకొని ప్రతి విద్యార్థి మాతృభాష తో పాటు ఇంగ్లీష్, హిందీ లో ప్రావీణ్యం సంపాదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యేసు పాదం మురళీకృష్ణ ప్రభ త్రివేణి రేఖ దుర్గా జ్యోతి సి ఆర్ పి సోమశేఖర్ పాల్గొన్నారు.

# కనులపండువగా శ్రీ వేంకటేశ్వరుని ఊంజల సేవ...





**గుడ్లవల్లేరు,జూన్ 15 (వార్తాప్రభ) :** భూ సమేత శ్రీ వేంకటేశ్వరాలయంలో స్వామివార్ల ఉత్సవ మూర్తులకు మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట క్రిష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేద మంత్రోచ్ఛరణ నడుమ ఊంజల సేవను కనులపండువగా చేపట్టారు. అనంతరం ప్రత్యేక పూజల్ని నిర్వహించారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. ఆలయ నిర్వాహకులు కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు తదితరులు ఉన్నారు.

# కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీ "బీసీల రక్షణ చట్టం" తక్షణమే ప్రకటించాలి

- యాదవులపై జరిగిన అత్యాయత్నాన్ని తీవ్రంగా ఖండించిన యాదవ నేతలు.
- నిందితులను తక్షణమే అరెస్టు చేసి, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ముందు యాదవుల ధర్నా

**ఒంగోలు,జూన్ 15 (వార్తాప్రభ) :** యాదవులపై దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఒంగోలు కలెక్టర్ ఆఫీస్ ముందు జరిగినటువంటి యాదవ సామాజిక వర్గం ఐక్యవేదిక నిరసన కార్యక్రమానికి చల్లా హరిబాబు యాదవ్, మిరియం శీను యాదవ్ లు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైనటువంటి అనేకమంది వివిధ సంఘాలకు చెందిన నాయకులు మాట్లాడుతూ యాదవ సామాజిక వర్గం పైన జరిగినటువంటి దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ సమావేశంలో మాట్లాడినటువంటి వారిలో అధిక శాతం మంది కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీ "బీసీ రక్షణ చట్టం" తక్షణమే తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గొర్రెలు మేకల పెంపకం దారులతో పాటు పశువుల పెంపకం దారులకు కూడా ప్రతి గ్రామపంచాయతీలో పశువుల పోరంబోకు భూమిని కేటాయించాలని, ఇప్పటికే కేటాయించినటువంటి భూములు అన్యాక్రాంతమైనటువంటి వాటిని ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకొని ఆయా వర్గాల వారికి కేటాయించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం లాగే బీసీ అట్రాసిటీ చట్టం తీసుకొస్తామని ఇప్పుడు అధికారంలో ఉన్నటువంటి కూటమి ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినటువంటి విధంగా తప్పనిసరిగా ఈదుముడిలో జరిగినటువంటి సంఘటన నుంచే బీసీ రక్షణ చట్టాన్ని అమలు చేస్తూ సెక్షన్లను విధించాలని పలువురు అభిప్రాయపడ్డారు. మరికొందరి మాట్లాడుతూ ఇతర కులాల వారి యొక్క మనోభావాలను అధికారులు అర్థం చేసుకొని హత్యాయత్నం చేసినటువంటి వారి యొక్క బృందం పైన నూతన చట్టాల ప్రకారంగా హత్యాయత్నం కేసు సెక్షన్లను విధించాలని, దెబ్బలు తిన్నవారి





కంప్లైంట్ మేరకు దాడి చేసిన వారి మీద పెట్టిన సెక్షన్లనే దాడి చేసిన వారు ఇచ్చిన కంప్లైంట్ ఆధారంగా గాయపడిన వారి మీద కూడా అవే సెక్షన్లు నమోదు చేయడం ఎంతవరకు సమంజసం అని పలువురు సభాముఖంగా ప్రశ్నించారు. ఈ కార్యక్రమానికి యాదవ ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ చైర్మన్ మద్దుల వెంకట కోటయ్య యాదవ్, పలు సంఘాల రాష్ట్ర నాయకులు పి ఎల్ పి యాదవ్,కుర్రా శ్రీనివాస్ యాదవ్, వెంగళరావు యాదవ్, బోట్ల రామారావు యాదవ్, కొలుసు మోహన్ యాదవ్,వీరు యాదవ్, నాగార్జున యాదవ్, బంక చిరంజీవి యాదవ్, రాజా ధనవర్మ యాదవ్, సుబ్బారావు యాదవ్, ఒంటేరు నాగేశ్వరరావు యాదవ్, అల్లంరాజు శ్రీనివాస్ యాదవ్, మెట్ల చెంచయ్య యాదవ్, బుర్రి బుల్లెట్ శ్రీను యాదవ్, బుర్రి వెంకీ యాదవ్, బోరి గొర్ల అజయ్ యాదవ్, నరసింహ యాదవ్, మూర్తి యాదవ్ లతోపాటు పలువురు యాదవ సంఘం శ్రేయోభిలాషులు, యాదవ న్యాయవాదులు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ఐక్యవేదిక నాయకులు, ఎంఆర్పిఎస్ ఉద్యమకారులు, మహిళా నాయకురాలు రాజ్యలక్ష్మి యాదవ్ మరికొందరు మహిళలు వీరితో పాటు బాధితుల గ్రామానికి చెందినటువంటి సుమారు 300 మంది యాదవ సోదరులు గుంటూరు జిల్లా పెదనందిపాడు నియోజకవర్గం నుంచి వచ్చినటువంటి యాదవులు అనేకమంది, గొర్రెలు మేకల పెంపకం దారులు మరియు వివిధ రాజకీయ పార్టీలకు చెందినటువంటి యాదవులు హాజరయ్యారు. సంఘాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా జరిగినటువంటి ఈ సమావేశానికి సుమారు 500 మంది యాదవ్ సోదరులు హాజరయ్యారు. జరిగిన దాడికి నిరసనగా ఆయా గ్రామాలను వచ్చినటువంటి గొర్రెల పెంపకం దారులు అర్ధనగ్న ప్రదర్శన చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు.

# ఘంటసాలలో ఘనంగా "ఘంటసాల" స్వర సుమాంజలి గాన పోటీలు

- మధుర గాయకులు ఘంటసాల వారి పాటలతో మార్మోగిన శ్రీజలధీశ్వర స్వామి ఆలయ ప్రాంగణం



**ఘంటసాల/అవనిగడ్డ,జూన్ 15 (వార్తాప్రభ) :** ఘంటసాలలో ఘంటసాల స్వర సుమాంజలి గాన పోటీలు ఘనంగా జరిగాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచే కాక హైదరాబాద్ నుంచి సైతం వచ్చిన గాయకులు తమ గాన మాధుర్యంతో ఘంటసాల వారి పాటలను పాడి ఆహుతులను ఆకట్టుకున్నారు. ఘంటసాల కళాసమితి ఆధ్వర్యంలో ఘంటసాల గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు పోతార్లంక వెంకటేశ్వరరావు ఆర్థిక సహకారంతో స్థానిక శ్రీజలధీశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఈ పోటీలను నిర్వహించారు. మధుర గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు ఘంటసాల గ్రామంలో కచేరి చేసి 60 సంవత్సరాలు అయిన సందర్భంగా నిర్వహించిన ఈ పోటీలలో ఏలూరుకు చెందిన సీహెచ్. యజ్ఞ ప్రసాద్ ప్రథమ బహుమతిని, ఏలూరు జిల్లా చింతలపూడికి చెందిన టి.యేసేబు ద్వితీయ బహుమతిని, కృష్ణాజిల్లా ఘంటసాలపాలెంకు చెందిన పాత్రికేయులు పల్లికొండ వాసు తృతీయ బహుమతిని కైవసం చేసుకున్నారు. గుంటూరు గీతా గాయిత్రి (కంకిపాడు), కె.రామకృష్ణ (హైదరాబాద్). కె.కుమార్ బాబు (ఘంటసాల), కేఎస్పీ ప్రసాద్ (పాలకొల్లు). కె.నాగేశ్వరరావు (కైకులూరు), కె.విజయశ్రీ (కంకిపాడు)లకు ప్రత్యేక బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఘంటసాల కళాసమితి గౌరవ అధ్యక్షులు రామకృష్ణ మాట్లాడుతూ ఏ కాలమైన ఘంటసాల మధుర గానం జీవించే ఉంటుందని పేర్కొన్నారు. ఘంటసాల కళాసమితి అధ్యక్షులు ఘంటసాల కృష్ణ మోహన్ మాట్లాడుతూ ఘంటసాల వంశ జన్మశాలైన ఘంటసాల గ్రామంలో వారి వంశం అర్చకత్వం చేసిన శ్రీజలధీశ్వర ఆలయంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గాయకులు మధుర గాయకులు ఘంటసాల వారి పాటలను ఆలపించడం పూర్వజన్మ సుకృతం అన్నారు. ఘంటసాల స్వర సుమాంజలి పోటీల్లో 20 మంది గాయకులు పాల్గొని తమ ప్రతిభను చూపినట్లు చెప్పారు. ఘంటసాల కళాపీఠం వ్యవస్థాపకులు కాటూరి మురళీకృష్ణ, కార్యదర్శి పోతన వెంకటేశ్వరరావు తదితరులు ప్రసంగించారు. ఈ పాటల పోటీలకు న్యాయ నిర్ణేతలుగా, బి.అనురాధ, ఎం. రత్న కుమారి, ఘంటసాల రాజ్యలక్ష్మి, దింటకుర్తి జ్యోతి, ఆర్.ప్రగ్న వ్యవహరించారు.

# విద్యుత్ ఉపకరణాలు మాయం చేశారు మొండి స్తంభాలు ఉంచారు

## వైసిపి జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి సిరసాని ప్రకాష్ ఆగ్రహం





**విస్సన్నపేట,జూన్ 15 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో జగనన్న కాలనీలో గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన రెడ్డి ఆదేశాలతో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ విద్యుత్తు స్తంభాల ఉపకరణాలు మాయ అవటంపై వైసీపీ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. వివరాలు లోకి వెళితే సోమవారం ఉదయం వైసీపీ పార్టీ కార్యాలయంలో బూత్ ఇన్చార్జిల సమావేశంలో రాబోయే కాలంలో సర్ నిబంధనలకు అనుగుణంగా ఏ ఓటు ఎక్కడ ఎవరిని తొలగించాలి ఏ ఓటు ఎక్కడికి బదిలీ చేయాలి తదితర అంశాల పట్ల సమగ్ర అవగాహనను కల్పించడంతోపాటు ఒక ఇంటి ముందుకు వెళితే ఆ ఇంటిలో ఉన్న వారు ఎవరు, లేని వారెవరు, అత్తవారింటికి వెళ్ళిన ఆడపడుచు ఎవరు,అత్తవారింటికి వచ్చిన ఆడపడుచు ఎవరు తదితర అంశాల పట్ల సమగ్ర అవగాహన కలిగిన వారే ఆ ఏరియా బూత్ ఇన్చార్జిలుగా పట్టు సాధించగలరని ప్రతి ఒక్క ఓటును ఓడిసిపట్టి రాబోయే కాలంలో గ్రామపంచాయతీ మండల ప్రజా పరిషత్ జడ్పిటిసి ఎన్నికలలో విజయాలకు పరమపద సోపానాలుగా ముందుకు వెళ్లగలమని అదే బాటలో ప్రతి ఒక్కరం పథక రచన చేయాలని చర్చించడం జరిగింది. జగనన్న కాలనీలో గతంలో సొంత ఇంటి కలల సహకారానికి విద్యుత్ వెలుగులతో పాటు రహదారులకు ఇరువైపుల ఫల పుష్ప ఔషధ మొక్కలు ఏర్పాటు డ్రైనేజీ వ్యవస్థ త్రాగునీటి సౌకర్యం తదితరాలను ఏర్పాట్లకు శ్రీకారం చుట్టినట్లు ఎన్టీఆర్ జిల్లా వైసీపీ లీగల్ సెల్ కార్యదర్శి లాయర్ శిరసాని ప్రకాష్ తెలియజేశారు. విద్యుత్ స్తంభాలకు ఉండవలసిన విద్యుత్ వైర్లు ట్యూబ్లైట్ సెట్లు యాంకర్లు తదితరాలు మాయం కావడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏదైనా ప్రజలకు చేయూతనివ్వాలి కాని అభివృద్ధి నిరోధకం కాకూడదని కూటమి ప్రభుత్వం జగనన్న కాలనీ నివాసితులకు ఇంటి నిర్మాణాలకు చేయూత ఇవ్వాలన్నారు. విద్యుత్తు సంబంధిత ఉపకరణాలు తొలగించే పరిస్థితి వస్తే ఎన్టీఆర్ జిల్లా వైసిపి జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్, తిరువూరు నియోజకవర్గ వైసిపి ఇన్చార్జ్ నల్లగట్ల స్వామిదాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మద్ది రెడ్డి సూర్యనారాయణ రెడ్డి, జడ్పిటిసి సభ్యులు భీమిరెడ్డి లోకేశ్వర రెడ్డి, నియోజకవర్గ యూత్ ఇన్చార్జ్ దేశి రెడ్డి శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు ఓలేటి దుర్గారావు, ఎంపీపీ గద్దల మల్లయ్య, విస్సన్నపేట పట్టణ వైసీపీ పార్టీ అధ్యక్షులు ఎన్ని కుటుంబరావు ఇతర నామినేటెడ్ పోస్టులు నిర్వహించే పెద్దలల ఆధ్వర్యంలో భారీ ఎత్తున పోరాటం చేస్తామన్నారు.

# ఐఐటి సీటు సాధించిన వికాస్ టెక్నో విద్యార్థిని అభినందించిన వికాస్ చైర్మన్ నర్సిరెడ్డి నరెడ్ల




**విసన్నపేట,జూన్ 15 (వార్తాప్రభ) :** వికాస్ టెక్నో స్కూల్‌లో విద్యనభ్యసించిన ఆకుల శ్రీవర్ష( కె.ఆర్ పర్వ) ప్రతిష్టాత్మకమైన జె ఈఈ అడ్వాన్స్ 2026 పరీక్షలో ఆల్ ఇండియా ర్యాంకు 6938 సాధించి, ఐ ఐ టి భువనేశ్వర్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో ప్రవేశం సాధించటంతో వికాస్ విద్యా సంస్థల అధినేత నరెడ్ల నర్సిరెడ్డి శ్రీవర్షకు ఫ్లవర్ బొకే అందించి తమ ఆశీస్సులు అందించారు. ఆమె సాధించిన విజయం పాఠశాలకు గర్వకారణమని ఆమె తండ్రి ఆకుల శేషగిరిరావుకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నామని చెప్పారు. బాల్యం నుండి విద్యా పట్ల ఆమె చూపిన క్రమశిక్షణ, కృషి, పట్టుదల, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం మరియు తల్లిదండ్రుల సహకారంతో వెరసి మహోన్నత విజయానికి మార్గదర్శకాలు అయ్యాయి అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ వేమన నర్సిరెడ్డి,వికాస్ టెక్నో స్కూల్ ప్రిన్సిపల్ ఆర్ గోపి, వైస్ ప్రిన్సిపల్ పి శ్రీనివాస రెడ్డి టీచింగ్ నాన్ టీచింగ్ స్టాఫ్ తదితరులు పాల్గొని శ్రీవర్షకు అభినందనలు తెలియజేశారు.

# మర్యాదపూర్వక కలయిక

- తిరువూరు నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకులు
- నెక్కలపు శ్రీనివాసరావు (ఎన్టీవీ ప్రసాద్ )



**విస్సన్నపేట,జూన్ 15 (వార్తాప్రభ) :** తిరువూరు నియోజవర్గ సీనియర్ టిడిపి నాయకులు శ్రీనివాసరావు నెక్కలపు (ఎన్టీవీ ప్రసాద్ ) ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధ్యక్షురాలు గద్దె అనురాధను మర్యాదపూర్వకంగా కలిసి ఫ్రూట్స్ అందించారు. తిరువూరు నియోజకవర్గ రాజకీయ సామాజిక అంశాలపై చర్చించినట్లు చెప్పారు.

# వందోసారి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచిన జీజీహెచ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ గోపాలకృష్ణ..

- రక్తదాతలే ప్రాణదాతలు: డాక్టర్ శ్రీనివాసన్...






**కాకినాడ,జూన్ 15 (వార్తాప్రభ) :** ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ ప్రభుత్వ సర్వజన సామాన్య ఆసుపత్రి (జీజీహెచ్)లో అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ పద్మ రామ్ ఎల్ఎమ్ఎఫ్ కాకినాడ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. సమాజంలో రక్తదానంపై అవగాహన పెంపొందించడం, అత్యవసర పరిస్థితుల్లో రక్త కొరతను నివారించడం, యువతలో సేవాభావాన్ని పెంపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణలోని సర్జికల్ సెమినార్ హాల్లో నిర్వహించిన సభలో కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసన్, సీఎస్ఆర్ఎమ్‌వో డాక్టర్ పితాని కోమలి, అలయన్స్ క్లబ్ 106 గవర్నర్ కె.వి.వి. సత్యనారాయణ, క్లబ్ అధ్యక్షులు వెంకట శ్రీనివాసరావు తదితరులు పాల్గొని రక్తదాతలను అభినందించారు. కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రతి రెండు సెకన్లకు ఒక వ్యక్తికి రక్తం అవసరమవుతుందని, ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, గర్భిణుల అత్యవసర పరిస్థితులు, తలసేమియా,క్యాన్సర్ వంటి వ్యాధులతో బాధపడుతున్న రోగులకు రక్తం ప్రాణాధారంగా మారుతుందని పేర్కొన్నారు. ఆధునిక వైద్యశాస్త్రం ఎంత అభివృద్ధి చెందినా మానవ రక్తానికి ప్రత్యామ్నాయం ఇంకా కనుగొనలేకపోయిందని, అందువల్ల స్వచ్ఛంద రక్తదాతలే వేలాది మంది రోగుల జీవితాలకు ఆశాకిరణంగా నిలుస్తున్నారని వివరించారు. కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసన్ మాట్లాడుతూ రక్తదానం చేయడం అనేది కేవలం దాతృత్వ కార్యక్రమం మాత్రమే కాదని, అది ఒక ప్రాణాన్ని కాపాడే అత్యున్నత మానవతా సేవ అని పేర్కొన్నారు. సాధారణంగా ఒక యూనిట్ రక్తం ద్వారా మూడు మంది వరకు రోగులకు ఉపయోగపడే రక్త భాగాలను వేరు చేసి అందించవచ్చని తెలిపారు. ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, ప్రతి ఆరోగ్యవంతుడు క్రమం తప్పకుండా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. వేసవి కాలంలో రక్త నిల్వలు తగ్గిపోతుండటంతో ప్రభుత్వ ఆసుపత్రులు, రక్త బ్యాంకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, అలాంటి సమయంలో స్వచ్ఛంద సంస్థలు, సేవా సంఘాలు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. రక్తదానం చేసిన వారందరికీ జీజీహెచ్ తరఫున ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. సీఎస్ఆర్ఎమ్‌వో డాక్టర్ పితాని కోమలి మాట్లాడుతూ రక్తదానం అనేది ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సూచిక అని అన్నారు. ఒక వ్యక్తి చేసిన రక్తదానం వల్ల మరో కుటుంబంలో ఆశలు చిగురిస్తాయని, అనేక మంది రోగులకు పునర్జన్మ లభిస్తుందని చెప్పారు. యువతలో సేవాస్ఫూర్తి పెరిగినప్పుడే స్వచ్ఛంద రక్తదాన ఉద్యమం మరింత బలోపేతం అవుతుందని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు రక్తదానంపై అవగాహన పెంచుకుని ఆరోగ్య పరిస్థితులు అనుకూలిస్తే రక్తదానం చేయాలని సూచించారు. రక్తదానం వల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తవని, వైద్యుల పర్యవేక్షణలో పూర్తిస్థాయి భద్రతతో ఈ ప్రక్రియ జరుగుతుందని వివరించారు. వందోసారి రక్తదానం చేసి చరిత్ర సృష్టించిన గోపాలకృష్ణ. ఈ కార్యక్రమంలో అత్యంత ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి హెల్త్ ఇన్‌స్పెక్టర్ ఏ. గోపాలకృష్ణ చేసిన వందోసారి రక్తదానం. ఒక వ్యక్తి జీవితకాలంలో వంద సార్లు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అనేది అరుదైన ఘనతగా వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ప్రజారోగ్య రంగంలో సేవలందిస్తున్న గోపాలకృష్ణ,ఉద్యోగ బాధ్యతలతో పాటు రక్తదాన ఉద్యమాన్ని జీవిత లక్ష్యంగా స్వీకరించారు. గత 36సంవత్సరాలుగా నిరంతరాయంగా రక్తదానం చేస్తూ వందోసారి రక్తదానం చేయడం ద్వారా సమాజానికి ఆదర్శంగా నిలిచారు. ఆయన సేవలను కొనియాడుతూ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు,సేవా సంస్థల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. గోపాలకృష్ణ మాట్లాడుతూ రక్తదానం ద్వారా లభించే ఆత్మసంతృప్తి మరే సేవలోనూ దొరకదని అన్నారు. తన రక్తం వల్ల ఎక్కడో ఒక రోగి ప్రాణం నిలబడుతుందనే భావనే తనకు ప్రేరణగా నిలుస్తోందని చెప్పారు. యువత ముందుకు వచ్చి స్వచ్ఛంద రక్తదాతలుగా నమోదు చేసుకోవాలని కోరారు.

**ప్రపంచ రక్తదాతల దినోత్సవం ప్రాధాన్యం..** ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహిస్తారు. రక్తదాతల సేవలను గుర్తించి వారికి కృతజ్ఞతలు తెలపడం, కొత్త రక్తదాతలను ప్రోత్సహించడం, సురక్షిత రక్త నిల్వలను పెంపొందించడం ఈ దినోత్సవ ప్రధాన లక్ష్యం. ఈ ఏడాది కూడా ప్రపంచ వ్యాప్తంగా స్వచ్ఛంద రక్తదానం కాకినాడ జీజీహెచ్‌లో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరం కూడా అదే సందేశాన్ని సమాజానికి చాటిచెప్పింది. ముఖ్యంగా గోపాలకృష్ణ చేసిన వందోసారి రక్తదానం కార్యక్రమానికి ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చింది. రక్తదాతల సేవలను కొనియాడుతూ నిర్వహించిన ఈ శిబిరం స్వచ్ఛంద రక్తదాన ఉద్యమానికి మరింత ప్రోత్సాహాన్ని అందించిందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సార్జెంట్ గా పని చేస్తున్న కె. భీమారావు తన ఇద్దరు కుమారులు కొర్ల అవినాష్, కోర్ల వికాస్ లతో కలిసి రక్తదానం చేయడం మరో విశేషం. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ పద్మ రామ్ ఎల్ఎమ్ఎఫ్ కాకినాడ ఆధ్వర్యంలోసభ్యులు పి. గోవింద రాజులు, ముని రెడ్డి, కిరణ్ కుమార్, రవి కుమార్, ఆర్ సి నాగేంద్ర రావు, జెడ్ సి కే శ్రీదేవి, జి జి హెచ్ బ్లడ్ బ్యాంకు వైద్యులు, పెదాలజీ హెచ్ ఓడి డాక్టర్ రాజ్యలక్ష్మి, డాక్టర్ అనిల్,ఇతర స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.

# మల్లాపూర్ ఐఈఈలో అంబికా ఇండస్ట్రీస్ కాలుష్యంపై ఫిర్యాదు






**కాప్రా, జూన్ 15:(వార్తా ప్రభ)**కాప్రా పరిధిలోనిమల్లాపూర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ (ఐఈఈ)లోని ప్లాట్ నెం.165లో ఉన్న అంబికా ఇండస్ట్రీస్ నుంచి వెలువడుతున్న ప్రమాదకర రసాయన వ్యర్థాలు, విషపూరిత వాయువుల కారణంగా స్థానిక ప్రజలు తీవ్ర ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తూ తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ)కి స్థానిక నివాసి జి. శివ లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు.పరిశ్రమ నుంచి విడుదలవుతున్న రసాయన వ్యర్థాలు, దుర్వాసన వెదజల్లే విషవాయువుల ప్రభావంతో పరిసర ప్రాంత ప్రజలు శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, చర్మవ్యాధులు, కంటి మంటలు, అలర్జీ సమస్యలతో బాధపడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.పరిశ్రమలో ఉత్పత్తి ప్రక్రియల అనంతరం వెలువడే వ్యర్థాలను నిబంధనల మేరకు శుద్ధి చేయకుండా బయటకు విడుదల చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. రాత్రి వేళల్లో కాలుష్య ప్రభావం మరింత అధికంగా ఉండటంతో ప్రజలు ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొంటోందని పేర్కొన్నారు.కాలుష్య ప్రభావంతో వందలాది కుటుంబాల ఆరోగ్యం ప్రమాదంలో పడిందని, భూగర్భ జలాలు సైతం కలుషితమయ్యే ప్రమాదం ఉందని ఫిర్యాదులో ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమ కాలుష్య నియంత్రణ నిబంధనలను పాటిస్తున్నదా లేదా అన్న విషయంపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు.అంబికా ఇండస్ట్రీస్‌లో తక్షణమే తనిఖీలు నిర్వహించి గాలి, నీటి నమూనాలను సేకరించి పరీక్షలు చేయాలని, కాలుష్య నియంత్రణ ప్రమాణాలను ఉల్లంఘించినట్లు తేలితే సంబంధిత పరిశ్రమపై కఠిన చర్యలు తీసుకోవాలని జి. శివ టీజీపీసీబీ అధికారులను కోరారు. స్థానిక ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

# కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీపై చర్యలు తీసుకోవాలి

- జేఏసీ డిమాండ్.



**దమ్మాయిగూడ, జూన్ 15:(వార్తా ప్రభ)**సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో కార్పొరేట్ విద్య నియంత్రణ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించేందుకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.విద్య అనేది వ్యాపారం కాదని, ప్రతి బిడ్డకు విద్యను అందించడం రాష్ట్ర ప్రభుత్వ రాజ్యాంగబద్ధ బాధ్యత అని వారు పేర్కొన్నారు. ప్రస్తుతం అనేక ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.అదేవిధంగా రైట్ టు ఎడ్యుకేషన్ (ఆర్‌టీఈ) చట్టం--2009 ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మరియు ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు 25 శాతం ఉచిత సీట్లు కేటాయించాల్సిన నిబంధన ఉన్నప్పటికీ, రాష్ట్రంలోని అనేక విద్యాసంస్థలు ఈ చట్టాన్ని అమలు చేయడం లేదని జేఏసీ నాయకులు ఆరోపించారు. ఈ పరిస్థితిని తీవ్రంగా ఖండిస్తూ ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో చెన్నోజి శ్రీనివాసులు, ఎన్‌బీఎంఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణా నాయక్, ఎన్‌బీఎంఐ తెలంగాణ రాష్ట్ర లీగల్ అడ్వైజర్ రవి రాజ్ రాథోడ్, జనసేన సీనియర్ నాయకులు రమేష్, ఆర్. భరత్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రవి రాజ్ రాథోడ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ప్రైవేట్ మరియు కార్పొరేట్ విద్యాసంస్థకు వర్తించే విధంగా ఫీజు నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. అలాగే ఆర్‌టీఈ చట్టాన్ని కచ్చితంగా అమలు చేసి పేద విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. విద్య ప్రతి బిడ్డ ప్రాథమిక హక్కు అని, ఆ హక్కును కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు.

# మహిళల ఆర్థిక స్వావలంబనకు కుట్టుశిక్షణే మార్గం.

-ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి.



**ఎల్బీనగర్ / వార్తప్రభ ( జూన్ 15):** లింగోజిగూడ డివిజన్ పరిధిలోని మైత్రి నగర్‌లో కుట్టుశిక్షణ పూర్తి చేసుకున్న మహిళల సమావేశానికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్నో ఏళ్లుగా ఉచిత శిక్షణ ఇస్తున్న బండి ప్రభావతిని ఆయన అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..టైలరింగ్ శిక్షణ ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొంది, ఆర్థిక స్వావలంబన సాధించవచ్చన్నారు.సొంత సంపాదనతో సమాజంలో మహిళల గౌరవం పెరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం మహిళలు కుట్టిన దుస్తులను పరిశీలించారు. జయచంద్ర రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ తరఫున ఒక పీకో మిషన్ అందజేయగా, బీఆర్ఎస్ నేత తిలక్ రావు మరో మిషన్ ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర రెడ్డి, శ్రీధర్, కళావతి పాల్గొన్నారు.

# యుద్ధ ప్రాతిపదికన డంపింగ్ యార్డును తొలగించాలి

- ప్రజావాణిలో డిమాండ్ చేసిన జవహర్ నగర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట కమిటీ
- లేనియెడల ప్రజా ఆందోళనలు నిర్వహిస్తామని ప్రకటించిన పోరాట కమిటీలోని బాగస్వామ్య సంస్థలకు చెందిన నేతలు.
- అధనపు జిల్లా కలెక్టర్ విజయేందర్ రెడ్డి కి సమర్పించిన వినతి పత్రం.



**జవహర్ నగర్, జూన్ 15:(వార్తా ప్రభ)**ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న జవహర్ నగర్ రాంకీ చెత్త డంపింగ్ యార్డును యుద్ధప్రాతిపదికన వెంటనే తొలగించాలని ప్రజావాణిలో జవహర్ డంపింగ్ యార్డు పోరాట కమిటీ డిమాండ్ చేసింది. 2026, జూన్-15, సోమవారం రోజున మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డి.విజయేందర్ రెడ్డికి జేఏసీ చైర్మన్ షేక్ షావలి అధ్యక్షతన జవహర్ నగర్ డంపింగ్ యార్డు కో-కన్వీనర్స్ కమిటీ సభ్యులు వినతిపత్రాన్ని సమర్పించారు. జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటి చైర్మన్ షేక్ షావలి తో పాటు జవహర్ నగర్ మాజీ కార్పొరేటర్ గొడుగు వేణు, గడ్డం సదానందం సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్, సిపిఐ తోటపల్లి శంకర్, సిపిఎం టి.శివన్నారాయణ, తెలంగాణ జన సమితి బద్రగామి ఆంజినేయులు, ఏ.ఐ.ఎఫ్.టి.యు. వై.మల్లేష్, జనవిజ్ఞాన వేదిక ఎం.శ్రీనివాస్, పిడిఎం చంద్రమౌళి, పికెఎం డి.జాన్, జనవాణి ప్రతాప్, సిఐటియు నర్సింగరావు, సిఎంఎస్ అల్లూరి సావిత్రి, పిఓడబ్ల్యూ(విముక్తి) పెర్క సునీత, టియుసిఐ వి.ప్రవీణ్, దక్షిణ భారతదేశ రాజకీయ సమాఖ్య మహ్మద్ రషీద్ ద్రావిడ, కవి, కళాకారుడు మేడశీను, శ్రావణ్ కుమార్, తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి మోనార్క్ దుర్గాప్రసాద్, జర్నలిస్ట్ కొన్నెవేణు, సిహెచ్ మాదవరెడ్డి, రాంపల్లి అశోక్ కుమార్, జేవివి పి.శేషగిరిరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. డంపింగ్ యార్డు చుట్టుముట్టూ ఉన్న జవహర్ నగర్, కాప్రా, యాప్రాల్, కీసర, దమ్మాయిగూడ, నాగారం, రాంపల్లి, ఘట్ కేసర్ లాంటి తదితర ప్రాంతాల్లో ప్రకృతి పర్యావరణాన్ని, మానవ మనుగడను, ఇతర జీవరాశులను దెబ్బతీస్తున్న డంపింగ్ యార్డు పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఎండగట్టారు. ప్రజల ఆరోగ్య భద్రతమీద డంపింగ్ యార్డు తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయని అన్నారు. గాలి, నీరు, నేల పూర్తిగా కలుషితంగా మారి, ప్రపంచంలోనే ప్రమాదకరమైన ప్రాంతంగా జవహర్ నగర్ డంపింగ్ యార్డు నాలుగువ స్థానంలో ఉన్నదని పర్యావరణ శాస్త్రవేత్తలు, సైంటిస్టులు తీవ్ర ఆందోళనకు గురౌతున్నారని గుర్తుచేశారు. పాలకులకు భారత రాజ్యాంగంమీద ప్రమాణం చేసి, చట్టబద్ద ప్రజాస్వామ్యమైన రాజ్యాంగ బద్ద పాలనను అనుసరిస్తామని చెప్పి, అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహించారు. గత ఎన్నికల సందర్భంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి, బాదిత డంపింగ్ యార్డు ప్రజలను ఓటు బాంకు రాజకీయాలకే పరిమితం చేయడాన్ని తప్పుపట్టారు. ఇప్పటికైన ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న, వెంటనే ఇచ్చిన హామిని నిలబెట్టుకోవాలని సూచించారు. మంచిగాలి, నీరు ఆరోగ్య భద్రతలో బాగంగా జీవించే హక్కును పరిరక్షించాలని డిమాండ్ చేశారు. లేనియెడల భవిష్యత్తులో జరిగే ప్రజా పోరాటాలకు, ఆందోళనలకు ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాల్సి ఉంటుందని డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటి ఈ సందర్భంగా హెచ్చరించింది.

# ప్రజాభవన్‌లో ఘనంగా డిప్యూటీ సీఎం జన్మదిన వేడుకలు

- శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్, సీఎం, మంత్రులు, ప్రముఖులు
- దీర్ఘాయుష్షు ప్రసాదించాలంటూ వైఎస్ జగన్ ట్వీట్‌లి
- రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణుల సేవా కార్యక్రమాలు.. రక్తదాన శిబిరాలు
- ఆరు గ్యారంటీల థీమ్‌తో 120 కేజీల భారీ కేక్ కట్టింగ్



**హైదరాబాద్, జూన్ 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)**తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు జన్మదిన వేడుకలు సోమవారం ప్రజాభవన్‌లో అత్యంత వైభవంగా జరిగాయి. నిత్యం ప్రజాసేవలో నిగమన్నమవుతూ.. రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతున్న డిప్యూటీ సీఎంకు భగవంతుడు ఆయు, ఆరోగ్య, ఐశ్వర్యాలను ప్రసాదించాలంటూ ప్రముఖులు మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

**ప్రముఖుల శుభాకాంక్షల వెల్లువ** తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఫోన్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎక్స్ వేదికగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "ప్రియ సోదరుడు శ్రీ భట్టి మల్లు గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. తెలంగాణ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడంలో మనం కలిసి మరింత ఉత్తమ ఫలితాల కోసం కృషి చేద్దాం" అని ముఖ్యమంత్రి ఎక్స్ లో పోస్ట్ చేశారు. అలాగే ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సామాజిక మాధ్యమాల ద్వారా డిప్యూటీ సీఎంకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. భట్టి గారికి భగవంతుడు దీర్ఘాయుష్షును, ఆయురారోగ్యాలను, సుఖసంతోషాలను ప్రసాదించాలని జగన్ ఆకాంక్షించారు.ఉదయం నుంచే ప్రజాభవన్‌కు మంత్రులు, కాంగ్రెస్ అగ్రనేతలు, అధికారులు భారీగా తరలివచ్చారు. భట్టి విక్రమార్కను కలిసి బొకేలు, శాలువాలతో సత్కరించారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, సీతక్క, వాకిటి శ్రీహరి, అజహారుద్దీన్, సీడబ్ల్యూసీ సభ్యులు రుద్రరాజు, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, వేముల వీరేశం, శాసనసభ్యులు వంశీకృష్ణ, కవ్వంపల్లి సత్యనారాయణ, మందుల సామేల్, కొత్త ప్రభాకర్ రెడ్డి, బిఎల్ఆర్, మాజీ ఎంపీ మధు యాష్కి గౌడ్, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు అన్వేష్ రెడ్డి, నరసింహారెడ్డి, పోదెం వీరయ్య, నాయుడు సత్యం, బండ్లు శోభారాణి, రాయల నాగేశ్వరరావు, శివసేనారెడ్డి, చరణ్ కౌశిక్, సరిత తిరుపతయ్య, బీసీ కమిషన్ మెంబర్ రాపోలు జయప్రకాష్,ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, అగ్రికల్చర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేంద్రమోహన్, ప్లానింగ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ గౌరవ ఉప్పల్, ఫైనాన్స్ సెక్రెటరీ స్నిగ్ధ పట్నాయక్, సింగరేణి సిఎండి జ్యోతి బుద్ధ ప్రకాష్, జెన్కో సిఎండి హరీష్, ట్రాన్స్కో సీఎం డి కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

**ఆకట్టుకున్న ఆరు గ్యారంటీల కేక్!** ఉప ముఖ్యమంత్రి జన్మదినాన్ని పురస్కరించుకుని మధిర నియోజకవర్గం బోనకల్ మండలం గోవిందపురం గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు కొమ్మినేని రమేష్ బాబు ప్రత్యేకంగా 120 కేజీల భారీ కేకును తయారు చేయించారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఆరు గ్యారంటీలు', ప్రభుత్వ సంక్షేమ పథకాలు, భట్టి విక్రమార్క చేపట్టిన చారిత్రాత్మక 'పీపుల్స్ మార్చ్ పాదయాత్ర' చిత్రాలతో ఈ కేకును అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దడం అందరినీ ఆకట్టుకుంది. ప్రజాభవన్‌లో భట్టి ఈ కేక్‌ను కట్ చేశారు.అలాగే కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, ఓయూ జేఏసీ నేత లోకేష్ కుమార్ యాదవ్ ప్రత్యేకంగా చేయించిన 70 కేజీల కేకును కూడా డిప్యూటీ సీఎం కట్ చేసి అక్కడి ప్రజాప్రతినిధులు, అభిమానులకు తినిపించారు.

# కాప్రా లో ఫుట్‌బాల్ సందడి యువతకు పరమేశ్వర్ రెడ్డి ప్రోత్సాహం

క్రీడాకారులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేసిన పరమేశ్వర్ రెడ్డి.




**కాప్రా, జూన్ 15:(వార్తా ప్రభ)**కాప్రా డివిజన్ వల్లువర్ నగర్ ఫుట్‌బాల్ సమ్మర్ కోచింగ్ క్యాంప్ ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై, శిక్షణ పూర్తి చేసుకున్న క్రీడాకారులకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రాముఖ్యత గల ఫుట్‌బాల్ క్రీడలో కోచింగ్ తీసుకున్న చిన్నారులకు శుభాకాంక్షలు. క్రీడలు యువత మానసిక, శారీరక దృఢత్వానికి దోహదపడతాయి. యువత పెడదారి పట్టకుండా క్రమశిక్షణ గల పౌరులుగా తీర్చిదిద్దుతాయి అని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు, క్రీడాకారులకు పెద్దపీట వేస్తోందని తెలిపారు. కాప్రా డివిజన్‌లో ఫుట్‌బాల్‌కు ఉన్న ఆదరణను దృష్టిలో ఉంచుకుని గెలీలియో కాలనీ, వల్లువర్ నగర్, కందిగూడాలలో 10 కోట్ల తో అత్యాధునిక హంగులతో ఫుట్‌బాల్ క్రీడా మైదానాలు నిర్మించనున్నట్లు తెలిపారు.సీఎం రేవంత్ రెడ్డి స్వతహాగా ఫుట్‌బాల్ క్రీడాకారులని ఫుట్‌బాల్‌కు మరింత ఆదరణ లభించాలనే ఉద్దేశంతో ఉప్పల్ స్టేడియంలో అంతర్జాతీయ క్రీడాకారులతో మ్యాచ్ నిర్వహించి, ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహించారని గుర్తుచేశారు.ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన మాజీ కౌన్సిలర్ రాజేందర్ ని పరమేశ్వర్ రెడ్డి అభినందించారు. వల్లువర్ నగర్ ఫుట్‌బాల్ అకాడమీ సభ్యులు ఎం ఎం పి ఆర్ ని శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఎక్స్-సర్వీస్‌మెన్ విభాగం చైర్మన్ పి. రాజేంద్రన్, విజయ్ రెడ్డి జాతీయ కార్యదర్శి మరియు జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారుడు పి. ధర్మేందర్, టి ఎఫ్ ఏ లైసెన్స్‌డ్ కోచ్ పి.డి. ఇమ్మాన్యుయేల్, ఫుట్‌బాల్ కోచ్ వి. శివకుమార్, ప్రధాన కార్యదర్శి పి.గుణశేఖర్, సీనియర్ నాయకులు ఎం.రాజు, పి. మరాజశీలన్, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్, జిల్లా ఏఎంసి డైరెక్టర్ పూర్ణ యాదవ్, ఏఎంసి మాజీ డైరెక్టర్ కొబ్బనూరి నాగరాజు, కాప్రా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కొబ్బనూరి నాగశేషు, సీనియర్ నాయకులు పడమటి మల్లారెడ్డి, బాబురావు, జి. సత్యనారాయణ, తన్నీరు శ్రీహరి, గుణశేఖర్, రాకేష్ యాదవ్, మనోజ్ కుమార్, ఆకుల సంతోష్, రాజశీలన్, కౌకుంట్ల ప్రకాష్ రెడ్డి, అజీజ్, లింగం తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిపక్ష గొంతును నొక్కే ప్రయత్నాలను ఖండిస్తున్నాం

ఉదయభాను పై అనుచిత వ్యాఖ్యలు -జనసేన నాయకులు.

**జగ్గయ్యపేట జూన్ 15 (వార్తప్రభ)** నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ కార్యాలయం నందు వైఎస్ఆర్‌సీపీ అధికారిక ఫేస్‌బుక్ పేజీ తొలగింపు ప్రజాస్వామ్యానికి ముప్పుభారతదేశంలో వైఎస్ఆర్‌సీపీ అధికారిక ఫేస్‌బుక్ పేజీని అందుబాటులో లేకుండా చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమైన చర్య అని నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు విమర్శించారు. ప్రతిపక్ష గొంతును అణచివేసే ప్రయత్నంప్రజల సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకే ప్రతిపక్ష పార్టీ సోషల్ మీడియా వేదికలను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మీడియా పరంగా అండగా లేకపోయినా సోషల్ మీడియా వేదిక బలమైన సైన్యం ఉందని, ఈ సోషల్ మీడియాని అధికార పార్టీ తట్టుకోలేక ఇలా



ఎకౌంట్లన్నీ రిమూవ్ చేసే కార్యక్రమం చేపడుతుందని అన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గత నెల రోజులుగా డీఎస్సీ పైన, అమరావతి రైతుల పైన, రాష్ట్రంలో వివిధ నాయకులు పైన జరుగుతున్న దాడులు పైన పక్కా ఆధారాలతో అధికార వెబ్సైట్ ద్వారా బయటపడటంతో ఇది చూసి తట్టుకోలేక ఫేస్బుక్ పేజీని తొలగించే కార్యక్రమం కూటమి ప్రభుత్వం చేపట్టిందని. ప్రశ్నించే హక్కును హరించడం తగదుప్రతిపక్షంగా ప్రభుత్వాన్ని ప్రశ్నించడం రాజ్యాంగబద్ధమైన హక్కు అని, ఆ హక్కును కాలరాయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు.

వార్తా ప్రభ

# హైదరాబాద్

## మేధస్సు, ఏకాగ్రత పెంచే క్రీడలు విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు ఉపయోగపడతాయి.

సమాజ సేవకులు మిర్యాల ప్రీతం




**శేరిలింగంపల్లి,జూన్ 15 (వార్తాప్రభ):** చందానగర్‌లోని డివైన్ హోమ్స్ క్లబ్ హౌస్‌లో క్రెసెండో ఆర్ట్స్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన రూబిక్స్ క్యూబ్ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పోటీలకు సామాజిక సేవకులు మిరియాల ప్రీతమ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సుమారు 70 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో తమ మేధస్సు, ఏకాగ్రత, వేగాన్ని ప్రదర్శించారు.ఈ సందర్భంగా మిరియాల ప్రీతమ్ మాట్లాడుతూ రూబిక్స్ క్యూబ్ వంటి మేధోపరమైన పోటీలు విద్యార్థుల్లో సమస్య పరిష్కార నైపుణ్యం,తార్కిక ఆలోచన, సహనం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు.విద్యార్థులు చదువుతో పాటు ఇలాంటి కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొనాలని సూచించారు.పోటీల నిర్వహణలో కీలక పాత్ర పోషించిన టీచర్ హిమజను ప్రత్యేకంగా అభినందించిన ఆయన, విజేతలకు బహుమతులు, ట్రోఫీలు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థిని ప్రోత్సహిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ధనలక్ష్మి, రాము,రజనీ, విజయలక్ష్మి, ఉదయ్,అరుణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తాం

- శాసన సభ్యులు అరికపూడి గాంధీ



**శేరిలింగంపల్లి,జూన్ 15 (వార్తాప్రభ):**కొండాపూర్ డివిజన్ పరిధిలోని గఫూర్‌నగర్ కాలనీలో నెలకొన్న ఇన్‌లెట్ సమస్యను పరిశీలించేందుకు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ సోమవారం అధికారులతో కలిసి పర్యటించారు.డీసీ బాలకృష్ణ, సీఎంసీ ఇంజినీరింగ్ విభాగం, ప్రాజెక్ట్స్ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలిసి సమస్య తీవ్రతను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ గఫూర్‌నగర్ కాలనీలో ఇన్‌లెట్ సరిగా లేకపోవడం, కుంచించుకుపోవడం, చెత్తాచెదారం చేరడం వల్ల మురుగునీటి సమస్య తీవ్రంగా మారిందన్నారు.సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.వర్షాకాలంలో కాలనీ ముంపుకు గురికాకుండా వరద నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టాలని,ఇన్‌లెట్ మరమ్మతులు పూర్తి చేసి డ్రైనేజీ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.డ్రైనేజీ మ్యాన్‌హోల్‌ల మరమ్మతులు చేపట్టడంతో పాటు ఎయిర్‌టెక్ యంత్రాల ద్వారా పూడిక, చెత్తాచెదారం తొలగించి నీటి ప్రవాహాన్ని మెరుగుపరచాలని అధికారులకు సూచించారు.కాలనీవాసులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చోట్ల మ్యాన్‌హోల్‌లను మరమ్మతు చేసి అందుబాటులోకి తీసుకురావాలని,భవిష్యత్తులో సమస్య పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని అన్నారు.ప్రజలకు ప్రశాంతమైన,ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని,శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ప్రతి కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని గాంధీ తెలిపారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో సీఎంసీ ఈఈ గోవర్ధన్, ప్రాజెక్ట్స్ డీఈ ధీరజ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ,కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## విద్య ద్వారానే ఉన్నత భవిష్యత్తు తీర్చిదిద్దుకోవడం సాధ్యమవుతుంది:- రెడ్డి సంఘం.

**కూకట్ పల్లి,జూన్15(వార్తాప్రభ):**పేద విద్యార్థులు విద్యకు దూరం



కాకూడదని లక్ష్యంతో వారికి రెడ్డి సంఘం తరపున ప్రతి సంవత్సరం ఆర్థిక సహాయం చేయడం జరుగుతుందని రెడ్డి సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. కూకట్పల్లి ఆల్విన్ కాలనీ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఎల్లమ్మ బండ భారతి విద్యాలయ హై స్కూల్ లో ఇటీవల పదవ తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థులకు పై చదువుల కోసం ఆర్థిక సహాయం అందజేశారు. అధ్యక్షులు సుధాకర్ రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం తరపున ప్రతి సంవత్సరం పేద విద్యార్థులను ఆదుకోవడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. గత పది సంవత్సరాల నుండి ఎంతోమంది పేద విద్యార్థులకు సహాయం చేయడం సంఘం తరపున తమకు ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. మరిన్ని సహాయ సహకారాలతో పేద విద్యార్థుల అండగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు రవీందర్ రెడ్డి, రామ్ రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, సుధాకర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బుచ్చిరెడ్డి తదితరులు ఉన్నారు.

# సంపాదకీయం

## వైసీపీ కాంగ్రెస్ అనేది కలవడం అంటే ?

కాంగ్రెస్ పార్టీలో వైసీపీ విలీనం అని కొందరు లేదు ఇండియా కూటమిలో చేరి కాంగ్రెస్ తో పొత్తులు పెట్టుకుంటారు అని మరి కొందరూ ఇలా రకరకాలైన ప్రచారం చేస్తున్నారు. అయితే ఏపీలో పొలిటికల్ సన్నివేశం పూర్తిగా వేరు అని గుర్తు చేస్తున్నారు. జగన్ ఆలోచనలు ఆయన మనస్తత్వం కాంగ్రెస్ ని జగన్ వీడిన సందర్భం ఇవన్నీ గుర్తు చేసుకుంటున్న వారు మాత్రం వైసీపీ ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్ లో విలీనం అయ్యే ప్రసక్తి లేదని అంటున్నారు. ఏపీలో ఈ రోజుకీ ఒంటరిగానే 40 శాతం ఓటు షేర్ ని సాధించి రేపటి ఎన్నికల్లో గెలిచే పార్టీగా ముద్ర ఉన్న వైసీపీకి కాంగ్రెస్ ని కౌగిలించుకోవడం అవసరమా అన్న ప్రశ్న కూడా రాజకీయ విశ్లేషకులు పలువురు వేస్తున్నారు. ఏపీ రాజకీయాలలో చూస్తే కనుక జగన్ ఒంటరిగానే ఉండేందుకు ఇష్టపడుతున్నారు అని అంటున్నారు. జాతీయ స్థాయిలో బీజేపీకి సందర్భానుసారం విధానాల ప్రాతిపదికన అంటూ బిల్లులకు వైసీపీ మద్దతు ఇస్తోంది. ఆ విధంగా బీజేపీ పెద్దల వద్ద వైసీపీ గుడ్ విల్ సంపాదించుకుంది. అందుకే ఏపీలో టీడీపీ కూటమి మీద ధీటుగా పోరు చేస్తోంది అని అంటున్నారు. ఇక 2029 లో బీజేపీ టీడీపీ జనసేన కూటమిగా వచ్చినా కూడా వైసీపీ ఒంటరిగానే పోరుకు సిద్ధపడుతుందని చెబుతున్నారు. జనాలు నచ్చకపోతే కూటములను అయినా ఓడిస్తారు అన్నది దేశంలో చాలా ఎన్నికలు నిరూపించాయని కూడా వైసీపీ నేతలు అంటున్నారు. పైగా వైసీపీకి చెక్కు చెదరని ఓటు బ్యాంక్ 40 పర్సెంట్ ఉందని మరో పది శాతం తెచ్చుకుంటే అధికారం సొంతం అవుతుందని కూడా లెక్క వేస్తున్నారు. ఇక 2029 ఎన్నికలు చూస్తే కచ్చితంగా ఏ కూటములకు పూర్తి స్థాయిలో మెజారిటీ దక్కే సీన్ ఉండదని కూడా అంటున్నారు. బీజేపీని మూడు సార్లు చూసిన జనాలు ఈసారి పూర్తిగా ఏకపక్షంగా నెత్తికెత్తుకోరు అని అంటున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండియా కూటమి బలం పెరిగినా కూడా మ్యాజిక్ ఫిగర్ కి దగ్గరగా రాలేరని అంటున్నారు. దాంతో న్యూట్రల్ గా ఉండే పార్టీలకు ఆ ఎన్నికల తరువాత డిమాండ్ పెరుగుతుందని అపుడు వైసీపీ లాంటి పార్టీలే కీలకంగా జాతీయ స్థాయిలో మారుతాయని కూడా ఫ్యాన్ పార్టీ నేతలు లెక్క వేస్తున్నారు. ఈ క్రమంలో వైసీపీ అన్ని ఆప్షన్లూ ఓపెన్ గా ముందు పెట్టుకుంటుంది అని అంటున్నారు. అంతే తప్ప పొత్తుల పేరుతో ముందే కమిట్ అయిపోతే ఆ తరువాత కీలక నిర్ణయాలు తీసుకునే చాన్స్ కోల్పోతామని అంటున్నారు. ఏపీలో ఎలా చూసుకున్నా కాంగ్రెస్ అయితే ఈ రోజుకీ లేదని అంటున్నారు. మరో మూడేళ్ళలో కూడా అద్భుతాలు జరిగి కాంగ్రెస్ ఎదుగుతుందని కూడా ఎవరూ అనుకోవడం లేదని అంటున్నారు. అందువల్ల కాంగ్రెస్ తో పొత్తులు కానీ విలీనాలు కానీ వైసీపీకి అవసరం లేదని అంటున్నారు. పైగా జగన్ ని నాడు కాంగ్రెస్ అగ్రనాయకత్వం అవమానించిందని అందుకే బయటకు రావాల్సి వచ్చిందని అంటున్నారు. ఇక జగన్ మీద నాడు సీబీఐ కేసులు పెట్టడంతోనే ఆయన పదహారు నెలల పాటు జైలు జీవితాన్ని అనుభవించాల్సి వచ్చిందని కూడా గుర్తు చేస్తున్నారు. మొత్తానికి చూస్తే వైసీపీ కాంగ్రెస్ అనేది కలవడం అంటే అది ఇప్పట్లో జరిగేది కాదని అంటున్నారు ఒకవేళ 2029 ఎన్నికల తరువాత కాంగ్రెస్ నాయకత్వంలోని కూటమి అధికారానికి దగ్గరగా వస్తే కనుక అపుడు ఆలోచించే వీలు ఉందని కూడా అంటున్నారు. సో ప్రస్తుతానికి వస్తున్నవి అన్నీ ఊహాగానాలే అని కూడా అంటున్నారు.

## ఎన్టీఆర్ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం కార్యదర్శి గా పెదప్రోలు బాల సుబ్రహ్మణ్యం నియామకం

**తెలంగాణ ప్రతిపక్ష నేత (తొలి స్పీకర్) బ్రహ్మశ్రీ సిరికొండ మధుసూదనాచారి చేతుల మీదగా ఎన్టీఆర్ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం సెక్రటరీగా పదవి నియామక పత్రం అందుకుంటున్న పెదప్రోలు బాలసుబ్రహ్మణ్యం**



**విజయవాడ పశ్చిమ జూన్ 15** :(వార్తా ప్రభ ప్రతినిధి)ఎన్టీఆర్ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం కార్యదర్శి గా పెదప్రోలు బాల సుబ్రహ్మణ్యం నియామకం జరిగింది. స్థానికంగా జరిగిన సన్మాన సభ అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు బ్రహ్మశ్రీ పెంట సాయి కిరణ్ , ప్రధాన కార్యదర్శి బ్రహ్మశ్రీ కందుకూరి మోహన్ హాజరయ్యారు. సభకు బ్రహ్మశ్రీ తాటికొండ రంగబాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం ఆపద్ధర్మ అధ్యక్షులు బ్రహ్మశ్రీ పావులూరి హనుమంతరావు చేతుల మీదుగా బ్రహ్మశ్రీ పెదప్రోలు బాలసుబ్రహ్మణ్యం ఎన్టీఆర్ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం సెక్రటరీగా, బ్రహ్మశ్రీ కత్తురోజు సతీష్ కుమార్ కార్యనిర్వాహక కార్యదర్శిగా నియామక పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు పావులూరి హనుమంతరావు మాట్లాడుతూ, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బ్రహ్మశ్రీ పెదప్రోలు బాలసుబ్రహ్మణ్యం , బ్రహ్మశ్రీ కత్తురోజు సతీష్ కుమార్ సంఘ అభివృద్ధికి, విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేస్తారని ఆకాంక్షించారు. జిల్లా అధ్యక్షులు సాయి కిరణ్ , ప్రధాన కార్యదర్శి మోహన్ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో విశ్వబ్రాహ్మణ బంధువులు, సంఘ ప్రముఖులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

## కేడిఎల్ఓఏ ట్రక్కర్స్ ప్రాజెక్ట్ మేనేజర్ సాంబశివరావు ను సత్కరించిన ఏడిఎంఓ భాను నాయక్



**విజయవాడ పశ్చిమ జూన్ 15** :(వార్తా ప్రభ ప్రతినిధి)కేడిఎల్ఓఏ ట్రక్కర్స్ ప్రాజెక్ట్ కింద చేపట్టిన రక్త దాన శిబిరాలకు గాను ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భముగా ఆదివారం విజయవాడ, కొత్త ప్రభుత్వ ఆసుపత్రి నందు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా అడిషనల్ డిస్ట్రిక్ట్ మెడికల్ ఆఫీసర్ భాను నాయక్ చేతుల మీదగా ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, ది కృష్ణ డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ట్రక్కర్స్ ప్రాజెక్ట్ మేనేజర్ వి.వి సాంబశివరావు అవార్డును అందుకున్నారు. గతంలో కూడా రెండు సార్లు సాంబశివరావు కు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జ్ఞాపికను అందజేసి సత్కరించారు. రెండు సార్లు ఏడిఎంఓ, హెల్త్ మినిస్టర్ అవార్డ్, లయన్స్ క్లబ్ హైదరాబాద్ వారిచే నేషనల్ సేవా స్వర్ణ నంది అవార్డ్ అందుకున్నారు. రక్తదానం ప్రాధాన్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించి వేలాది మందితో రక్తదానం చేపించడంలో సాంబశివరావు తన ప్రత్యేకతను చాటుకున్నారని, వరుసగా పలు మార్లు అవార్డు సాధించడం అభినందనీయమని భాను నాయక్ కొనియాడారు

## ఇంద్రకీలాద్రిపై 'మూడంచెల భద్రతా తనిఖీ' విధానం అమలుకు నగర పోలీస్ అధికారులు, వైదిక సిబ్బందితో ఈవో ఉన్నత స్థాయి సమావేశం.

**క్షేత్రస్థాయిలో భద్రతా పాయింట్ల పరిశీలన**





**విజయవాడ పశ్చిమ జూన్ 15**:(వార్తా ప్రభ ప్రతినిధి)విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానానికి రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, సామాన్య భక్తులకు సౌకర్యవంతమైన దర్శనాన్ని కల్పించడంతో పాటు, ఆలయ భద్రతను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ఒక పటిష్టమైన యాక్షన్ ప్లాన్‌ను అమలు చేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ తెలిపారు. రానున్న రోజుల్లో విశేష ఉత్సవాలు ఉన్నందున, దేవస్థాన భద్రత మరియు భక్తుల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సోమవారం ఉదయం దేవస్థాన కార్యాలయంలో నగర పోలీస్ అధికారులు, వైదిక సిబ్బంది మరియు ఆలయ అధికారులతో ఈవో ఒక ప్రాధాన్యత కలిగిన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మూడంచెల భద్రతా తనిఖీ' గురించి ?ఈ సమావేశంలో ఈవో శీనా నాయక్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో ఎలాంటి భద్రతా లోపాలకు తావులేకుండా డివోటీ ఫ్రెండ్లీ తరహాలోనే ఇంద్రకీలాద్రిపై 'మూడంచెల భద్రతా తనిఖీ' విధానాన్ని ప్రవేశపెట్టడానికి ప్రయత్నం చేస్తున్నామని,?ఇటీవల కాలంలో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, ముఖ్యంగా ఆర్జిత సేవల్లో పాల్గొనే వారి డిమాండ్ పెరగడం వల్ల క్యూలైన్ల నిర్వహణ సవాలుగా మారిందని ఆయన పేర్కొన్నారు.?ఈ నేపథ్యంలో, రద్దీ సమయంలో ఎలాంటి గందరగోళం తలెత్తకుండా ఉండేందుకు, ప్రతి భక్తుడిని మూడు వేర్వేరు పాయింట్ల వద్ద క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే ఆలయ ప్రాంగణంలోకి అనుమతిస్తారు.?దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులు ఈ తనిఖీ కేంద్రాల వద్ద తమ టికెట్లను చూపించాల్సి ఉంటుంది. అదే సమయంలో, టికెట్ లేని సామాన్య భక్తులకు సర్వదర్శనం లైన్ ద్వారా ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరాయంగా దర్శనం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఈవో స్పష్టం చేశారు.?ఆలయ ప్రాంగణంలో భక్తులు సెల్ ఫోన్లు వాడకం వలన పలు ఇబ్బందులు మరియు భద్రతా సమస్యలు ఎదురవుతున్నాయని ఈవో పేర్కొన్నారు. దీని నివారణకు గానూ ఆలయంలో 'సెల్ ఫోన్ల నిరోధక వ్యవస్థ'ను ఏర్పాటు చేయడంతో పాటు, భక్తులకు దీనిపై పూర్తి అవగాహన కల్పిస్తామన్నారు. అలాగే సెల్ ఫోన్లు డిపాజిట్ చేసుకునేందుకు, భక్తుల సౌకర్యార్థం ప్రత్యామ్నాయ ఏర్పాట్లను వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రస్తుతం లగేజ్ తోనే కొంత మంది భక్తులు ఆలయం లోకి రావడం గమనించామని, కొత్త విధానం అమలుతో భక్తులు లగేజ్ తో ఆలయం లోకి రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తామని, లగేజ్ స్కానర్ ఏర్పాటు పరిశీలన ఉందని శీనా నాయక్ వెల్లడించారు.?ఉమ్మడిగా క్షేత్రస్థాయి పరిశీలన -- డ్యూటీ పాయింట్ల మార్పు:సమావేశం అనంతరం ఈవో వి.కె. శీనా నాయక్ పోలీస్ ఉన్నతాధికారులు గుణ్ణం రామకృష్ణ, దుర్గారావు, వన్ టౌన్ సి ఐ గుణ రామ్ మరియు దేవస్థానం వైదిక సిబ్బందితో కలిసి కొండపై క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించారు. ఇంద్రకీలాద్రి అభివృద్ధి విషయంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, దేవాదాయ శాఖ,నగరపోలీస్, రెవిన్యూ, మున్సిపల్ కార్పొరేషన్, ధర్మకర్తల మండలి లతో సంయుక్తముగా ముందుకు సాగుతామని ఈవో వివరించారు. మూడంచెల భద్రతా వ్యవస్థ'ను పటిష్టంగా అమలు చేసేందుకు వీలుగా క్యూ లైన్లు, ప్రవేశ ద్వారాల వద్ద ఉన్న భద్రతా డ్యూటీ పాయింట్లను పరిశీలించి, అవసరమైన చోట్ల మార్పులు చేర్పులు చేయాలని దేవస్థానం సెక్యూరిటీ విభాగాన్ని ఆదేశించారు. ప్రోటోకాల్ విధానాన్ని మరింత పటిష్టం చేస్తూ, సామాన్య భక్తుల దర్శనానికి ఎలాంటి ఆటంకం కలగకుండా చూడటమే ఈ నూతన భద్రతా విధానం యొక్క ముఖ్య ఉద్దేశమని ఈవో వివరించారు. ప్రోటోకాల్ విధానంలో మార్పు విషయం లో నూతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగించటానికి ప్రయత్నం చేస్తున్నామని ఈవో పేర్కొన్నారు.

## హెల్మెట్ తో పాటూ క్లిప్ కూడా పెట్టండి

**మీ మీ ప్రాణాలు కాపాడుకోండి**

**భవానిపురం సెక్టార్ ట్రాఫిక్ సి ఐ సురేష్ విజ్ఞప్తి**



**విజయవాడ పశ్చిమ జూన్ 15** :(వార్తా ప్రభ ప్రతినిధి)పోలీసుల కోసమో చాలనా నుండి తప్పించుకోవడానికి హెల్మెట్ వాడి మ మ అనుకోవద్దని హెల్మెట్ తో పాటుగా క్లిప్ తప్పనిసరి గా పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని వెస్ట్ జోన్ ట్రాఫిక్ పరిధిలో ని భవానిపురం సెక్టార్ ట్రాఫిక్ సి ఐ సురేష్ ద్విచక్ర వాహనాలు చోదకులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం చిట్టినగర్ సర్కిల్ ల్లో హెల్మెట్ క్లిప్ వినియోగంపై వాహనాలు చోదకులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. క్లిప్ ప్రాధాన్యత పై బ్యానర్లు ద్వారా అవగాహన కల్పించారు. పోలీసులు కేసులు గురించి పోలీసులు కనిపించగానే హెల్మెట్ పెట్టడం జరుగుతున్న సంఘటనలు ప్రస్తావించారు. హెల్మెట్ తలపై ఉంటే చాలదని దాని క్లిప్ పెట్టి సంపూర్ణ రక్షణ పొందాల్సి ఉందని సి ఐ గుర్తు చేశారు. క్లిప్ లేకుండా పెట్టిన హెల్మెట్ మనకు రక్షణ కల్పించదని వివరించారు. ఈ కార్యక్రమంలో సి ఐ తో పాటుగా ట్రాఫిక్ ఎస్ ఐ లు,ఏ ఎస్ ఐ లు హెడ్ కానిస్టేబుళ్ళు, సిబ్బంది పాల్గొన్నారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ పశ్చిమ జూన్ 15** :(వార్తా ప్రభ ప్రతినిధి) విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సోమవారం ఉదయం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా నగరంలోని మాచవరం, వాంబే కాలనీ, సింగ్ నగర్, పున్నయ్య కాలనీ, బీఆర్‌టీఎస్ రోడ్, కొత్త వంతెన సెంటర్ తదితర ప్రాంతాలను విస్తృతంగా పర్యటించి, క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్, బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు) నిర్వహిస్తున్న ఇంటింటి తనిఖీలు, ఓటర్ల వివరాల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులు వంటి అంశాలను నిశితంగా పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రతి బీఎల్వోపై ఉందన్నారు. ఓటరు జాబితాలో ఎటువంటి పొరపాట్లు, డూప్లికేట్ నమోదులు లేదా అనర్హుల పేర్లు ఉండకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) సహకారంతో ధృవీకరించి ఖచ్చితమైన జాబితాను రూపొందించాలని ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో తప్పనిసరిగా ఉండేలా చూడడంతో పాటు, ఒకే వ్యక్తి పేరు ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదై ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రజలు కూడా తమ ఓటు వివరాలను పరిశీలించి అవసరమైన మార్పులు, చేర్పులు ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించి సకాలంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్వచ్ఛమైన, తప్పులులేని మరియు విశ్వసనీయమైన ఓటరు జాబితా రూపొందించడమే ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని కమిషనర్ తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ప్రతి దశను కచ్చితంగా అమలు చేయాలని సంబంధిత సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కే ప్రభుదాస్, ఏ ఈ ఆర్ వో లు పి.సత్యకుమారి, రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## దివ్యాంగ క్రికెటర్ యశ్వంత్ నాయుడికి సుజానా ఫౌండేషన్ ప్రోత్సాహం

**యశ్వంత్ నాయుడుకు సామాజిక వేత్త ఆకుల శ్రీనివాస్ కుమార్ రూ.10,000 ఆర్థిక సాయం**



**విజయవాడ పశ్చిమ జూన్ 15**: (వార్తా ప్రభ ప్రతినిధి):భారత డెఫ్ (బధిరుల) క్రికెట్ జట్టులో అద్భుతంగా రాణిస్తున్న ఫాస్ట్ బౌలర్ యశ్వంత్ నాయుడు రావూరి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు సుజానా ఫౌండేషన్ తరపున పూర్తి ప్రోత్సాహాన్ని అందిస్తామని శాసనసభ్యులు సుజానా చౌదరి కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ చెప్పారు. ఈ సందర్భంగా సోమవారం యశ్వంత్ నాయుడిని అభినందిస్తూ ప్రముఖ సామాజిక వేత్త ఆకుల శ్రీనివాస్ కుమార్ రూ. 10 వేల రూపాయలు నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లికి చెందిన యశ్వంత్ నాయుడు విజయవాడలోని పశ్చిమ శాసనసభ్యులు వై.సుజానా చౌదరి కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా తన క్రీడా విజయాలను, ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను కార్యాలయ కార్యదర్శి శ్రీధర్ కి వివరించారు. పుట్టుకతోనే వినికిడి లోపం ఉన్నప్పటికీ, ఎన్నో ఇబ్బందులను అధిగమించి 2017లో బంగ్లాదేశ్‌లో జరిగిన 2వ టి-20 ఆసియా కప్ డెఫ్ క్రికెట్ ఛాంపియన్‌షిప్‌లో భారత జట్టు తరపున ఆడి విజేతగా నిలవడంలో యశ్వంత్ కీలక పాత్ర పోషించారు. ఆ సమయంలో అప్పటి భారత రాష్ట్రపతి గౌరవ ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా సత్కారం కూడా పొందారు. ప్రభుత్వ స్పోర్ట్స్ కోటా జీవో నెం. 4 (తేదీ: 19.04.2025) ప్రకారం తనకు ప్రభుత్వ ఉద్యోగ అవకాశం కల్పించేలా చొరవ చూపాలని యశ్వంత్ నాయుడు ఈ సందర్భంగా వినతిపత్రం సమర్పించారు. దీనిపై కార్యాలయ కార్యదర్శి శ్రీధర్ సానుకూలంగా స్పందించారు. యశ్వంత్ నాయుడు ప్రతిభను అభినందిస్తూ, అతనికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించేలా శాసనసభ్యులు సుజానా చౌదరి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం ద్వారా తగిన న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. అంగవైకల్యం ఉన్నా పట్టుదలతో దేశానికి కీర్తి తెచ్చిన యశ్వంత్ లాంటి యువ క్రీడాకారులకు సుజానా ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షపు నీటి నిల్వలకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు

**అవుట్‌ఫాల్ డ్రైన్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలు**



**విజయవాడ పశ్చిమ జూన్ 15** :(వార్తా ప్రభ ప్రతినిధి)విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సోమవారం నగరంలోని కృష్ణవేణి స్కూల్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న అవుట్‌ఫాల్ డ్రైన్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పటమట నిర్మలా కాన్వెంట్ పరిసర ప్రాంతాల్లో తరచూ ఏర్పడుతున్న వర్షపు నీటి నిల్వలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు చేపట్టిన ఈ డ్రైన్ నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. ప్రజలకు వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా నిర్మాణ పనులను అత్యంత వేగంగా పూర్తి చేసి డ్రైన్‌ను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. సంబంధిత శాఖల మధ్య సమన్వయంతో పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులను కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. మరోవైపు నగరంలో డీజిల్టింగ్ ప్రక్రియ నిరంతరాయంగా జరుగుతుండాలని, చిన్న డ్రైన్ నుంచి అవుట్‌ఫాల్ట్ డ్రైన్ వరకు ఎటువంటి వ్యర్థాలు, సిల్ట్ లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నీటి ప్రవాహంలో ఎటువంటి అంతరాయం లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## శ్రీ రుక్మిణి సత్యభామా సమేత శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం కు విరాళం



**పెనుగంచిప్రోలు, జూన్ 15( వార్త ప్రభ )** శ్రీశ్రీశ్రీ రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆలయ ప్రాంగణం లో ఫ్లోరింగ్ చేయు నిమిత్తం కీ॥శే॥ బండి శ్రీనివాసరావు,కీ॥శే॥ బండి నాగేశ్వరరావు ల జ్ఞాపకార్థం బండి లక్ష్మిరాజ్యం (చిట్టెమ్మ) ఆదివారం రూ..1,00,116/-( ఒక లక్ష నూట పదహారు రూపాయలు) సమర్పించడం జరిగింది. వారికి, వారి కుటుంబానికి శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటూ ఆలయ అభివృద్ధి కమిటీ ధన్యవాదాలు తెలిపారు.

## ఇబ్రహీంపట్నం సీఐ సుబ్రహ్మణ్యంనకు పలువురి అభినందనలు



**విజయవాడ పశ్చిమ జూన్ 15: (వార్తా ప్రభ ప్రతినిధి)** ఇబ్రహీంపట్నం సిఐ గా విధులు నిర్వహిస్తున్న ఎ.సుబ్రహ్మణ్యం పుట్టినరోజు సందర్భంగా సోమవారం పలువురు ప్రముఖులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. విజయవాడ కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్ లోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానం అర్చకులు విన్నకోట శ్రీనివాస శర్మ ఈ సందర్భంగా ఆయనకు వేదాశీర్వచనం అందజేశారు. స్వామివారి ప్రసాదాన్ని అందజేసి నిండు నూరేళ్లు ఆయురారోగ్య ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆశీర్వచనం అందజేశారు. అబ్దుల్ కలాం సేవా సమితి అధ్యక్షులు వేముల వెంకట్రావు తదితరులు సుబ్రహ్మణ్యంను శాలువతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వేముల వెంకట్రావు, విన్నకోట శ్రీనివాస శర్మ మాట్లాడుతూ విజయవాడ కొత్తపేట పోలీస్ స్టేషన్ సిఐగా పనిచేసిన సమయంలో సుబ్రహ్మణ్యం కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలను చక్కగా పర్యవేక్షించారని కొనియాడారు. అలాగే పేద ప్రజలకు, బాధితులకు అండగా నిలిచారని వారు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పోతిన శ్రీనివాసరావు, వేముల విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేరుకుపోయిన చెత్త..ప్రజారోగ్యానికి ముప్పు




**చేజర్ల జూన్ 15 (వార్తాప్రభ)** చేజర్ల మండల కేంద్రం చేజర్ల గ్రామ పంచాయితీలో ఎక్కడపడితే అక్కడ చెత్త చెదారం పేరుకుపోయి ఉంది. పారిశుద్ధ్య కార్మికులు చెత్తా చెదారాన్ని డంపింగ్ యార్డులో వేసి కాల్చి తగలబెట్టాల్సింది పోయి ప్రధాన రహదారి అయిన రోడ్డు పక్కన వేయడంతో ఆ చెత్తంతా తిరిగి మళ్ళీ బస్టాండ్ ఆవరణలోకి రావడం జరుగుతుంది. ఇది ప్రజల ఆరోగ్యానికి హానికరంగా ప్రజలు భావిస్తున్నారు. దీనిపై పంచాయతీ ప్రత్యేక పరిపాలన అధికారులకు కొంతమంది గ్రామ ప్రజలు వివరించినా వారు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామ ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆరోగ్య భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది కనుక తక్షణమే ఈ చెత్తను ఒకచోటకు చేర్చి పూర్తిగా తగలబెట్టాలని చేజర్ల గ్రామ పంచాయితీ ప్రజలు కోరుతున్నారు.

## అమ్మ అద్భుత వాక్కులు



చక్కగా చదువుకో
చుక్కలా వెలిగిపో
చక్కని మార్గంలో
మొక్కలా ఎదిగిపో
బద్ధకాన్ని వదులుకో
బుద్ధిగా నడుచుకో
హద్దులోనే ఉంటూ
వృద్ధిలో సాగిపో
శుద్ధిగా చేసుకో
శ్రద్ధగా నేర్చుకో
అబద్దాలు మానేసి
నిబద్ధత చాటుకో
కన్నీళ్ళను తుడుచుకో
కన్నోళ్లను చూసుకో
పన్నీరులా బ్రతికి
మిన్నగా ఉండిపో
ఉక్రోషం మానుకో
ఉద్రేకం అణచుకో
భద్రంగా ఉంటూ
శుభ్రతను కోరుకో
మట్టి విలువ తెలుసుకో
జట్టుగా కలిసిపో
వట్టి మాటలు వదిలి
గట్టి పనులు పూనుకో

**-గద్వాల సోమన్న,**
ఎమ్మిగనూరు,
సెల్ :9966414580

# నైపుణ్యాలను పెంపొందించుకోవాలి







**విజయవాడ పశ్చిమ జూన్ 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)** అధ్యాపకులు ఎప్పటికప్పుడు తమ నైపుణ్యాలను పదును పెట్టుకున్నప్పుడే తమ వృత్తిలో మంచి విజయాలను అందుకోగలరని ప్రముఖ సైబర్ సెక్యూరిటీ నిపుణుడు సాయిసతీష్ అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఇఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సీఐసీ విభాగం, జేఎన్‌టీయు (కాకినాడ) సంయుక్త ఆధ్వర్యంలో 'నెక్స్‌జి?టజెన్ ఫ్రాంటీయర్స్ -- సైబర్‌సెక్యూరిటీ జనరేటివ్ ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ ' అంశంపై అధ్యాపకులకు వారం రోజుల శిక్షణా శిబిరాన్ని సోమవారం ఆ కళాశాల ప్రాంగణంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన సాయిసతీష్ మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక యుగంలో విద్యార్థులను తీర్చిద్దిటంలో అధ్యాపకులు మరింత సమర్థవంతంగా పని చేయాల్సి ఉందన్నారు. నూతన సాంకేతిక ఆవిష్కరణలను అందిపుచ్చుకొని అధ్యాపకులు తమనుతాము ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ప్రధానంగా సైబర్ సెక్యూరిటీ, ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ అంశాల్లో విస్తృతమైన మార్పులు, అభివృద్ధి చోటు చేసుకుందని వివరించారు. వాటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. జేఎన్‌టీయు కాకినాడ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరిగ్ విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ సురేఖ మాట్లాడుతూ అధ్యాపకులను సమర్థవంతంగా తీర్చిదిద్దటానికి ఈ విధమైన కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. వారం రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందని వివరించారు. జనరేటివ్ ఏఐ, లార్ట్ లాంగ్వేజ్ మోడల్స్, సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్ తదితర అంశాలపై శిక్షణా తరగతుల్లో చర్చించటం జరుగుతందన్నారు. కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన బోధనను అందించేందుకు అధ్యాపకులను ఉత్తమంగా తీర్చిదిద్దాల్సి ఉందన్నారు. ఆ క్రమంలో తమ కళాశాల ఎప్పటికప్పుడు అధ్యాపకులను మరింత విజ్ఞానవంతులుగా తీర్చిద్దిటానికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శరవణకుమార్ అధ్యక్షత వహించారు. కళాశాల సీఐసీ విభాగాధిపతి డాక్టర్ పీఎస్ శిల్ప తదితరులు ప్రసంగించారు.

## దువ్వూరులో విషాదం.. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఉరివేసుకుని ఆత్మహత్య

**సూసైడ్ నోట్ వీలునామా స్వాధీనం..దర్యాప్తు ముమ్మరం**





**సంగం జూన్ 15(వార్తాప్రభ ప్రతినిధి)** సంగం మండలం దువ్వూరు గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది.రిటైర్డ్ ఉపాధ్యాయుడు మధుసూదన్ రావు ఆయన భార్య రత్నావళి కుమారుడు సాయి సుకృత్ తమ ఇంట్లో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.సమాచారం అందుకున్న సంగం పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రాథమిక విచారణలో కుటుంబ సభ్యులు అర్ధరాత్రి సమయంలో ఇంటి బయట గేటుకు తాళం వేసి, ఇంట్లోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. ముగ్గురూ చేతులు కాళ్లు కట్టుకున్న ఆనవాళ్లు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. స్థానికుల వివరాల ప్రకారం మధుసూదన్‌రావు ఉపాధ్యాయ వృత్తి నుంచి మూడేళ్ల క్రితం పదవీ విరమణ పొందగా కుమారుడు సాయి సుకృత్ బీటెక్ పూర్తి చేసి తిరుపతిలో ఉద్యోగం చేస్తున్నాడు. కుటుంబం ఎక్కువ కాలం తిరుపతిలోనే ఉంటూ అప్పుడప్పుడు స్వగ్రామానికి వచ్చేదని తెలిసింది. ఘటనా స్థలంలో సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.శారీరక మానసిక సమస్యల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురై ఈ నిర్ణయం తీసుకున్నట్లు అందులో పేర్కొన్నారని సంగం సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు. అదే లేఖలో ఆస్తులకు సంబంధించిన వీలునామా కూడా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. కుటుంబ సభ్యులకు ఆస్తుల పంపకం వివరాలతో పాటు ఒక ప్లాట్‌ను నెల్లూరు రెడ్‌క్రాస్ సంస్థకు కేటాయించినట్లు పేర్కొన్నారని తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.పూర్తి విచారణ అనంతరం ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

## విదేశీ విద్య విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలి-బీసీ సంక్షేమ సంఘం.



**మచిలీపట్నం జూన్ 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ నవీన్ కు రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు విదేశీవిద్య ను పునరుద్ధరించాలని, సిగరెట్ విక్రేతల దోపిడీని ఆపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ బి.సి సంక్షేమ సంఘం కృష్ణా జిల్లా అధ్యక్షులు శేకుబోయిన సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో బీ.సీ నాయకులు సోమవారం వినతి పత్రాలు సమర్పించారు. అనంతరం సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గతంలో రాష్ట్ర ప్రభుత్వాలు పేద విద్యార్థుల కోసం విదేశీ విద్యను అందుబాటులోకి తెచ్చి వారి కలలను సాకారం చేశారని కొనియాడారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు విదేశీవిద్య అమలు దిశగా చర్యలు తీసుకోలేదని సుబ్రమణ్యం అన్నారు. కాబట్టి వెంటనే అందుబాటులోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని జె. సి. కి వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే సిగరెట్ విక్రేతలు డిస్ట్రిబ్యూటర్ నుంచి హోల్ సేల్ మరియు రిటైలర్ వరకు ధూమపాన ప్రియులను అడ్డంగా దోచుకుంటున్నారన్నారు.సిగరెట్ రకాన్ని బట్టి ఒక్కొ రకానికి సుమారు రెండు నుంచి ఐదు రూపాయల వరకు ఎక్కువ వసూలు చేస్తున్నారన్నారు. ఇలా సుమారు 18% నుంచి 30% పెక్కు ధరలు దోచుకుంటున్నారని, దీనివలన ఎం. ఆర్. పి ధరలు అందుబాటులో లేకుండా పోయాయని ఆరోపించారు. దీనివలన ధూమపాన ప్రియులు తీవ్రంగా నష్టపోతున్నారని జె.సి కి సుబ్రమణ్యం వివరించారు. తక్షణమే విక్రేతలపై తనిఖీలు నిర్వహించి వారి దోపిడీని అడ్డుకొని ఎం. ఆర్. పి ధరలకు సిగరెట్లను విక్రయించే విధంగా చర్యలు చేపట్టాలని జె.సి కి వినతిపత్రం సమర్పించామన్నారు. ఈ కార్యక్రమంలో కోమటి శ్రీను,నాగరాజు,శ్రీను, రాధాకృష్ణా, ప్రసాద్, కోటేశ్వర, రామరాజు, సాంబశివ,కృష్ణ, దుర్గ ప్రసాద్, కాసులు, రమేష్ తదితర బి.సి నాయకులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలపై శాఖాధిపతులు ప్రత్యేక దృష్టి పెట్టాలి

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**




**విజయవాడ పశ్చిమ జూన్ 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రజల నుండి వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, క్షేత్రస్థాయిలో పరిశీలించి శాశ్వత పరిష్కారం అందించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కమిషనర్ పాల్గొని ప్రజల వినతులను స్వీకరించారు.ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన కమిషనర్, గతంలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కార స్థితిని శాఖాధిపతులతో చర్చించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని సూచించారు.మున్సిపల్ సేవల కోసం రూపొందించిన "పురమిత్ర" యాప్‌లో నమోదవుతున్న ఫిర్యాదులను కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను ఒక శాఖ నుండి మరో శాఖకు మళ్లించడం కాకుండా, సంబంధిత అధికారులు స్వయంగా స్పందించి సమస్యలకు పరిష్కారం చూపాలని కమిషనర్ స్పష్టం చేశారు. శాఖలన్నీ పరస్పర సమన్వయంతో పని చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పేర్కొన్నారు.ఈ సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మొత్తం 24 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. వీటిలో పట్టణ ప్రణాళిక శాఖకు సంబంధించిన అక్రమ నిర్మాణాలు 10, రోడ్ల ఆక్రమణలు వంటి అంశాలపై ఎక్కువ ఫిర్యాదులు నమోదు కాగా, రెవెన్యూ 3, ఇంజనీరింగ్ 6, ప్రజారోగ్య శాఖలకు సంబంధించిన 2, యూసీడి 1, హార్టికల్చర్ 2 ఫిర్యాదులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి ఫిర్యాదును అధికారులు స్వయంగా పరిశీలించి, ప్రజలకు స్పష్టమైన మరియు శాశ్వత పరిష్కారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పారదర్శకంగా, సమర్థవంతంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు ఏ. రవీంద్రరావు, డాక్టర్ డి. చంద్రశేఖర్, కె. శకుంతల, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సృజన, పర్యవేక్షణ ఇంజనీర్ (వర్క్స్) చంద్రశేఖర్, ఇంచార్జ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పార్క్స్ చంద్రశేఖర్, అకౌంట్స్ ఆఫీసర్ బి. సత్యనారాయణమూర్తి, ఎస్టేట్ ఆఫీసర్ ఏ. శ్రీధర్, రీజినల్ ఫైర్ ఆఫీసర్ సి హెచ్ రత్న బాబు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ డి. హరీష్, బయాలజిస్ట్ సూర్యకుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కోలగట్లలో వి.పి.ఆర్ నేత్ర కార్యక్రమం ప్రారంభం

**200 మందికి పైగా ఉచిత కంటి పరీక్షలు**
**అవసరమైన వారికి కళ్లద్దాల పంపిణీ**



**సంగం, జూన్ 15(వార్తాప్రభ ప్రతినిధి)** సంగం మండలం కోలగట్ల గ్రామంలో వి.పి.ఆర్ నేత్ర కార్యక్రమాన్ని టీడీపీ మండల అధ్యక్షులు బాణా శ్రీనివాసులురెడ్డి టీడీపీ నాయకులు కర్నాటి రవీంద్రారెడ్డి సొసైటీ అధ్యక్షులు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రామస్తులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించగా అవసరమైన వారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు.వి.పి.ఆర్ నేత్ర వైద్య శిబిరానికి గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.ఇప్పటివరకు 200 మందికి పైగా ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకున్నట్లు పేర్కొన్నారు.ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.రూపాయి ఖర్చు లేకుండా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను ప్రజలకు చేరవేయడమే ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. మొబైల్ కంటి వైద్యశాల ద్వారా పేద ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి రావడం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి చేపడుతున్న సేవా కార్యక్రమాలపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## రహదారి ప్రమాదాల నివారణకు సమన్వయంతో పనిచేయాలి - జిల్లా కలెక్టర్ డీకే బాలాజి

**మచిలీపట్నం జూన్ 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)**జిల్లాలో రహదారి ప్రమాదాలను గణనీయంగా తగ్గించి, ప్రజల ప్రాణాలను కాపాడేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లాలో 2026 జనవరి నుండి మే నెల వరకు జరిగిన రహదారి ప్రమాదాల గణాంకాలను సమీక్షించారు. పోలీసు శాఖ నివేదికల ప్రకారం 2026 సంవత్సరంలో మే నెల వరకు జిల్లాలో మొత్తం 277 రహదారి ప్రమాదాలు నమోదవగా, వాటిలో 115 ప్రాణాంతక ప్రమాదాలు, 162 ప్రాణాంతకం కాని ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఈ ప్రమాదాల్లో 121 మంది మృతి చెందగా, 305 మంది గాయపడ్డారని అధికారులు వివరించారు.

**ద్విచక్ర వాహనాలు, కార్లు ప్రమాదాలకు ప్రధాన కారణం**వాహనాల వారీగా పరిశీలించగా, 2026 మే నెల వరకు నమోదైన ప్రమాదాల్లో ద్విచక్ర వాహనాలు 113 ప్రమాదాలతో మొదటి స్థానంలో, కార్లు, జీపులు, ట్యాక్సీలు, వ్యాన్లు 73 ప్రమాదాలతో రెండో స్థానంలో ఉన్నట్లు గుర్తించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం, అతివేగాన్ని నియంత్రించడం, మద్యం సేవించి వాహనాలు నడపకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పోలీసు శాఖకు సూచించారు.

**జాతీయ రహదారులపై అధిక ప్రమాదాలు**రోడ్ల వారీగా సమీక్షలో జిల్లాలోని జాతీయ రహదారులపై అత్యధికంగా 138 ప్రమాదాలు నమోదై 64 మంది మృతి చెందగా, 167 మంది గాయపడ్డారు. ఇతర రహదారులపై 90 ప్రమాదాలు, రాష్ట్ర రహదారులపై 49 ప్రమాదాలు నమోదయ్యాయి. ప్రమాదాలు అధికంగా జరుగుతున్న బ్లాక్‌స్పాట్లను గుర్తించి తక్షణమే సరిదిద్దే చర్యలు చేపట్టాలని జాతీయ రహదారుల అథారిటీ రోడ్లు భవనాల శాఖ అధికారులను ఆదేశించారు.

**మే నెలలో 66 ప్రమాదాలు..**2026 మే నెలలో జిల్లాలో మొత్తం 66 రహదారి ప్రమాదాలు నమోదవగా, 30 మంది మృతి చెందారు, 60 మంది గాయపడ్డారు. మే నెలలో కూడా ద్విచక్ర వాహనాలు, కార్లు, జీపులు, ట్యాక్సీలు, వ్యాన్ల వల్లే అధిక ప్రమాదాలు జరిగినట్లు సమావేశంలో వివరించారు.జాతీయ రహదారులపై రాత్రివేళ ప్రమాదాల నివారణకు అవసరమైన వీధి దీపాలు, హైమాస్ట్ లైట్లు, రిఫ్లెక్టివ్ సిగ్నేజ్, హెచ్చరిక బోర్డుల ఏర్పాటుపై జాతీయ రహదారుల అథారిటీ అధికారులతో సమీక్షించారు. జాతీయ రహదారులపై వీధి దీపాలు వెలగట్లేదన్న ఫిర్యాదులు ఎక్కువ అయ్యాయని, వచ్చే సమావేశం నాటికి వాటిని సరిదిద్దకపోతే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.సమావేశంలో అదనపు ఎస్పి వీవీ నాయుడు, జిల్లా రవాణా అధికారి ఎన్ యు ఎన్ ఎస్ శ్రీనివాస్, జిల్లా ప్రజారవాణా అధికారి వెంకటేశ్వర్లు, రహదారులు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లోకేశ్వరరావు, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ యుగంధర్, మచిలీపట్నం నగర మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, జాతీయ రహదారుల అథారిటీ ప్రతినిధులు, రాష్ట్ర రహదారులు, పోలీసు, రెవిన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



## చేజర్ల ఎస్టీ కాలనీలో అంగన్వాడీ పిలుస్తోంది



**చేజర్ల జూన్ 15 (వార్తాప్రభ)** చేజర్ల ఎస్టీ కాలనీ నందు అంగన్వాడీ పిలుస్తుంది కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం నందు మూడు సంవత్సరాలు నిండిన పిల్లలందరినీ అంగన్వాడీ కేంద్రానికి పంపాలని సెక్టార్ సూపర్వైజర్ ఎం.పద్మ తెలిపారు.అంగన్వాడీ కేంద్రంలో ఆటపాటల ద్వారా విద్య నేర్పిస్తూ పిల్లల్లో మెదడు యొక్క అభివృద్ధి కొరకు శారీరక మానసిక భాషా మేధా సాంఘిక వంటి ఐదు రకాల అభివృద్ధిలను దృష్టిలో ఉంచుకొని అంగన్వాడీ కేంద్రాల్లో అంగన్వాడీ కార్యకర్తలు పిల్లలచే చేయించడం జరుగుతుంది.కనుక ప్రతి తల్లి కూడా అంగన్వాడీ కేంద్రానికి తమ పిల్లలను పంపించాలని అందరికీ తెలియచేసారు.ఈ కార్యక్రమం నందు సూపర్వైజర్ ఎం.పద్మ అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏబీవీపీ ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్ గా యడవల్లి మురళి నియమాకం



**విజయవాడ పశ్చిమ జూన్ 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)**అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఎబివిపి) 11 - 14 జూన్ లో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభ్యాసవర్గ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్ గా యడవల్లి మురళి ని ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్ గా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు నూజిల్ల శ్రీనివాస్ ప్రకటించారు. మురళి గతంలో విజయవాడ నగర సంయుక్త కార్యదర్శి గా పని చేస్తూ విద్యార్థుల సమస్యలై తనదైన శైలిలో స్పందిస్తూ వస్తున్నారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఇటువంటి బాధ్యతని అప్పగించినందుకు నమ్మకం నిలబెట్టుకునేలా పనిచేస్తానని చెప్పారు. ఈ నియామకానికి ఎన్టీఆర్ జిల్లా కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

## స్వచ్ఛ తిరుపతిలో భాగస్వాములు అవ్వండి :కమిషనర్ శారదా దేవి





**తిరుపతి :జూన్ 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)** స్వచ్ఛ తిరుపతి లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి పిలుపునిచ్చారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా నగరంలోని కొర్లగుంట, సంజయ్ గాంధీ కాలనీ, వివేకానంద కూడలి తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. నగరంలో పారిశుధ్య పనులను మరింత మెరుగ్గా చేపట్టాలని సూచించారు. కాలువల్లో, రోడ్ల పక్కన, కూడళ్ళలో చెత్త, పిచ్చి మొక్కలు లేకుండా శుభ్రం చేయాలని తెలిపారు. నగరంలో స్వచ్ఛ సర్వేక్షన్ బృందం పర్యటిస్తోందని తెలిపారు. అధికారులు, సిబ్బంది ప్రజలతో సమన్వయం చేసుకుని స్వచ్ఛ సర్వేక్షన్ లో తిరుపతిని ఉన్నత స్థానంలో నిలిపేందుకు సహకరించాలని తెలిపారు. ప్రజలందరూ చెత్త ఎక్కడపడితే అక్కడ పడేయకుండా మీ ఇంటి వద్దకు వచ్చే మా సిబ్బందికి ఇచ్చి నగర పరిశుభ్రత కు సహకరించాలని పిలుపునిచ్చారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, డి.ఈ. ప్రసాద్, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, పారిశుధ్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## దీర్ఘకాలిక రోగులకు ఇంటి వద్దే వైద్య సేవలు

**చంద్రగిరి పీహెచ్‌సీలో హోమ్ బేస్డ్ పాలియేటివ్ కేర్ శిక్షణ కార్యక్రమం**





**తిరుపతి, జూన్ 15 :(వార్తా ప్రభ ప్రతినిధి):** దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ మంచానికే పరిమితమైన రోగులకు ఇంటి వద్దే సమగ్ర వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో శ్రీ వేంకటేశ్వర వైద్య కళాశాల ఆధ్వర్యంలో హోమ్ బేస్డ్ పాలియేటివ్ కేర్ ఇంప్లిమెంటేషన్ రీసెర్చ్ ప్రాజెక్ట్‌ను అమలు చేస్తున్నారు. అదనపు వైద్య విద్య సంచాలకులు మరియు ప్రిన్సిపల్ డా. జి. రవి ప్రభు, రుయా ఆస్పత్రి అదనపు వైద్య విద్య సంచాలకులు మరియు సూపరింటెండెంట్ డా. బి. మనోహర్ ప్రోత్సాహంతో ఎంఆర్‌హెచ్‌ఆర్‌యూ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగుతోంది.మొదటి విడత కార్యక్రమం మంగళం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విజయవంతంగా నిర్వహించగా, ప్రస్తుతం రెండవ విడత కార్యక్రమం చంద్రగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రారంభమైంది. ఎంఆర్‌హెచ్‌ఆర్‌యూ నోడల్ ఆఫీసర్ డా. సునీత సిరిగిరి, ప్రాజెక్ట్ ప్రధాన ఇన్వెస్టిగేటర్ మరియు పాలియేటివ్ కేర్ ఇన్‌చార్జ్ డా. రోజారమణి మార్గదర్శకత్వంలో డాక్టర్ అన్వేష్, డాక్టర్ వికాస్, డాక్టర్ వివేక్, రిటైర్డ్ గైనకాలజిస్ట్ డా. భారతి వైద్య సిబ్బందికి శిక్షణ అందించారు.ఈ సందర్భంగా హోమ్ బేస్డ్ పాలియేటివ్ కేర్ సేవలపై అవగాహన కల్పించే ఐఈసీ చిత్రపటాన్ని ఆవిష్కరించారు. చంద్రగిరి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా. శిరీష సమక్షంలో ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లకు జూన్ 15 మరియు 19 తేదీల్లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రోటరీ క్లబ్ సభ్యులు కూడా తమ వంతు సహకారం అందించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాలియేటివ్ కేర్ సేవల విస్తరణకు ఈ ప్రాజెక్ట్ దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు.

## జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ ఇవ్వాలని వినతి.



**కాకినాడ జూన్ 15 :(వార్తా ప్రభ ప్రతినిధి):** కాకినాడ జిల్లాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ఈ విద్యా సంవత్సరంలో ప్రయివేటు పాఠశాలలలో చదువుకునే 50 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని కాకినాడ సిటీ ప్రెస్ క్లబ్ కార్యవర్గం కోరింది. ఈమేరకు జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్కు కాకినాడ సిటీ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రెడ్డిపల్లి రాజేష్,సీనియర్ జర్నలిస్ట్ అంజిబాబు, కార్యవర్గ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం వార్తా సేకరణలో ఉండే జర్నలిస్టులకు వారికి జీతాలు తక్కువ ఉండడంతో పిల్లలకు ఫీజు రాయితీ వచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని తెలిపారు.గతంలో కూడా జర్నలిస్టులకు గత కలెక్టర్లు ఈ సదుపాయం కల్పించారని గుర్తు చేశారు.జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ అంజిబాబు, శ్రీనివాస్, బాబ్జి, సతీష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఐఐఐటిలో సీటు సాధించిన అర్చన యాదవ్‌కు అఖిల భారతీయ యాదవ మహా సభ శుభాకాంక్షలు



**తిరుపతి జూన్ 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విద్యారంగంలో ప్రతిభ కనబరిచి ఐఐఐటిలో సీటు సాధించిన అర్చన యాదవ్‌కు అఖిల భారతీయ యాదవ మహాసభ నాయకులు ఘనంగా అభినందనలు తెలిపారు. పాలసముద్రం మండలానికి చెందిన పి. లోకనాథం యాదవ్, పవిత్ర యాదవ్ దంపతుల కుమార్తె అర్చన యాదవ్ తన కృషి, పట్టుదలతో ఐఐఐటి లో ప్రవేశం పొందడం కుటుంబ సభ్యులతో పాటు ప్రాంత ప్రజలకు కూడా గర్వకారణమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అఖిల భారతీయ యాదవ మహాసభ చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి పి. నవీన్ యాదవ్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా ఉన్నత విద్యలో రాణించగలరని అర్చన నిరూపించిందన్నారు. ఆమె సాధించిన ఈ విజయం మరెందరో విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని తెలిపారు. అర్చన యాదవ్‌కు చిత్తూరు జిల్లా యూత్ గౌరవ అధ్యక్షులు గురుమూర్తి యాదవ్, గౌతమ్ యాదవ్, ఉపాధ్యక్షులు అశోక్ యాదవ్, తేజ యాదవ్, ప్రధాన కార్యదర్శి కుమార్ యాదవ్, జాయింట్ కార్యదర్శి సురేష్ యాదవ్, కోశాధికారి ఓం ప్రకాష్ యాదవ్, సోషల్ మీడియా కన్వీనర్ శోభన్ యాదవ్, తవణంపల్లి మండలం యూత్ అధ్యక్షులు దేవేంద్ర యాదవ్, ఉపాధ్యక్షులు విజయ్ యాదవ్, శ్రవణ్ యాదవ్ (నాని యాదవ్), బాబు యాదవ్ తదితరులు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో అర్చన యాదవ్ మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించి కుటుంబానికి, సమాజానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. ఆమె విద్యాభ్యాసంలో మరిన్ని విజయాలు సాధించాలని కోరుతూ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా అర్చన తల్లిదండ్రులను కూడా నాయకులు ప్రత్యేకంగా అభినందించి, ఆమె సాధించిన విజయానికి వారి ప్రోత్సాహం, సహకారం కీలకమని కొనియాడారు.

## రాజీవ్ గృహకల్ప సమస్యలపై ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం సమర్పణ

**కమ్యూనిటీ హాల్, సిమెంట్ రహదారుల మంజూరుకు సంక్షేమ సంఘం డిమాండ్**

**ఆషాఢ మాస బోనాల ఉత్సవాలకు ముందే గుడి పరిసరాల శుభ్రత, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని విన్నపం**



**జగద్గిరిగుట్ట, జూన్ 15, (వార్తాప్రభ) :** చింతల్ సర్కిల్ జగద్గిరిగుట్ట పరిధిలోని రాజీవ్ గృహకల్ప నివాస సముదాయంలో ఎదురవుతున్న పలు మౌలిక వసతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సంక్షేమ సంఘం నాయకులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం నాడు చింతల్‌లోని నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమంలో వారు అధికారులను కలిసి ఒక సమగ్ర వినతిపత్రాన్ని అందజేశారు. కాలనీవాసుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సంక్షేమ సంఘం ప్రతినిధులు క్రింది ప్రధాన డిమాండ్లను అధికారుల ముందుంచారు:

**సమాజ భవనం మరియు రహదారులు:** రాజీవ్ గృహకల్ప ప్రజల సామాజిక కార్యక్రమాల కోసం ఒక కమ్యూనిటీ హాల్ (సమాజ భవనం) నిర్మించాలని, కాలనీలోని అంతర్గత వీధుల్లో కొత్తగా సిమెంట్ రహదారులను (సిసి రోడ్లను) మంజూరు చేయాలని కోరారు.

**ఉద్యానవనాలు (పార్కులు):** కాలనీలో చాలా కాలంగా నిలిచిపోయిన ఉద్యానవనాల అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, స్థానిక చిన్నపిల్లలు, వృద్ధులకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

**బోనాల ఉత్సవాల ఏర్పాట్లు:** వచ్చే నెలలో ప్రారంభం కానున్న పవిత్ర ఆషాఢ మాస బోనాల పండుగను పురస్కరించుకుని కాలనీలోని శ్రీ రేణుక ఎల్లమ్మ, పోచమ్మ దేవాలయాల వద్ద ప్రత్యేక విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని కాలనీలోని ప్రతి వీధిలో పని చేయని వీధి దీపాలను పునరుద్ధరించాలని కోరారు.

**పరిశుభ్రత:** దేవాలయ పరిసర ప్రాంతాలలో మురుగునీరు, చెత్తాచెదారం లేకుండా ముందస్తుగానే పారిశుధ్య పనులను చేపట్టి, పరిసరాలను ఎంతో పరిశుభ్రంగా మార్చాలని మున్సిపల్ అధికారులను విన్నవించారు. ప్రజల వినతిపై సానుకూలంగా స్పందించిన అధికారులు, బోనాల ఉత్సవాల నాటికి వీధి దీపాలు, పారిశుధ్య పనులను పూర్తి చేస్తామని, రహదారులు మరియు భవన నిర్మాణ ప్రతిపాదనలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో రాజీవ్ గృహకల్ప సంక్షేమ సంఘం అధ్యక్షులు అంజన్న ధర్మారపు, ప్రధాన కార్యదర్శి ముచ్చంతల భూపతి రెడ్డి, సహాయ కోశాధికారి ఎస్.ఎన్. రెడ్డి లతో పాటు కాలనీ సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎంపీ కేశినేని చిన్ని సమక్షంలో ఘనంగా పిళ్ళా శ్రీనివాస్ జన్మదిన వేడుకలు



**విజయవాడ పశ్చిమ జూన్ 15: (వార్తా ప్రభ ప్రతినిధి)** తెలుగుదేశం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి పిళ్ళా శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలు సోమవారం విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని కార్యాలయంలో ఎంపీ కేశినేని చిన్ని సమక్షంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శ్రీనివాస్ పేరిట ఏర్పాటు చేసిన బర్త్డే కేక్ ను కట్ చేయగా ఎంపీ ఆయనకు కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీ చిన్ని మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి శ్రీనివాస్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని అన్నారు. ఈ సందర్భంగా పిళ్ళా శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ నాయకుడు విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని చిన్ని సమక్షంలో తన పుట్టినరోజు వేడుకలు జరగడం తనకు ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. తమ నాయకుడు కేశినేని చిన్ని ఆశీస్సులు అందజేయడం సాక్షాత్తు ఆ పరమేశ్వరుని అనుగ్రహం కలిగినంత ఆనందం తనకు కలిగినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ ఇంచార్జ్ బొప్పన భవ కుమార్, పొలిటికల్ ఎంపీ పర్సన్ నరసింహ చౌదరి, ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకట్, బీసీ నాయకులు నాని , రెల్లి యూత్ నాయకులు వడ్డాది రవి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిజాంపేట్ సర్కిల్‌లో తాగునీటి సంక్షోభం: ప్రగతి నగర్ జలమండలి కేంద్రం వద్ద ప్రజా ధర్నా!

- ఐదు లక్షల జనాభా ఉన్నా పట్టించుకోని అధికారులు.. వారం రోజుల్లో స్పందించకుంటే తీవ్ర ఆందోళనలు
- జలమండలి ఉన్నతాధికారులకు వినతిపత్రం సమర్పించిన ఐక్య కార్యాచరణ సమితి ప్రతినిధులు





**ప్రగతి నగర్, జూన్ 15, (వార్తాప్రభ) :** నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని పలు కాలనీలలో నెలకొన్న తీవ్రమైన తాగునీటి ఎద్దడిని నిరసిస్తూ సోమవారం నాడు ప్రగతి నగర్ జలమండలి పంపిణీ కేంద్రం (వాటర్ వర్క్స్ ఫిల్లింగ్ స్టేషన్) వద్ద స్థానిక ప్రజలు, ప్రజాసంఘాల ప్రతినిధులు మరియు నిజాంపేట్ సర్కిల్ ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) ఆధ్వర్యంలో భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కుండలు, ఖాళీ గిన్నెలతో తరలివచ్చిన ప్రజలు అధికారుల నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ నిరసన ప్రదర్శనతో జలమండలి కేంద్రం వద్ద ఉద్రిక్తత నెలకొనడంతో హైదరాబాద్ మెట్రోపాలిటన్ తాగునీరు మరియు మురుగునీటి పారుదల సంస్థ (జలమండలి) ప్రధాన నిర్వాహణాధికారి (జనరల్ మేనేజర్) నాగ పరిమళ, ఉప ప్రధాన నిర్వాహణాధికారి (డిప్యూటీ జనరల్ మేనేజర్) రజనీకాంత్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకున్నారు. ధర్నా చేస్తున్న ప్రజలతో, ఐక్య కార్యాచరణ సమితి ప్రతినిధులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తాగునీటి కొరత, నీళ్లు రాకపోయినా కనీస బిల్లుల వసూళ్లు, ప్రైవేటు ట్యాంకర్ల ద్వారా జరుగుతున్న నీటి విక్రయాలు, పైప్‌లైన్ లీకేజీలు, సిబ్బంది కొరత మరియు నీటి సరఫరాలో జరుగుతున్న లోపాలపై సమగ్ర వివరాలతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఐక్య కార్యాచరణ సమితి ప్రతినిధులు మరియు బస్తీవాసులు మాట్లాడుతూ.. నిజాంపేట్ సర్కిల్ పరిధిలో సుమారు ఐదు లక్షల జనాభా నివసిస్తున్నప్పటికీ, జనాభా అవసరాలకు అనుగుణంగా తాగునీటి సరఫరా జరగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతానికి రోజుకు కనీసం మూడు నుండి ఐదు కోట్ల లీటర్ల నీటి అవసరం ఉండగా, ప్రస్తుతం సరఫరా అవుతున్న నీరు చాలా తక్కువగా ఉందని తెలిపారు. గత పదేళ్లుగా జనాభా పెరిగినా దానికి అనుగుణంగా నీటి కేటాయింపుల ఉత్తర్వులను (ట్రాన్స్‌మిషన్ అలోకేషన్ ఆర్డర్) పెంచకపోవడం వల్లే ఈ ఘోర పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. వారానికి ఒక్కసారి మాత్రమే నీటి సరఫరా చేస్తున్నప్పటికీ కనీస బిల్లుల పేరిట డబ్బులు వసూలు చేయడం అన్యాయమని, ప్రజలకు కుళాయిలలో నీరు ఇవ్వని అధికారులు ప్రైవేటు ట్యాంకర్ల ద్వారా నీటిని ఎలా విక్రయిస్తున్నారని నిలదీశారు.

**అధికారుల ముందుంచిన ప్రధాన డిమాండ్లు ఇవే:** నీటి సరఫరా పెంపు:లి ప్రగతి నగర్ ప్రాంతానికి రోజుకు కనీసం ఒక కోటి లీటర్లు, నిజాంపేట్ - బాచుపల్లి ప్రాంతాలకు రోజుకు కనీసం రెండు కోట్ల లీటర్ల తాగునీటిని సరఫరా చేయాలి. నిల్వ సామర్థ్యం:లి అదనంగా రెండు పెద్ద నీటి నిల్వ ట్యాంకులను నిర్మించాలి. లి క్రమబద్ధీకరణ:లి రోజు విడిచి రోజు అయినా తాగునీటి సరఫరా జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలి. బిల్లుల పునఃసమీక్ష:లి నీరు ఇవ్వని రోజులకు కనీస బిల్లుల వసూలు విధానాన్ని వెంటనే రద్దు చేయాలి. ట్యాంకర్ల విక్రయాలపై విచారణ:లి జలమండలి నీటిని ప్రైవేటు ట్యాంకర్ల ద్వారా విక్రయిస్తున్న అంశంపై సమగ్ర విచారణ జరపాలి. పైప్‌లైన్ల మరమ్మతులు:లి నీటి లీకేజీల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టి, పైప్‌లైన్ల సామర్థ్యాన్ని పెంచాలి. ప్రజలు సమర్పించిన వినతిపత్రంపై జలమండలి ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించారని, ఇక్కడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఐక్య కార్యాచరణ సమితి ప్రతినిధులు తెలిపారు. అయితే వారం రోజుల్లోగా క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి స్పష్టమైన చర్యలు ప్రారంభించకపోతే, నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని ప్రజలందరినీ సమీకరించి మరింత పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు మరియు రాస్తారోకోలు చేపడతామని ఐక్య కార్యాచరణ సమితి హెచ్చరించింది.

# భూగర్భ జలాల పరిరక్షణకు పాత ఇంకుడు గుంతలను పునరుద్ధరించాలి: ప్రజావాణిలో అధికారులకు విన్నపం

● ఇంకుడు గుంతలు లేని బహుళ అంతస్తుల భవనాల (అపార్ట్‌మెంట్ల) తాగునీటి కనెక్షన్లు కట్ చేయాలి ● ప్లాస్టిక్ కవర్లు, ఇస్తరాకుల వాడకంపై ఫంక్షన్ హాళ్లకు నోటీసులు ఇస్తామన్న జోనల్ కమిషనర్





**కుత్బుల్లాపూర్, జూన్ 15, (వార్తాప్రభ) :** నగరంలో భూగర్భ జలాలను కాపాడుకునేందుకు గతంలో నియోజకవర్గవ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలను తక్షణమే పునరుద్ధరించాలని ప్రముఖ సామాజిక, పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ అధికారులను కోరారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమంలో ఆయన జోనల్ కమిషనర్‌ను, గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ (డిప్యూటీ కమిషనర్) ను కలిసి పలు పర్యావరణ సమస్యలపై వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కోల రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎక్కడ చూసినా సిమెంట్ రహదారులు (సిసి రోడ్లు) నిర్మించడంతో కాలికి మట్టి తగలకుండా పోయిందని, వర్షపు నీరు భూమిలోకి ఇంకే మార్గం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఇంకుడు గుంతలపై దృష్టి పెట్టకపోతే భవిష్యత్తులో మూడు వేల అడుగుల లోతుకు బోరుబావులు వేసినా చుక్క నీరు లభించని భయానక పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. గతంలో మున్సిపాలిటీగా ఉన్న సమయంలో వందలాది ఇంకుడు గుంతలను తవ్వించారని గుర్తు చేశారు. అందులో భాగంగా సూరారం కాలనీ రామ్‌లీలా మైదానం ఎదురుగా భారీ ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయగా, ప్రస్తుతం వాటిపై మట్టి పోసి పూడ్చివేశారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వాటిపై ఉన్న మట్టిని తొలగించి, సర్కిల్ పరిధిలో పూడుకుపోయిన ఇలాంటి వందలాది ఇంకుడు గుంతలను పరిశీలించి తక్షణమే పునరుద్ధరించాలని జోనల్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. సొంతంగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోని బహుళ అంతస్తుల భవనాల (అపార్ట్‌మెంట్ల) యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని రవీందర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. వర్షం పడినప్పుడు ఒక్క చుక్క నీరు కూడా వృథాగా బయటకు పోకుండా భవన ఆవరణలోనే భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకునేలా నివాసితులకు అవగాహన కల్పించాలన్నారు. నిబంధనలు పాటించని భవన సముదాయాలకు జలమండలి ద్వారా సరఫరా అయ్యే ప్రభుత్వ తాగునీటి కనెక్షన్లను తక్షణమే నిలిపివేయాలని (కట్ చేయాలని) అధికారులకు సూచించారు. వారాంతపు సంతలు, వివాహ వేడుకల శాలలు (ఫంక్షన్ హాళ్లు), హోటళ్లలో నాణ్యతలేని ప్లాస్టిక్ కవర్లు మరియు ప్లాస్టిక్ ఇస్తరాకులను విరివిగా వాడుతున్నారని మండిపడ్డారు. వీటి స్థానంలో పర్యావరణానికి మేలు చేసే ప్రత్యామ్నాయాలను వాడేలా ఫంక్షన్ హాళ్లకు కఠిన నోటీసులు జారీ చేయాలని కోరారు. దీనిపై జోనల్ కమిషనర్, గాజులరామారం ఉప కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ.. నిబంధనలు ఉల్లంఘించి ప్లాస్టిక్ వాడుతున్న ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులకు వెంటనే నోటీసులు జారీ చేస్తామని, నాణ్యతలేని ప్లాస్టిక్ కవర్లు, ఇస్తరాకుల నివారణకు గట్టి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పర్యావరణ హితం కోరుతూ జరిగిన ఈ కార్యక్రమంలో సామాజిక శ్రేయోభిలాషులు ఎండి అఖిల్, భాషా భాయ్, అనీఫ్, విక్రమ్ రెడ్డిలతో పాటు తిరుమల కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు మరియు పర్యావరణ ప్రేమికులు పాల్గొన్నారు.

## జల్ జీవన్ మిషన్ పనులు వేగవంతం చేయాలి

**ఎంపీడీవోకు వినతి పత్రం ఇస్తున్న వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు తోడేటి అశోక్**



**ఆత్మకూరు జూన్ 15 (వార్తాప్రభ)** ఆత్మకూరు రూరల్ మండలంలో జల్ జీవన్ మిషన్ కింద శాంక్షన్ అయిన వాటర్ ట్యాంకుల నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆత్మకూరు రూరల్ ఎస్సీ సెల్ అధ్యక్షులు తోడేటి అశోక్ ఆధ్వర్యంలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తోడేటి అశోక్ మాట్లాడుతూ మండలంలోని 21 గ్రామ పంచాయతీలకు జల్ జీవన్ మిషన్ కింద వాటర్ ట్యాంకులు మంజూరైనప్పటికీ ప్రస్తుతం కేవలం 11 ట్యాంకుల పనులు మాత్రమే కొనసాగుతున్నాయని, మిగిలిన గ్రామాల్లో పనులు ప్రారంభం కాకపోవడంతో ప్రజలు తాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే ప్రారంభించి ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న 11 వాటర్ ట్యాంకులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. తాగునీరు ప్రజల ప్రాథమిక హక్కు కావడంతో ఈ అంశాన్ని అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్సీ నాయకులు వరప్రసాద్ సుమంత్ వెంకటేష్ రాజాడిక్కీ జయ కుమార్ మరియు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు

## 'ట్రాన్స్ఫర్ త్రిమూర్తులు' సస్పెన్స్ థ్రిల్లర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది: హీరో నవీన్ వడ్డే



**విజయవాడ జూన్ 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)** స్థానిక ఐలాపురం హోటల్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో 'ట్రాన్స్ఫర్ త్రిమూర్తులు' సినిమా ప్రమోషన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హీరో నవీన్ వడ్డే మాట్లాడుతూ, ఈ చిత్రం సస్పెన్స్ థ్రిల్లర్‌తో పాటు కుటుంబ విలువలు, మానవ సంబంధాలను ప్రతిబింబించే కథాంశంతో రూపొందిందని తెలిపారు. ఈ సినిమాలో తన పాత్ర పూర్తిగా కొత్త కోణంలో కనిపిస్తుందని, ప్రేక్షకులకు పాత నవీన్‌తో పాటు కొత్త నవీన్‌ను కూడా పరిచయం చేసే చిత్రమిదని చెప్పారు. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలు ఇందులో ఉన్నాయని పేర్కొన్నారు. హీరోయిన్ రాశి సింగ్ మాట్లాడుతూ, విజయవాడ ప్రేక్షకుల నుంచి లభించిన ఆదరణ తనను ఎంతో ఆనందానికి గురిచేసిందన్నారు. 'ట్రాన్స్ఫర్ త్రిమూర్తులు'లో తన పాత్రకు గ్లామర్‌తో పాటు భావోద్వేగాలకు కూడా ప్రాధాన్యత ఉందని చెప్పారు. దర్శకుడు కథను ఆధునిక శైలిలో తెరకెక్కించారని, సాంకేతికంగా సినిమా ఉన్నత ప్రమాణాలతో రూపొందిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హీరో నవీన్ వడ్డే, హీరోయిన్ రాశి సింగ్‌తో పాటు చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి ఆమడ దూరంలో విశ్వకర్మలు: సాంస్కృతిక శాఖ సలహాదారు దరువు అంజన్న ఆవేదన

**హామీలు ఇచ్చి ఓట్లు దండుకుంటున్నారే తప్ప కమ్యూనిటీ హాల్ నిర్మించలేదు**

**కైసర్ నగర్‌లో స్థలం కేటాయించి విశ్వకర్మలను ఆదుకోవాలని ఎమ్మెల్యేకు డిమాండ్**




**సూరారం, జూన్ 15, (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో వేలాది సంఖ్యలో విశ్వకర్మలు జీవిస్తున్నప్పటికీ, రాజకీయ పార్టీలు వారిని కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నాయే తప్ప సరైన మౌలిక వసతులు కల్పించడం లేదని తెలంగాణ ప్రభుత్వ పర్యాటక, సాంస్కృతిక శాఖ సలహాదారులు దరువు అంజన్న తీవ్ర విమర్శలు చేశారు. కనీసం వారు సంఘ సమావేశాలు నిర్వహించుకోవడానికి ఒక సమాజ భవనం (కమ్యూనిటీ హాల్) కూడా నిర్మించకపోవడం విచారకరమన్నారు. సూరారంలోని విశ్వకర్మ కాలనీలో ఆదివారం నాడు అత్యంత వైభవంగా జరిగిన 'శ్రీ విరాట్ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం' ద్వితీయ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా దరువు అంజన్న మాట్లాడుతూ.. గత రెండు సంవత్సరాల క్రితం స్థానిక శాసనసభ్యులు (ఎమ్మెల్యే) కేపీ. వివేకానంద్ జగద్గిరిగుట్టలో విశ్వకర్మలకు కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామని శపథం చేశారని గుర్తు చేశారు. అదేవిధంగా కైసర్ నగర్ ప్రాంతంలో విశ్వకర్మ జాతీయుల భవన నిర్మాణం కోసం ప్రత్యేక స్థలాన్ని కేటాయిస్తానని నాడు బహిరంగంగా హామీ ఇచ్చారని, కానీ ఆ మాటను ఇప్పటివరకు నిలబెట్టుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే విశ్వకర్మ సమాజాన్ని చిన్నచూపు చూడటం మానేయాలని, తక్షణమే కైసర్ నగర్‌లో స్థలాన్ని కేటాయించి, ప్రభుత్వ నిధులతో భవనాన్ని నిర్మించి విశ్వకర్మలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం శ్రీ విరాట్ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని దరువు అంజన్న ప్రారంభించి, స్వయంగా ప్రజలకు అన్న ప్రసాదాలను వడ్డించారు. విశ్వకర్మల హక్కుల సాధన కోసం సాగుతున్న పోరాటాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఈ ఘనమైన వార్షికోత్సవ వేడుకలలో సేవా సంఘం అధ్యక్షులు పొలిగారం కృష్ణమాచారి, ప్రధాన ప్రతినిధి కమ్మరి లక్ష్మణాచారితో పాటు ఎస్ ఆర్ నాయక్ నగర్ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఆలూరి శేషాచారి మరియు నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న విశ్వకర్మలు, మహిళలు పెద్ద సంఖ్యలో

## అర్హుడైన ప్రతి ఓటరు జాబితాలో ఉండాలి

**బూత్ లెవెల్ ఏజెంట్లు బాధ్యతలు సమగ్రంగా నిర్వహించాలి**

**కొండపల్లి టిడిపి కార్యాలయంలో ఓటర్ ప్రత్యేక సమగ్ర సవరణ పై అవగాహన కార్యక్రమం**



**ఇబ్రహీంపట్నం, జూన్ 15(వార్తా ప్రభ ప్రతినిధి):** ఓటర్ లిస్ట్ ప్రత్యేక సమగ్ర సవరణ పై ప్రజల్లో ఉన్న అపోహలని నివృత్తి చేస్తూ, అర్హుడైన ఏ ఒక్క ఓటరు కూడా జాబితాలో పేరు కోల్పోకుండా బూత్ లెవెల్ ఏజెంట్లు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు తెలుగుదేశం పార్టీ నాయకుల. కొండపల్లి మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు కరిమికొండ బాలాజీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జంపాల సీతారామయ్య, కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, మైలవరం కో- ఆర్డినేటర్ చుట్టుకుదురు శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్ యొక్క ముఖ్య ఉద్దేశం మరణించిన వాళ్ల, వేరే ప్రాంతాలకు వెళ్లిపోయిన వారి,... అర్హతలేని పేర్లను జాబితాను తొలగించడం మాత్రమే అని... కొత్తగా 18 ఏళ్లు నిండినవాళ్లు ఓటు నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. డూప్లికేట్, ఒకే వ్యక్తి పేరు పలుచోట్ల ఉంటే వాటిని తొలగిస్తారని.. అర్హత కలిగిన వారికి ఓట్లకు ఎలాంటి ఇబ్బంది లేదని అన్నారు... దీనిపై కావాలనే ప్రతిపక్షాలు ప్రజల్లో భయభ్రాంతులకు గురి చేసేలా అపోహల సృష్టిస్తున్నారని వాటిని ప్రజలు నమోదుని విజ్ఞప్తి చేశారు. బి ఎల్ ఓ ఇంటికి వచ్చినప్పుడు అవసరమైన సమాచారం సమర్పించాలని...లుగుదేశం పార్టీ బూతులు ఏజెంట్లు ఎప్పుడు అందుబాటులో ఉంటారని తెలిపారు... అనంతరం బూత్ లెవెల్ ఏజెంట్లుగా నియామకమైన వారికి ఓటర్ లిస్టులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని బీజేపీ వినతి

**పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వానికి చెడ్డ పేరు**



**ఇబ్రహీంపట్నం, జూన్ 15 (వార్తా ప్రభ ప్రతినిధి):** జూపూడిలో తాగునీటి పైపులైన్ లీకేజీని అరికట్టాలని కోరుతూ బీజేపీ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షురాలు పయ్యావుల జయలక్ష్మి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మికి సోమవారం వినతిపత్రం అందజేశారు. అలాగే కిలేశపురంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. వర్షపు నీరు నిల్వ ఉండటం వల్ల ఇళ్లల్లోకి పాములు వస్తున్నాయని చెప్పారు. అనంతరం సమస్యలను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే వసంత వెంటనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ కొండపల్లి పట్టణ అధ్యక్షురాలు తమ్మినేని మాధురి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కూనాల యుగంధర్, యువ మోర్చా జిల్లా సెక్రటరీ సంజయ్, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు కరుకుమల్లి సత్యవతి, బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు పయ్యావుల రాము, మహిళా మోర్చా మండల నాయకురాలు నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి కృష్ణాజిల్లా కలిదిండి మం॥ మానవత నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

● మొదటి కార్యక్రమంగ దివ్యాంగునికి 12 వేలు ఖరీదు చేసే ట్రై సైకిల్ వితరణ..



**కలిదిండి,జూన్ 15 (వార్తాప్రభ) :** స్థానిక కళ్యాణి ఫంక్షన్ హాల్ లో 2026-27 కలిదిండి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారాన్ని నూకల శ్యామలరావు గుప్తా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణా జిల్లా సెంట్రల్ కమిటీ చైర్మన్ రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు నిర్వహించారు. అధ్యక్షులుగా పోకల దుర్గాప్రసాద్, కార్యదర్శిగా వడుపు రమేష్ ట్రెజరర్ గా పత్తి శ్రీనివాసరావు ఆరుగురు కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. మొట్టమొదటి కార్యక్రమంగా కట్టా వారి పాలెం కు చెందిన కట్టా కోటయ్య దివ్యాంగునికి రూ॥ 12,000 ల విలువచేసే ట్రై సైకిల్ అందించారు ఈ కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణాజిల్లా పర్యావరణ పరిరక్షణ కమిటీ చైర్మన్ దండమూడి జయలక్ష్మి కార్యదర్శి జె వి వి సత్యనారాయణ కెరీర్ గైడెన్స్ చైర్మన్ ప్రొఫెసర్ శోదా బత్తుల విజయకుమార్ మరియు పెద్ద ఎత్తున్న మానవతా కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వాసవి జాగృతి క్లబ్ వారిచే రైస్ బ్యాగ్'ల వితరణ



**గుడివాడ,జూన్ 15 (వార్తాప్రభ) :** వాసవి జాగృతి క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో ప్రతి నెల అమావాస్య రోజు సభ్యుల యొక్క సహకారంతో గుప్పెడు బియ్యం కార్యక్రమం లో భాగంగా సోమవారం గుడివాడ ధనియాల పేట లోని ప్రణవశ్రమం లో 26 కెజీల బియ్యం బస్తా వితరణగా ఇవ్వడం జరిగింది. అలాగే ఆశ్రమంలో చదువుకునే పిల్లలకు బిస్కెట్ ప్యాకెట్స్ చిప్స్ ప్యాకెట్స్ అందజేయడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్యన్ కొల్లిపర వెంకట నరసింహారావు విచ్చేయటం జరిగింది ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు శేగు వెంకటప్రసాద్ కార్యదర్శి కంతేటి హరినాథ్ బాబు కోశాధికారి బచ్చు ఉమామహేశ్వరావు డిస్టిక్ కోఆర్డినేటర్ శేగు బబిత మరి ఒక డిస్టిక్ కోఆర్డినేటర్ గాదె మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## 500 మార్కులు దాటిన విద్యార్థులకు ప్రశంసపత్రంతో పాటు నగదు బహుమతులు



**గుడివాడ,జూన్ 15 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం మచిలీపట్నం శాఖ (రిజిస్ట్రేషన్ నెంబర్ 190 / 2024) నిన్న మచిలీపట్నంలో విశ్వకర్మ భవనం నందు విశ్వబ్రాహ్మణ విద్యార్థిని విద్యార్థులకు 500 మార్కులు దాటిన వారికి నగదు బహుమతి సర్టిఫికెట్ క్యాష్ అవార్డు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చింతలూరు సత్యనారాయణ, కోశాధికారి ప్రవీణ్ కుమార్, టౌన్ అధ్యక్షులు గాదె వెంకటరమణ, కార్యదర్శి సుధాకర్ బాబు, కోశాధికారి ఎదిపర్తి నాగేశ్వరావు, శ్రీనివాస రావు, డి ఉమామహేశ్వర రావు, జి రామ్‌బ్రహ్మం, మానేపల్లి దుర్గారావు, ఆలూరు శ్రీనివాసరావు, వానపాముల ప్రసాద్, దేవేంద్ర కుమార్, మానేపల్లి మోహన్, ఉమా సరస్వతి, పెంట శివప్రసాద్ ఇతర నాయకులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలి




**తిరువూరు,జూన్ 15 (వార్తాప్రభ) :** తిరువూరు పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఎమ్మార్వో కార్యాలయం ఆవరణలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు అర్హులైన ప్రతి పేదవారికి రెండు సెంట్లు ఇంటి స్థలం ప్రభుత్వం ఇవ్వాలని నినాదాలు చేశారు ఆర్డీవో ఏ కుమార్ కు వినతి పత్రాలు సమర్పించారు అనంతరం ఆర్డిఓ మాట్లాడుతూ సిపిఎం పార్టీ నాయకులు అర్హులైనపేద ప్రజలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు దానిపై త్వరలోనే ఇచ్చిన అర్జీలపై సమగ్ర విచారణ జరిపి ఎవరైతే వెల్జిబుల్ అవుతారు వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయటం జరుగుతుందని ఆర్డీవో ఏ కుమార్ తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో చంద్రమౌళి సిపిఎం నాయకులు పాల్గొన్నారు

## బాపట్ల ఈటీసీలో శిక్షణకు ఎలీషారావు...



**గుడ్లవల్లేరు,జూన్ 15 (వార్తాప్రభ) :** బాపట్లలోని ఎక్షటెన్షన్ ట్రైనింగ్ సెంటర్(ఈటీసీ)లో శిక్షణ పొందేందుకు డెప్యూటీ ఎంపీడీఓ వి.ఎలీషారావు వెళ్లారని ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్ సోమవారం తెలిపారు. వచ్చే నెల 14వ తేదీ వరకు గ్రామ పంచాయితీ పాలనా వ్యవహారాలపై ఎలీషారావుకు 30రోజుల పాటు శిక్షణ ఉంటుందని ఆయన చెప్పారు. ఆయన వచ్చే వరకు డెప్యూటీ ఎంపీడీఓగా ఇమ్రాన్ అదనపు బాధ్యతల్ని నిర్వహించనున్నారు.

# 15లో 11 డిఎస్సీలు టీడీపీలో తీసినవే!.

● డిఎస్సీని రద్దు చేస్తాననడం వైసీపీ అవివేకతనానికి నిదర్శనం ● టీడీపీ నేతలు వెల్లడి!





**కాకినాడ,జూన్ 15 (వార్తాప్రభ) :** ఇప్పటివరకు టీచర్ల నియామకం కోసం నిర్వహించిన డీఎస్సీ పరీక్షల ఎంపికలలో 11 తమ టీడీపీ ప్రభుత్వ హయాంలో తీసినవేనని టీడీపీ నాయకులు వెల్లడించారు. ఎంతోకాలం కష్ట పడి చదివి టీచర్ ఉద్యోగాలు పొందిన వారిని రద్దు చేయిస్తానని వైసీపీ నేతలు చెప్పడం వారి అవివేకతనానికి నిదర్శమని వారు పేర్కొన్నారు. సోమవారం కాకినాడలోని గోదావరి కళాక్షేత్రంలో 2025 డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులతో పట్టభద్రుల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రాజశేఖర్ మాట్లాడుతూ తమ కూటమి ప్రభుత్వం డీఎస్సీని నిష్పక్షపాతంగా నిర్వహించిందన్నారు. ఉద్యోగాలు పొంది సుమారు 6 నెలలు దాటినా ఇప్పుడు వైసీపీ వారు అందులో అక్రమాలు జరిగాయని పేర్కొనడం పట్ల వారి అవివేకం బయటపడి ందన్నారు. వైసీపీకి చెందిన మరి కొందరైతే డిఎస్సీ రద్దు చేస్తామని చెప్పి ఎంపికైన ఉపాధ్యాయులలో భయాందోళనలు సృష్టిస్తున్నట్లు పేర్కొన్నారు. వారు ఆరుగాలం కష్టపడి చదివి ఉద్యోగం సాధించారని వారు ఏ ప్రభుత్వ దయ దక్షిణాల మీద ఆధారపడలేదన్నారు. తీసిపడేయడానికి వారు చేస్తున్నవి వాలంటీర్ ఉద్యోగాలు కాదని రాజశేఖరం ఎద్దేవ చేశారు. ఇకనుంచి ప్రతి ఏడాది డీఎస్సీ, గ్రూప్ స్థాయి వంటి ఉద్యోగాలకు నియమాకం జరుగుతుందని పేరాబత్తుల చెప్పారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు)మాట్లాడుతూ డీఎస్సీలో అక్రమాలు జరిగాయని వైసీపీ వాళ్ళు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. అక్రమాలు, అవ్వకతవకలపై విద్యాశాఖ కార్యదర్శి ఆధారాలు చూపించాలని కోరినా వారు అందుకు వెనుదిరిగిన సంఘటనను గుర్తు చేశారు. నాడు బి నేడు పేరుతో వైసీపీ గోడలకు రంగులు, సున్నాలు మాత్రమే వేసిందని టీచర్ ఉద్యోగాలు భర్తీ చేయలేదని చెప్పారు. వైసీపీ చేస్తున్న కుట్రలను తిప్పి వనమాడి ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. అంతకుముందు డీఎస్సీలో ఉపాధ్యాయులు ఎంపికైన వారి అనుభవాలు, కష్టపడిన తీరులను సభకు వివరించారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ రవి, పిఆర్టియు జిల్లా అధ్యక్షుడు సిహెచ్ ప్రదీప్ కుమార్, ఎస్టియు జిల్లా అధ్యక్షుడు ఎన్ సత్యనారాయణ, నోబెల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వి సూరిబాబు, సిపిఎస్ రాష్ట్ర ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎం రవికుమార్, పిఈటి అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామం అనేది కేవలం నివాస స్థలం కాదు

● జ్ఞాపకాల నిలయం, సంస్కృతి సంపదకు ప్రతిరూపం

● "మన ఊరి పడమటి చెరువు -మనందరి కుశలం అడిగిందే శేషమాంబ" గ్రంథావిష్కరణ సభ జయప్రదం..





**గుడివాడ,జూన్ 15 (వార్తాప్రభ) :** రచయిత్రి గవిర్నేని రాధ ఆత్మీయ స్మృతి గ్రంథం "మన ఊరి పడమటి చెరువు – మనందరి కుశలం అడిగిందే శేషమాంబ" గ్రంథావిష్కరణ సభ అత్యంత జయప్రదంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన భారతీయ సంప్రదాయ పరిరక్షణ ప్రచారకర్త 'భారతీయం' (గొట్టిపాటి) సత్యవాణి గ్రంథాన్ని ఆవిష్కరించి, పుస్తకంలోని సంఘటనలు, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వ విలువలు, గ్రామీణ జీవన విధానంలోని ఆత్మీయత గురించి ఎంతో హృదయాన్ని తాకేలా ప్రసంగించారు. రచయిత్రి గవిర్నేని రాధ తన బాల్య స్మృతులను, అప్పటి గ్రామీణ జీవన సౌందర్యాన్ని, మానవ సంబంధాల మాధుర్యాన్ని, అందరూ కలిసి జరుపుకునే పండుగల ఆనందాన్ని, జానపద గేయాల విశిష్టతను, గ్రామీణ ఆయుర్వేద వైద్య సంప్రదాయాలను ఎంతో భావోద్వేగంతో వివరించి సభికులను గత స్మృతుల లోకంలోకి తీసుకెళ్లారు. "సంబంధాలు సంపద కంటే గొప్పవి, సంస్కృతి నాగరికత కంటే శాశ్వతమైనది" అనే భావన ఈ గ్రంథం ద్వారా ప్రతిధ్వనించింది. తొలుత రచయిత్రి కుమార్తె లైన కాసరనేని పద్మప్రియ, మండవ ఆశాప్రియ లు అద్భుతమైన కూచిపూడి నృత్య ప్రదర్శన చేసి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఈ అద్భుత కార్యక్రమం వెనుక ఉన్న ప్రధాన శక్తి, సమన్వయకర్త గవిర్నేని బాబు శ్రీకర్. కార్యక్రమాన్ని అత్యంత క్రమబద్ధంగా, ఆత్మీయంగా, సాంస్కృతిక విలువలను ప్రతిబింబించేలా నిర్వహించి అందరి ప్రశంసలను అందుకున్నారు. ఈ కార్యక్రమం కేవలం గ్రంథావిష్కరణ సభ మాత్రమే కాకుండా, మన గ్రామీణ సంస్కృతి, మానవ సంబంధాలు, కళలు, సంప్రదాయాల వైభవాన్ని నేటి తరానికి పరిచయం చేసిన ఒక సాంస్కృతిక మహోత్సవంగా నిలిచిపోతుందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.

# పెండింగ్ అక్రిడిటేషన్ల జారీకి వినతి

● సానుకూలంగా స్పందించిన అనకాపల్లి కలెక్టర్ విజయ కృష్ణన్ ● ధన్యవాదాలు తెలిపిన జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు



**అనకాపల్లి,జూన్ 15 (వార్తాప్రభ) :** సమాచార శాఖ రికార్డులలో హాజరు కాస్త తక్కువయ్యి పెండింగ్ లో స్మాల్ దినపత్రికల అక్రిడేషన్లను జారీ చేయాలని కోరుతూ అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ కు పిజిఆర్ఎస్ కార్యక్రమంలో సోమవారం జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు వినతి పత్రాన్ని అందజేశారు. ఆయా పత్రికలను క్రమం తప్పకుండా ముద్రిస్తున్నప్పటికీ పట్నానికి డిపిఆర్ఓ ఆఫీస్ కొంచెం దూరంగా ఉండటంతో పత్రికలు అందజేతలో సాంకేతిక సమస్యను ఎదుర్కొంటున్నామని కలెక్టర్ కు తెలిపారు. సంవత్సరానికి పూర్తి హాజరుకు కాస్త తక్కువ కావడం వల్ల అక్రిడేషన్లు పెండింగ్ లో ఉన్నాయని, హాజరు నమోదు కానీ తేదీలకు అనుమతినిస్తే ఆయా పత్రికల కాపీలను అందజేస్తామని కలెక్టర్ ను కోరారు. దానిపై స్పందించిన కలెక్టర్ ఈసారి కి అనుమతినిస్తామని హాజరు నమోదు కానీ తేదీల పత్రికల కాపీలను డిపిఆర్ఓలో అందజేయాలని ఆదేశాలు ఇచ్చారు. వాటిని పరిగణలోకి తీసుకోవాలని డిఆర్ఓకి సూచనలిచ్చారు. దీనిపై జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు కలెక్టర్ కు ధన్యవాదాలు తెలిపారు.హర్షం వ్యక్తం చేశారు. కలెక్టర్ ను కలిసిన వారిలో ఏపీయూడబ్ల్యూజే అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు జోగి నాయుడు, ప్రధాన కార్యదర్శి, డిఎం ఎసి సభ్యుడు కోరాడ చంద్రరావు, డిఎంఎసి సభ్యుడు గిరిబాబు,విశాఖ జిల్లా ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు, డిఎంఏసీ సభ్యుడు కె రాము, ఏపీజేఎఫ్ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు, డిఎంఎసి సభ్యుడు యర్రా నాగేశ్వరరావు, లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. సత్యనారాయణ, విశాఖ డిఎం ఏసి బి. శ్రీనివాసరావు, సీనియర్ జర్నలిస్టులు టి.రమేష్, సంతోష్ కుమార్ ,కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మండల పరిధిలోని పాఠశాల స్కూల్ బస్సులను తనిఖీ





**నూజివీడు,జూన్ 15 (వార్తాప్రభ) :** నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండల పరిధిలోని పాఠశాల స్కూల్ బస్సులను మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ మరియు అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ తనిఖీలను నిర్వహించడం జరిగినది. ఈ నాలుగు మండలాల స్కూల్ బస్సులు మొత్తం 185 వాటిలో 180 స్కూలు బస్సులకు చెక్ లిస్ట్ ద్వారా పరీక్షించడం జరిగినది. మిగిలిన 5 స్కూల్ బస్సులు రిపేర్ నిమిత్తం వెళ్లినవి. ఈ చెక్ లిస్టు ద్వారా సూచించిన విధంగా బస్సులను రిపేర్లు గాని మార్పులు చేర్పులు గాని రవాణా శాఖ సంబంధించిన భద్రత నియమ నిబంధనలకు అనుగుణంగా అవి బాగు చేసుకొని ఫిట్నెస్ పరీక్ష చేసుకోవడం జరిగినది. రవాణా శాఖ నిబంధనల ప్రకారం 60 సంవత్సరాలు వయోపరిమితి దాటిన వ్యక్తి డ్రైవింగ్ చేయుటకు వీలు లేదు. స్కూల్ బస్సులు డ్రైవింగ్ చేసే వ్యక్తికి కనీసం 5 సంవత్సరాలు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండవలెను. అత్యవసర ద్వారం వద్ద ఎటువంటి అదనపు సీట్లు మరియు వేరే ఫిట్టింగ్లు చేయరాదు. ప్రతి స్కూల్ బస్సు ఏ రూట్ వెళుతుందో ఆ రూటు అన్నది డిస్ప్లేలో చూపించవలెను. ఇప్పటివరకు కాలేజీ మరియు స్కూల్ యాజమాన్యం వారితో జిపిఎస్ డాష్ బోర్డు కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పలుమార్లు సూచించడం జరిగినది. ఇప్పటికే GPS డాష్ బోర్డు కెమెరాలు ఏర్పాటు చేయని యాజమాన్యాలు వెంటనే చర్యలు తీసుకొని వాటిని ఏర్పాటు చేసుకోవలసినదిగా జిల్లా అధికారులు సూచించడం జరిగినది

**GPS మరియు డాష్ బోర్డు కెమెరాల ఏర్పాటు వల్ల :** విద్యార్థుల ప్రయాణ భద్రత నిరంతరం పర్యవేక్షించవచ్చు. బస్సులో కదలికను రియల్ టైం లో ట్రాక్ చేయవచ్చు. విద్యార్థులు స్కూలుకు వెళ్లే సమయం మరియు ఇంటికి తిరిగి వచ్చే సమయంలో వారికి కల్పిస్తున్న రక్షణ భద్రత గురించి తల్లిదండ్రులకు పూర్తి అవగాహన కల్పించవచ్చు ఏదైనా రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు తప్పు ఎవరిది అనేది తెలుసుకొనుటకు ఈ GPs కెమెరాలు పూర్తి సహకారం మనకు అందించ గలుగుతాయి. అలాగే బస్సులో ప్రయాణించే స్కూలు విద్యార్థులు పూర్తి వివరాలు మెయింటెన్ చేయవలెను. ప్రతి బస్సులో ఒక అటెండర్ ని నియమించవలెను. ఫస్ట్ ఎయిడ్ బాక్స్, అగ్నిమాపక పరికరం వీఐడీ ట్రాకింగ్ సిస్టం అమర్చ వలెను. కళాశాల యాజమాన్యం వారు విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయవలెను. స్కూల్ బస్సులు ఫిట్నెస్ స్కూల్ బస్సులు నిర్వహణలో ఏమాత్రం అశ్రద్ధ చూపించిన కఠిన చర్యలు తీసుకుంటామని, స్కూల్ బస్సు నడిపే డ్రైవర్లు పూర్తిగా ఆరోగ్యం కలిగి ఉండి హెవీ లైసెన్స్ కలిగి ఉండాలని, అలాగే పరిమితి నుంచి విద్యార్థులు ఎక్కించుకోకూడదని .స్కూల్ బస్సులకు సంబంధించి ఎప్పటికప్పుడు ప్రభుత్వం వారికి టాక్సులు చెల్లించడంతోపాటు వాహనముకు సంబంధించిన సరైన పత్రాలు ఉంచుకోవాలని, అలాగే కాలం చెల్లిన బస్సులను నడపరాదని రోడ్డుపై తిరిగే ప్రతి స్కూల్ బస్సు సామర్థ్య పరీక్షలు చేయించుకోవాలని స్కూల్ యాజమాన్యం వారికి తెలియజేయడం జరిగింది. రోడ్డు భద్రత నియమ నిబంధనలు పాటించుట, ట్రాఫిక్ రూల్స్ కు అనుగుణంగా బస్సులు నడపటం, స్కూల్ పిల్లల్ని బస్సు ఎక్కించేటప్పుడు, వారిని దింపేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని, ఎక్కడపడితే స్కూల్ బస్సులో నిలుపు రాదని నిర్నిత పార్కింగ్ ప్రదేశంలోనే బస్సులో నిలపవలెనని ప్రతి డ్రైవర్ మరియు యాజమాన్యం వారు పర్యవేక్షించడం వలన రోడ్డు ప్రమాదాలను మనం పూర్తిగా అరికట్టవచ్చును. మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ మరియు అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ తెలియజేసినారు

## 60 ఏళ్ల వయసులో ఏపీ లాసెట్‌లో 9వ ర్యాంకు సాధించిన బొప్పన నాగమల్లేశ్వరరావు



**అమరావతి,జూన్ 15 (వార్తాప్రభ) :** చదువుకు వయసు అడ్డుకాదని మరోసారి నిరూపిస్తూ, 60 ఏళ్ల వయసులో ఏపీ లాసెట్-2026లో రాష్ట్ర స్థాయిలో 9వ ర్యాంకు సాధించి బొప్పన నాగమల్లేశ్వరరావు అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం పెద్దపాలపర్రు గ్రామానికి చెందిన నాగమల్లేశ్వరరావు ఇటీవల ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్‌గా పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం నరసాపురంలో ఉంటున్నారు. పదవీ విరమణ అనంతరం తనకు ఉన్న న్యాయ విద్యపై ఆసక్తితో మూడు సంవత్సరాల ఎల్ఎల్‌బీ కోర్సులో ప్రవేశం కోసం ఏపీ లాసెట్ పరీక్షకు హాజరయ్యారు. ఏపీఎస్‌సీహెచ్ఈ తరఫున తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నిర్వహించిన ఈ పరీక్షలో 100 మార్కులు సాధించి రాష్ట్రంలో 9వ ర్యాంకు పొందారు. వేలాది మంది అభ్యర్థులతో పోటీపడి సాధించిన ఈ విజయం అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచింది. నాగమల్లేశ్వరరావు విజయంపై విద్యావేత్తలు, న్యాయవాదులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలియజేస్తున్నారు. కృషి, పట్టుదల ఉంటే ఏ వయసులోనైనా లక్ష్యాలను సాధించవచ్చని ఆయన నిరూపించారు. తదుపరి న్యాయ విద్యను విజయవాడలోని సిద్ధార్థ లా కళాశాలలో అభ్యసించే అవకాశం ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

## మోడీ మరో 15 ఏళ్లు పరిపాలన చేస్తే దేశం గర్వించదగ్గ స్థాయికి..



**గుడివాడ,జూన్ 15 (వార్తాప్రభ) :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 12 సంవత్సరాల సుపరిపాలన పూర్తి అయిన సందర్భంగా భారతీయ జనతా పార్టీ గుడివాడ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులు మన్యం భవాని శంకర్ ని సత్కరించి నరేంద్ర మోడీ పరిపాలన గురించి వారి అభిప్రాయాన్ని సేకరించడం జరిగింది. తొలుత జిల్లా ఉపాధ్యక్షులు సూరే లక్ష్మీనారాయణ (గాంధీ), అంగడాల సతీష్ లు మాట్లాడుతూ నరేంద్ర మోడీ పరిపాలన అమృత పరిపాలనని పేద ప్రజలకు ముఖ్యంగా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి నరేంద్ర మోడీ పరిపాలన కృషి చేసిందని వారిని పారిశ్రామికవేత్తలుగా తయారుచేసిందని మన రాష్ట్రానికి అత్యధిక నిధులు ఇచ్చి అప్పుల్లో ఉన్న రాష్ట్రాన్ని ఆదుకుందని అన్నారు ఈ సందర్భంగా డాక్టర్ మన్నెం భవాని శంకర్ మాట్లాడుతూ మేడిన్ ఇండియా మేకింగ్ ఇండియా అనే నినాదం తీసుకుని దేశంలోనే ఎందరో పారిశ్రామిక వేత్తలను తయారుచేసి మన దేశంలో తయారైన వస్తువులను విదేశాలకు ఎగుమతి చేయడంలో కీలకపాత్ర పోషించారని, అందువల్ల దేశం ఆర్థికపరంగా నాలుగో స్థానంలో ఉందని ఈ క్రమంలో మరో 15 ఏళు పరిపాలన చేస్తే దేశం గర్వించదగ్గ స్థాయికి ఎదుగుతుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మాచర్ల రామకృష్ణ, చందు ఆంజనేయులు, మాకాని జనార్ధన్, మహిళా మోర్చా అధ్యక్షురాలు బోనం గోపిక, ఆచారి, ఓబిసి మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు అంకమ్మ రాజు తదితరులు పాల్గొని డాక్టర్ మన్నెంని సత్కరించారు.

## ఆర్.ఆర్.పేటలో అన్న క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ



**నూజివీడు,జూన్ 15 (వార్తాప్రభ) :** నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఐ.ఏ.ఎస్. ఈ రోజు ఉదయం నూజివీడు పట్టణంలోని ఆర్.ఆర్. పేటలో ఉన్న అన్న క్యాంటీన్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంటీన్‌లో ప్రజలకు అందిస్తున్న అల్పాహార నాణ్యత, పరిశుభ్రత, మౌలిక సదుపాయాలు, లబ్ధిదారులకు అందుతున్న సేవలను ఆమె పరిశీలించారు. టిఫిన్ తయారీ, పంపిణీ విధానాన్ని పరిశీలించి, నాణ్యమైన ఆహారం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే, క్యాంటీన్‌కు వచ్చిన లబ్ధిదారులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.

## ట్రిబుల్ ఐ.టీ. సీటు సాధించిన చింతల సంజన సన్మానించిన ఎం.ఈ.ఓ. రవీంద్ర, హెచ్.ఎం. జలజ



**పెనుగంచిప్రోలు,జూన్ 15 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు గ్రామంలోని కాకాని వెంకటరత్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ట్రిబుల్ ఐటీ ఇడుపులపాయలో సీటు సాధించిన చింతల సంజనను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి కొక్కిలిగడ్డ జలజా ఆధ్వర్యంలో గౌరవ మండల విద్యాశాఖ అధికారి డి రవీంద్ర సమక్షంలో ఆ విద్యార్థి నీ ఘనంగా సన్మానించడం జరిగింది . ఈ సందర్భంగా పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయురాలు పి లీల 5000 రూపాయలు సొంతంగా ఆ విద్యార్థికి అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు మరియు సి ఆర్ ఎం టి జొన్నలగడ్డ చిన్న గోపాలరావు డి బాబు. సిహెచ్ సాంబశివరావు పాల్గొ న్నారు...

# మానవతా మూర్తి డాక్టర్ కారణి మునుస్వామి యాదవ్

● అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో సంస్మరణ సభ ● ఘన నివాళులర్పించిన మాజీ మంత్రి పరస రత్నం, మాజీ పార్లమెంట్ సభ్యులు చింతామోహన్,జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్. సోమ్ ప్రకాష్ తదితర ప్రముఖులు





**తిరుపతి,జూన్ 15 (వార్తాప్రభ) :** అఖిల భారత యాదవ మహాసభ, ఆంధ్రప్రదేశ్ విభాగం ఆధ్వర్యంలో తిరుపతిలోని దక్షిణ భారత అఖిల భారత యాదవ మహాసభ కేంద్ర కార్యాలయంలో దివంగత ప్రముఖ వైద్యులు, యాదవ నాయకులు డాక్టర్ కారణి మునుస్వామి యాదవ్ గారి సంస్మరణ సభ అత్యంత భక్తిప్రపత్తులతో జరిగింది. ఈ సందర్భంగా అఖిల భారత యాదవ మహాసభ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ సోంప్రకాష్ యాదవ్ మాట్లాడుతూ"మునుస్వామి గారు కేవలం ఒక వైద్యుడు మాత్రమే కాదు, యాదవ జాతి గర్వించదగ్గ ఒక శక్తి కేంద్రం. ఆయన మరణం యాదవ మహాసభకు తీరని లోటు. నిస్వార్థ సేవ, క్రమశిక్షణ మరియు సమాజం పట్ల అంకితభావం ఉన్న నాయకుడు కావాలని మనం కోరుకుంటాం, ఆ లక్షణాలన్నీ మునుస్వామి గారిలో మనం చూశాం. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి," అని పేర్కొన్నారు. మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ చింతా మోహన్ మాట్లాడుతూ "మునుస్వామి గారితో నాకు దశాబ్దాల అనుబంధం ఉంది. వైద్య వృత్తిలో ఉంటూనే పేదలకు ఏ రకంగా అండగా ఉండవచ్చో ఆయన నిరూపించారు. అలిపిరి ఘటన సమయంలో ఆయన చూపిన తెగువ, రోగుల పట్ల ఆయన ప్రదర్శించిన కరుణా హృదయం ఆదర్శప్రాయం. ఒక వైద్యుడిగా ఆయన సామాజిక బాధ్యతను, ఒక నాయకుడిగా యాదవ జాతి అభ్యున్నతిఏకకాలంలో సమర్థవంతంగా నిర్వహించిన అరుదైన వ్యక్తిత్వం ఆయనది," అని కొనియాడారు. మాజీ సాంకేతిక విద్యాశాఖ మంత్రి పరసా రత్నం ప్రసంగిస్తూ "మునుస్వామి గారు ఒక విజనరీ నాయకుడు. తిరుపతిలో యాదవ భవన నిర్మాణంలో ఆయన పడిన తపనను నేను దగ్గరగా చూశాను. ఒక కమ్యూనిటీ కోసం ఆయన పడ్డ ఆరాటం, నిరంతర అన్నదాన కార్యక్రమాలు ఆయనలోని గొప్ప దైవచింతనకు నిదర్శనం. ఆయన కేవలం ఒక వ్యక్తి కాదు, ఒక వ్యవస్థగా ఎదిగారు" అని ఆయన స్మృతులను నెమరువేసుకున్నారు. మాజీ శాసనమండలి సభ్యులు యండవల్లి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ "మునుస్వామి గారు కేవలం వైద్యుడిగా మాత్రమే కాకుండా, ఒక పరిపూర్ణమైన సామాజిక కార్యకర్తగా ఎదిగారు. తిరుపతిలో వారు చేసిన సేవా కార్యక్రమాలు, ముఖ్యంగా నిరుపేదలకు వైద్యం అందించడంలో వారు చూపిన చిత్తశుద్ధి ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. వారి వ్యక్తిత్వం ఎంతో నిరాడంబరమైనది, కానీ వారు చేపట్టిన పనులు ఎంతో మహోన్నతమైనవి. మునుస్వామి గారి ఆశయాలను యాదవ మహాసభ మరింత పటిష్టంగా ముందుకు తీసుకెళ్లాలని కోరుకుంటున్నాను" అని పేర్కొన్నారు. ఈ సభలో హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ ఛైర్మన్ చిన్న బాబు, విశ్వభారత్ స్కూల్ కరస్పాండెంట్ విజయ్, విశ్వ ధర్మ పీఠం ప్రధాన కార్యదర్శి విశ్వప్రకాష్, స్థానిక ప్రముఖులు బుసగాని లక్ష్మయ్య యాదవ్, శేఖర్ రెడ్డి, సమతా హాస్పిటల్ అధినేతలు డాక్టర్ ఉమాపతి యాదవ్ మరియు డాక్టర్ సమతా ప్రకాష్ లు మాట్లాడుతూ డాక్టర్ గారి మంచితనం, నిరంతర అన్నదాన కార్యక్రమాలు మరియు వారు నిర్మించిన యాదవ భవనం వంటి సేవా కార్యక్రమాలను గుర్తుచేసుకొంటు, ఎందరో పేదలకు ప్రాణదానం చేశారని, వారి నిస్వార్థ సేవలు యాదవ సమాజానికే కాకుండా యావత్ సమాజానికి ఆదర్శమని కొనియాడారు. ఈ సందర్భంగా డాక్టర్ మునుస్వామి యాదవ్ గారి కుమారులు డాక్టర్ ప్రభాత్ కిరణ్ మాట్లాడుతూ"మా నాన్నగారు అందించిన సేవలను స్మరించుకుంటూ ఇంత మంది ఆత్మీయులు ఇక్కడికి రావడం మాకు ఎంతో ఊరటనిస్తుంది. తన జీవితం ద్వారా నాన్నగారు నాకు ఇంత మంది కుటుంబ సభ్యులను అందించారు. నాన్నగారి ఆశయాలను, సేవా దృక్పథాన్ని ముందుకు తీసుకెళ్లడానికి నావంతు కృషి చేస్తాను" అని భావోద్వేగంతో తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ జాతీయ కార్యవర్గ సభ్యులు వై. ఎస్. యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దొడ్డక ఆంజనేయమూర్తి యాదవ్, శతాబ్ది ఉత్సవ కమిటీ అధ్యక్షులు బొట్ల రామారవు యాదవ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నాగమల్లిశ్వరీ యాదవ్ మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## ఫాదర్స్ డే జూన్ 21 నిజాంపేట్ రాజీవ్ గాంధీ నగర్ లో ఉచిత మెగా వైద్య శిబిరం

–డా॥ మురళీ కృష్ణ వెల్లడి



**హైదరాబాద్,జూన్ 15 (వార్తాప్రభ) :** ఫాదర్స్ డే సందర్భంగా ఈ నెల 21 వ తేదీ ఆదివారం వయోవృద్ధులు, మహిళలకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నామని డా॥ ఎస్ హెచ్ ఎన్ మురళీకృష్ణ తెలిపారు. హైదరాబాద్ నిజాంపేట్ రాజీవ్ గాంధీ నగర్ లోని క్రిష్ మెడ్ స్పెషాలిటీ క్లినిక్స్ లో ఆదివారం జరిగిన ఉచిత వైద్య శిబిరం లో ఆయన మాట్లాడారు. నేటి శిబిరం లో కంప్లీట్ బ్లడ్ కౌంట్, రాండమ్ బ్లడ్ షుగర్, ఎదీూ1జ తదితర పరీక్షలను నిర్వహించటం జరిగింది. 21 న జరగబోయే ఉచిత మెగా వైద్య శిబిరం లో సీబీసీ, క్రియేటినిన్, లివర్ ఫంక్షన్, లిపిడ్ ప్రొఫైల్, ఎదీూ1జ తదితర పరీక్షలను నిర్వహిస్తామని డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. ఈ శిబిరం లో పాల్గొనదలచిన వారు ముందుగా సెల్ నెంబర్ : 70752 12612 ద్వారా తమ ఆసుపత్రి గ్రూపు లో తమ పేర్లను నమోదు చేసుకోవాల్సింది గా కోరారు. నేటి శిబిరం లో పాల్గొన్న సీనియర్ జర్నలిస్ట్ నిమ్మరాజు చలపతిరావు మాట్లాడుతూ ఎంతో నిబద్ధత తో కూడిన సత్సంకల్పం తో ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ కు పూనుకున్న డాక్టర్ మురళీకృష్ణ ను మనసార అభినందించారు.

## చినపాండ్రాక గ్రామంలో స్వచ్ఛ రథం పనితీరును పరిశీలించిన ఎంపీడీవో శ్రీనివాస్



**కృత్తివెన్ను,జూన్ 15 (వార్తాప్రభ) :** చిన్న పాండ్రాక గ్రామంలో స్వచ్ఛ రథం పనితీరును ఎంపీడీవో శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలను స్వచ్ఛ రథం వల్ల కలుగుతున్న ప్రయోజనాల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ గతంలో ప్లాస్టిక్ బాటిళ్లు డబ్బాలు వంటి పొడి చెత్తను రోడ్ల పక్కన లేదా ఇళ్ల వద్ద పడవేసేవారమని ప్రస్తుతం స్వచ్ఛ రథం నేరుగా ఇంటి వద్దకే వచ్చి వాటిని సేకరిస్తుండటంతో ఎంతో సౌకర్యంగా ఉందని ఎంపీడీవోకు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ "ఇల్లు శుభ్రంగా ఉంటే గ్రామం శుభ్రంగా ఉంటుంది గ్రామాలు శుభ్రంగా ఉంటే దేశం శుభ్రంగా ఉంటుంది" అని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ రథం కార్యక్రమం మండలంలోని ప్రతి గ్రామంలో విజయవంతంగా అమలవుతోందని తెలిపారు. తడి చెత్త పొడి చెత్తను వేరు చేసి పొడి చెత్తను స్వచ్ఛ రథానికి అందజేసిన వారికి నిత్యావసర వస్తువులు అందించే కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ నరసింహారావు, గ్రామ కార్యదర్శి మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# హోంమంత్రి అనితపై వ్యాఖ్యలు అభ్యంతకరం

● తీవ్రంగా ఖండించిన టీడీపీ సీనియర్ నాయకురాలు పోలవరపు లక్ష్మీరాణి ● మహిళా సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్
● వ్యక్తిగత దూషణలు వైసీపీ నేతల సంస్కృతికి నిదర్శనమని విమర్శ ● మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు సహించబోమన్న లక్ష్మీరాణి
● ప్రజా సమస్యలు వదిలి వ్యక్తిగత విమర్శలతో కాలం గడుపుతున్నారని మండిపాటు

**కైకలూరు,జూన్ 15 (వార్తాప్రభ) :** హోంమంత్రి అనితపై మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలు మహిళా లోకాన్ని కించపరిచే విధంగా ఉన్నాయని, వాటిని రాష్ట్రంలోని మహిళలందరూ తీవ్రంగా ఖండిస్తున్నారని తెలుగుదేశం పార్టీ నాయకురాలు పోలవరపు లక్ష్మీరాణి పేర్కొన్నారు. వ్యక్తిగత దూషణలను రాజకీయాలుగా మార్చుకోవడం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలకు అలవాటుగా మారిందని ఆమె మండిపడ్డారు. మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడిన అమర్నాథ్ తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని రాష్ట్ర మహిళలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో లక్ష్మీరాణి మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో విభేదాలు సహజమేనని, అయితే రాజకీయ విమర్శలకు కూడా ఒక హద్దు ఉంటుందని అన్నారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన ప్రతిపక్ష నాయకులు, వ్యక్తిగత దూషణలు, అసభ్య పదజాలంతో మహిళలను అవమానించే స్థాయికి దిగజారడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక మహిళగా ఉన్నత పదవిలో బాధ్యతలు నిర్వర్తిస్తున్న హోం మంత్రి అనితపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం వెనుక ఉన్న ఆలోచన మహిళా సమాజాన్ని అవమానించడమేనని విమర్శించారు. రాష్ట్రంలో మహిళలకు గౌరవం, భద్రత కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని లక్ష్మీరాణి తెలిపారు. మహిళల సాధికారత కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న సమయంలో, వైసీపీ నేతలు మాత్రం మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ తమ అసలు మనస్తత్వాన్ని బయటపెడుతున్నారని ఆరోపించారు. మహిళలను గౌరవించని వారిని ప్రజలు ఎప్పటికీ ఆదరించరని, సమాజంలో మహిళలకు ఉన్న స్థానాన్ని అర్థం చేసుకోవాలని హితవు పలికారు. రాజకీయాల్లో విమర్శలు విధానాలపైనే ఉండాలని, వ్యక్తులపై, ముఖ్యంగా మహిళలపై




అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య సంస్కృతికి విరుద్ధమని పేర్కొన్నారు. పదవులు శాశ్వతం కావని, కానీ ప్రజల ముందు మాట్లాడే మాటలు శాశ్వతంగా నిలిచిపోతాయని గుర్తుంచుకోవాలని సూచించారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న నాయకులు మాటల్లో సంయమనం పాటించడం అవసరమని చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో మహిళలపై జరిగిన దాడులు, వేధింపులు, అనేక ఘటనల్లో బాధితులకు న్యాయం జరగలేదని లక్ష్మీరాణి ఆరోపించారు. అలాంటి పార్టీకి చెందిన నాయకులు ఇప్పుడు మహిళల గౌరవం గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మహిళల పట్ల గౌరవం ఉంటే ముందుగా తమ పార్టీ నేతల భాషను నియంత్రించాలని సూచించారు. హోంమంత్రి అనితపై చేసిన వ్యాఖ్యలు కేవలం ఒక వ్యక్తిని ఉద్దేశించినవి కావని, రాష్ట్రంలోని మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నమని ఆమె అభిప్రాయపడ్డారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ఈ సమయంలో, వారిని కించపరిచేలా మాట్లాడడం సమాజానికి మంచి సందేశం కాదన్నారు. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలనే ప్రయత్నాలను ప్రజలు ఎప్పటికీ సహించరని హెచ్చరించారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని విమర్శించడం ప్రతిపక్ష హక్కేనని, అయితే విమర్శల పేరుతో వ్యక్తిత్వ హననానికి పాల్పడటం సమంజసం కాదని లక్ష్మీరాణి పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్ని కోల్పోయిన వైసీపీ నాయకులు, ప్రజా సమస్యలపై మాట్లాడే స్థానం లేక వ్యక్తిగత విమర్శలతో కాలం గడుపుతున్నారని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించాల్సిన సమయంలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం వారి రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని అన్నారు. మహిళలను అవమానించే వ్యాఖ్యలపై రాష్ట్ర మహిళా సంఘాలు, సామాజిక సంస్థలు, ప్రజాస్వామ్యవాదులు గళం విప్పాలని లక్ష్మీరాణి పిలుపునిచ్చారు. మహిళల గౌరవాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. రాజకీయ భేదాభిప్రాయాలు ఎలా ఉన్నా మహిళల పట్ల గౌరవం చూపడం ప్రతి నాయకుడి కనీస బాధ్యత అని అన్నారు. అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలపై ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, ప్రజల ఆగ్రహాన్ని గుర్తించి వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని పోలవరపు లక్ష్మీరాణి డిమాండ్ చేశారు. మహిళలను అవమానించే సంస్కృతికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని, రాజకీయాల్లో మర్యాద, విలువలు, సంస్కారం కాపాడాల్సిన అవసరం ఉందని ఆమె స్పష్టం చేశారు.

## శ్రీ అంకమ్మ తల్లి వెండి తాపడం కు 50 వేలు,అన్నదానం కు 30వేలు విరాళం




**పెనుగంచిప్రోలు,జూన్ 15 (వార్తాప్రభ) :** శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం లో వున్న అంకమ్మ తల్లి కీ వెండి తాపడం కు విజయవాడ నగర వాస్తవ్యులు శాంతి హాస్పిటల్ అధినేత డాక్టర్ కొల్లి క్రాంతి కిషోర్ కుటుంబ సమేతంగా శ్రీ తిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ డిప్యూటీ కమిషనర్ మరియు కార్యనిర్వాహణాధికారి బి మహేశ్వర్ రెడ్డి సూచనల మేరకు శ్రీ అంకమ్మ అమ్మవారి దేవాలయం వెండి తాపడం తయారుచేయు పథకమునకు 50 వేల రూపాయలు విరాళంగా ఆలయ అధికారులకు అందజేశారు.అలాగే కృష్ణ జిల్లా పెడన మండలం, కాకర్ల పూడి గ్రామం కుంచెందిన యారగాని శ్రీనివాసరావు, మహా లక్ష్మి దంపతులు అన్నదానం కు 30 వేలు విరాళం గా ఆలయ ఏ.ఈ. ఓ. జంగం శ్రీనివాసరరావు కు అందజేశారు.వారికి ఆలయ ఇన్స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్, అర్చకులు వేద పండితుల చే వేద ఆశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రములు తీర్థప్రసాదములు అందజేసినారు..

## బంటుమిల్లిలోసర్వే నెంబర్: 176/2 భూమిని నిరుపేదలకు కేటాయించాలి...



**కృత్తివెన్ను,జూన్ 15 (వార్తాప్రభ) :** మండల కేంద్రమైన బంటుమిల్లిలో అర్హులైన నిరుపేదలకు నివేశన స్థలములు ఇవ్వాలని సిపిఎం ఆధ్వర్యంలో బంటుమిల్లి ఎమ్మార్వో ఆఫీస్ వద్ద నిరసన చేసి ఎమ్మార్వో కె. జో బాబుకి వినతి పత్రం మరియు నివేశన స్థలాల అర్జీలు సమర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి మాజేటి శివ శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో జగనన్న కాలనీలో 620 ప్లాట్లు ఇచ్చారని ఇంకా మిగులు అర్హులకు భూ సేకరణ చేసి ఇస్తామని చెప్పి ఇప్పటివరకు ఇవ్వలేదని బంటుమిల్లి లో సర్వేనెంబర్ 176/2 లో 1.60(ఎకరం అరవై సెంటు) ప్రభుత్వ భూమి ఉందని ఆ భూమిని నిరుపేద కుటుంబాలకు నివేశన స్థలాలుగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కృష్ణాజిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు కొమ్మాలపాటి రవి మాట్లాడుతూ జూన్ 30 2020 అప్పటి ఎమ్మార్వో ఆధ్వర్యంలో 6 20 ప్లాట్లు లబ్ధిదారులకు ఇవ్వగా మిగులు క్రాస్ పాయింట్స్ ఏవైతే ఉన్నావో వాటిని మరి కొంతమంది లబ్ధిదారులకు కేటాయించారని మిగిలి ఉన్న మరి కొంత మంది అర్హులకు ప్రభుత్వం భూ సేకరణ చేసి అరకులైన వారికి 90 రోజులలో నివేసిన స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారని అప్పటి నుండి ఇప్పటివరకు ఎటువంటి స్థలాలు ఇవ్వలేదని, ప్రతిరోజు కూలి పని చేసుకుని జీవనం సాగించే మాకు అద్దె ఇంట్లో ఉంటూ అద్దె కట్టుకుంటూ పిల్లలను చదివించుకుంటూ జీవనోపాధి సాగించాలంటే భారంగా ఉందని రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు స్పందించి ఏదైతే సర్వే నెంబర్ 176/2 ఎకరం 60 సెంట్లు భూమి ఉందో ఆ భూమిని నిరుపేదలకు నివేశన స్థలాలుగా కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్వో కె. జోబాబు స్పందిస్తూ నివేశన స్థలాల విషయమై పై అధికారులతో సంప్రదించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు ఎలక్ట్రికల్ మరియు రైతు సంఘం నాయకులు లంకదాసుల అజయ్ ఘోష్ షేక్ సమీర్ వై. నానాజీ వై. కిష్టయ్య కే. సాయి బాలాజీ యలవర్తి రమేష్ (చిన్ని) తదితర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పేదల సేవలో తిరివీధి లక్ష్మీరామారావు సేవా ట్రస్ట్

● పేదలకు కూరగాయలు, బియ్యం పంపిణీ ●బిక్షగాళ్లకు చెప్పులు వితరణ ● పేద విద్యార్థులకు న్యూట్రిషన్ ఫుడ్ పంపిణీ ● నిరుపేదలైన పెద్దల అన్నసంతర్పణలో భాగస్వామ్యం ●పలు మెడికల్ క్యాంపు లతో ఉచిత మందులు, కళ్ళజోళ్ళు పంపిణీ ● తిరివీధి లక్ష్మీరామారావు సేవా ట్రస్ట్ అధినేత,తిరివీధి కృష్ణకు పలువురి అభినందనలు

**నూజివీడు,జూన్ 15 (వార్తాప్రభ) :** నూజివీడు నియోజకవర్గ పరిధి లోని పలు ప్రాంతాలలో పేదలకు అనేక రకాల సేవలు అందిస్తూ తిరివీధి లక్ష్మీ రామారావు సేవా ట్రస్ట్ అధినేత, తిరివీధి కృష్ణ పలువురి అభినందనలు అందుకున్నారు. నూజివీడు పట్టణంలో హోటల్ వద్ద యాచన వృత్తి కొనసాగిస్తున్న కొత్తూరు తండాకు చెందిన షేక్ వెంకాయమ్మకు సోమవారం బియ్యం, కూరగాయలు, న్యూట్రిషన్ ఫుడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు సామాజికవేత్తలు



మాట్లాడుతూ నియోజకవర్గంలోని మారుమూల గ్రామంలో పేద కుటుంబంలో జన్మించిన తిరివీధి కృష్ణ తన తల్లిదండ్రుల ఎడల, సమాజంలో అయినవారి వేధింపులకు గురై, దిక్కులేని పేదలైన వృద్ధుల ఎడల చూపుతున్న ఎనలేని అభిమానం నేటి యువతరానికి ఆదర్శనీయమన్నారు. జన్మనిచ్చిన తల్లిదండ్రుల పేరిట సేవా ట్రస్ట్ ఏర్పాటు చేసి ఏ ఆసరాలేని పెద్దలకు సేవ చేస్తూ తల్లిదండ్రులకు చేస్తున్న సేవగా భావించడం అభినందనీయమన్నారు. నేటి సమాజంలో కన్న తల్లిదండ్రులు జీవించి ఉండగా ఆస్తులు పంచుకొని, ఆస్తి ఇచ్చిన తల్లిదండ్రులను ఇంటి నుండి బయటకు గెంటేస్తున్న వారసులు ప్రతి వీధిలో ఉన్నారని సోదాహరణంగా వివరించారు. అలాంటి సమాజంలో ముందు తరాలకు దిశా నిర్దేశం చేస్తూ తిరివీధి కృష్ణ చేస్తున్న సేవా కార్యక్రమాలు అన్ని వర్గాల ప్రజలకు ఆచరణీయమన్నారు. పలు ఆశ్రమాలలో తలదాచుకుంటూ ఉండే వయోవృద్ధులకు కూరగాయలు, న్యూట్రిషన్ ఫుడ్, బియ్యం, ఇతర వస్తువులను తరచుగా కృష్ణ వితరణగా అందించడం జరుగుతుందన్నారు. తాను సంపాదించిన డబ్బులు కొంత భాగం సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్న కృష్ణ, తన సన్నిహితులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, బంధువులతో కూడా పేదలు, ఏ ఆసరా లేని వయోవృద్ధులకు సేవ చేయాలనే మార్గంలో నడిపించడం గొప్ప అంశంగా వివరించారు. అనేక సందర్భాలలో పేదలకు మెగా మెడికల్ క్యాంపులు, ఉచిత నేత్ర వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచిత వైద్యంతో పాటు మందులు, కళ్ళజోళ్ళు ఉచితంగా అందించడం జరిగిందన్నారు. వీధుల వెంట తిరిగే యాచకులకు ఉచితంగా చెప్పులను అందించి ఎంతో సాయం చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో తిరువీధి బాలు లక్ష్మీ కోమవరపు సోను ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు

# రోడ్డు ప్రమాద మరణం కేసులో నిందితుడికి ఆరు నెలల కఠిన కారాగార శిక్ష మరియు రూ.500 జరిమానా

**నూజివీడు,జూన్ 15 (వార్తాప్రభ) :** నూజివీడు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మరిబందం గ్రామ శివారులో 2017 సంవత్సరంలో జరిగిన రోడ్డు ప్రమాద మరణం కేసులో నిందితుడికి గౌరవ న్యాయస్థానం ఆరు నెలల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.500 జరిమానా విధించింది. కేసు వివరాల ప్రకారం, పెద్దపారుపూడి మండలం వెంకటప్రగడ గ్రామానికి చెందిన అనుమాలు సాంబశివరావు (60) AP 16 AW 8162 నంబరు గల TVS XL ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తూ, మరిబందం గ్రామ శివారులో గల HP పెట్రోల్ బంక్‌లోనికి వెళ్లేందుకు తన వాహనాన్ని మలుపు తిప్పుచుండగా, అదే దిశలో వెనుక నుండి వస్తున్న AP 29 BC 3095 నంబరు గల Honda Activa ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న షేక్ అన్వర్ ఆలీ అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా మరియు హారన్ ఇవ్వకుండా వాహనాన్ని నడిపి వెనుక వైపు నుండి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో సాంబశివరావు తీవ్ర రక్తగాయాలకు గురై స్పృహ కోల్పోగా, చికిత్స నిమిత్తం నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు అప్పటికే మరణించినట్లు నిర్ధారించారు. ఈ మేరకు అందిన ఫిర్యాదు ఆధారంగా అప్పటి సబ్-ఇన్‌స్పెక్టర్ చిరంజీవి Crime No.208/2017, U/s 304(A) IPC కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తు పూర్తయిన అనంతరం గౌరవ 1వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు, నూజివీడులో అభియోగ పత్రం దాఖలు చేయగా, కేసుకు C.C. No.839/2019గా నెంబర్ కేటాయించబడింది. ఈ కేసులో నిందితుడు షేక్ అన్వర్ ఆలీ, S/o మహమ్మద్ నయీం, వయస్సు 38 సంవత్సరాలు, తాళ్ళముడి, అప్పలవీడు గ్రామం, పెదపాడు మండలం, ఏలూరు జిల్లా. కేసు విచారణ సందర్భంగా ఏలూరు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు, నూజివీడు డీఎస్పీ మరియు నూజివీడు రూరల్ సీఐ పర్యవేక్షణలో, నూజివీడు రూరల్ పోలీస్ స్టేషన్ సబ్-ఇన్‌స్పెక్టర్ శ్రీ జి. జ్యోతిబస్, కోర్టు కానిస్టేబుల్ కె. బాపూజి సహకారంతో కేసుకు సంబంధించిన సాక్షులను సకాలంలో గౌరవ న్యాయస్థానానికి హాజరుపరచి, సాక్ష్యాధారాలను సమర్పించేందుకు తగిన చర్యలు చేపట్టారు. ప్రాసిక్యూషన్ తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీ వి. ప్రసన్న సమర్థవంతంగా వాదనలు వినిపించగా, ఇరుపక్షాల వాదనలు, సాక్షుల సాక్ష్యాలు మరియు కేసులో లభ్యమైన ఆధారాలను పరిశీలించిన గౌరవ ఫస్ట్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్, నూజివీడు ఓ. అనూష నిందితునిపై మోపబడిన అభియోగాలు రుజువైనట్లు నిర్ధారించి తీర్పు వెలువరించారు. తీర్పు: నిందితుడు షేక్ అన్వర్ ఆలీకి ఆరు నెలల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.500 జరిమానా విధించబడినది.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188

## అన్నార్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించిన డొక్కా సీతమ్మ చారిటబుల్ ట్రస్ట్.



**విజయవాడ , జూన్ 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సెంట్రల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బోండా ఉమామహేశ్వరరావు ఆశీస్సులతో డొక్కా సీతమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సెంట్రల్ నియోజకవర్గంలోని పాత గవర్నమెంట్ హాస్పిటల్ లో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఎన్నో ఇబ్బందులతో అక్కడికి వచ్చిన వారికి భోజనం పెట్టడం తమకు చాలా సంతోషంగా ఉందనీ నిర్వహకురాలు అవుటుపల్లి విజయ కుమారి సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కళ్ళు ప్రైవేట్ హాస్పిటల్స్ లో చూపించుకోలేరనీ,కోటి ఆశలతో జన్మనిచ్చే ప్రతి ఒక్క స్త్రీ మూర్తికి ఎన్నో ఆశలు కోరికలు ఉంటాయన్నారు. అటువంటి మహిళా మూర్తులకి మాకు చేతనైనంత వరకు కడుపుతో ఉన్నవారి కోరికలను దృష్టిలో ఉంచుకొని అన్ని రకాల వంటలను మా చేతులతో మేమే స్వయంగా వండి వాళ్ళకి పెట్టడం జరిగిందన్నారు. తింటున్న ప్రతి ఒక్కళ్ళ ఆనందాన్ని చూస్తే తమ డొక్కా సీతమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అందరం కలిసి ఇదే కదా ఆ భగవంతుడు మనకు జన్మనిచ్చినందుకు మనం సేవ చేసుకునే భాగ్యాన్ని కలిగించాడు అని అందరం సంతోషపడ్డామని డొక్కా సీతమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు అవుటుపల్లి విజయ కుమారి చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గుబ్బల జ్యోతి, యార్రోజ్ అభిలాష్, అవుటుపల్లి ఉమామహేశ్వరి, ఉడత వినీత, రాచూర్ జయరాజ్,పుణ్యవతి, దుర్గ, లక్ష్మి లకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

## భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా
# 2019 వరకు అమలైన పథకాలన్నీ కొనసాగించాలి

### సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ సి హెచ్ శ్రీనివాస్




**జగ్గయ్యపేట జూన్ 15 (వార్తప్రభ)** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా గత పథకాలు అమలు చేయాలని రెవెన్యూ వల్, దరఖాస్తులు సులభతరం చేయాలని కోరుతూ అసిస్టెంట్ కార్మిక శాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ సి హెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికులు అనేక దశాబ్దాలుగా పోరాడి రాష్ట్రంలో 2009లో సంక్షేమబోర్డును సాధించుకున్నారు. ఈ బోర్డు ద్వారా సహజ మరణం, ప్రమాద మరణం, వివాహ కానుక, ప్రసూతి కానుక, అంత్యక్రియల ఖర్చులు, వైద్య సహాయం, చనిపోయిన కార్మికుని మృతదేహం తరలింపుకు సహాయం, బోర్డులో నమోదు కాని కార్మికులు ప్రమాదవశాత్తు చనిపోతే పరిహారం, పిల్లలకు స్కాలర్షిప్ వంటి అనేక పథకాలు పొందారు. ఈ పథకాలు ఆయా కార్మికుల కుటుంబాలకు ఎంతోకొంత ఆసరాగా నిలిచాయి. కానీ 2020లో ఉన్న ప్రభుత్వం నవరత్నాల పేరుతో పథకాలు ఇస్తున్నామనే కారణంతో వస్తున్న పథకాలన్నింటినీ ఆపివేసిందని. అప్పటి నుండి నిర్మాణ కార్మికులు సంక్షేమబోర్డును పనిచేయించాలని అనేక ఆందోళనలు చేశారన్నారు.అనంతరం 2024లో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పథకాలు అమలు చేయకపోవడంతో కార్మికుల ఆందోళనలు కొనసాగాయి. వీటి ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం 27 ఫిబ్రవరి 2026 న మెమో నెం. బిసిడబ్ల్యుబి - 14021/4/2026-డి ని విడుదల చేసిందని. 01మర్చి 2026 నుండి వివాహ కానుక, ప్రసూతి కానుక, సహజ మరణం, అంత్యక్రియల ఖర్చులు వంటి 4 పథకాలను మాత్రమే అమలు చేయమన్నట్లు ఆ మెమోలో పేర్కొన్నారని. పెండింగ్ క్లయిమ్ల గురించి కానీ, గతంలో అమలైన ఇతర పథకాల గురించి గానీ ఆ మెమోలో ప్రస్తావన లేదని. దీనితో నిర్మాణ కార్మికులు తీవ్ర నిరాశకు గురయ్యారు అన్నారు.అంతేకాక ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న 4 పథకాలను పొందడానికి కూడా అనేక షరతులు పెట్టారని. సంక్షేమబోర్డులో కొత్తగా పేర్లు నమోదు చేసుకోవాలంటే ఆన్లైన్లోనే చేసుకోవాలని చెబుతున్నారని. క్లయిమ్ కోసం కూడా సచివాలయాలలో ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని అంటున్నారని. 2020 వరకు ఎవరైతే రెన్యువల్ చేయించుకుని ఉన్నారో వారినే రెన్యువల్ చేసుకోవాలని, చేయించుకోకుండా ఉన్న వారిని మరలా రెన్యువల్ చేయవద్దని చెబుతున్నారని. ఈ నిబంధనల వలన నూటికి 10 శాతం మందికి కూడా ఈ పథకాలు వర్తించవని. దీని వలన కార్మికులకు ఎలాంటి ప్రయోజనం ఉండదు. ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించాలని సంక్షేమబోర్డు ద్వారా గతంలో (2019 వరకు) అమలైన పథకాలన్నీ కొనసాగించాలని.పెండింగ్ క్లయిమ్ ల నగదును వెంటనే చెల్లించాలని.క్లయిమ్ లకు ఇచ్చే పరిహారాలు పెంచాలని.సంక్షేమబోర్డులో సభ్యునిగా చేరడానికి / రెన్యువల్ చేసుకోవడానికి, పథకాలకు దరఖాస్తు చేసుకోడానికి ఆన్లైన్తో పాటు గతంలో వలె ప్రత్యక్షంగా కూడా తీసుకోవాలని .గతంలో కార్డులున్న వారందరిని ఎలాంటి షరతులు లేకుండా రెన్యువల్ చేయాలని.సంక్షేమబోర్డును నిర్మాణ కార్మికులకు మరింత ప్రయోజనకరంగా ఉపయోగపడేలా నిబంధనలను సులభతరం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బి.రాము, ధార నాగేశ్వరరావు, నాయకులు ఎస్.రామనాధం, కె.రవి, డి.నరేంద్ర, షేక్ బాషా, ఏం.కృష్ణా, ఎన్.కృష్ణా,బి.మైసూరు,షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు

## ప్రత్యేక సమగ్ర ఓటర్ పరిశీలనలో పాల్గొన్న కూటమి నాయకులు...



**కృత్తివెన్ను, జూన్ 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)**జూన్ 15 నుండి జులై 14 వరకూ జరుగు ప్రత్యేక సమగ్ర పరిశీలన, ఓటర్ లిస్ట్ ల పరిశీలన, కొత్త ఓట్లు నమోదు, సవరణ , అనర్హ ఓట్ల తొలగింపు కార్యక్రమాన్ని సోమవారం కృతివెన్ను మండలం చెరుకుమిల్లి 197 బూత్ లో ప్రారంభించిన బి ఎల్ ఓ కె. బాలస్వామి, ఈ కార్యక్రమంలో బి ఎల్ ఏ పట్టపు రాంబాబు కూనసాని. చిన్నా,పట్టపు నాగుల మీరా పట్టపు కృష్ణ మూర్తి యర్రంశెట్టి శ్రీనివాస రావు పాల్గొన్నారు.

## ఢిల్లీ వేదికగా నిర్వహించిన సేన ప్రస్థానం

### జాతీయ సమైక్యత కోసం కార్యక్రమంలో పాల్గొన్న సామినేని ఉదయభాను



**జగ్గయ్యపేట జూన్ 15 (వార్తప్రభ)** జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన సేన ప్రస్థానం -- జాతీయ సమైక్యత కోసం కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను రాష్ట్ర జనసేన పార్టీ నాయకులతో కలిసి పాల్గొన్నారు.దేశ సమగ్రత, జాతీయ ఐక్యత మరియు జనసేన పార్టీ భావజాల విస్తరణ లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో దేశభక్తి, జాతీయ సమైక్యత అంశాలపై పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ చేసిన ప్రసంగాన్ని ఉదయభాను ఆసక్తిగా ఆలకించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన జనసేన నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొని జాతీయ సమైక్యతకు జనసేన పార్టీ కట్టుబాటును చాటిచెప్పారు.ఈ సందర్భంగా సామినేని ఉదయభాను మాట్లాడుతూ, దేశ ప్రయోజనాలు మరియు జాతీయ సమగ్రతకు జనసేన పార్టీ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని, పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ నాయకత్వంలో జనసేన భావజాలాన్ని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు

## పబ్లిసిటీ కోసమే పవన్ కళ్యాణ్ , సామినేని ఉదయభాను పై అనుచిత వ్యాఖ్యలు -జనసేన నాయకులు.




**జగ్గయ్యపేట జూన్ 15 (వార్తప్రభ)**పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జనసేన నాయకులు మాట్లాడుతూ,ఇటీవల ఓ సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత ఇంటూరి రాజగోపాల్ (చిన్నా) రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరియు ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను పై చేసిన అసభ్యకర, వ్యక్తిగత వ్యాఖ్యలను జగ్గయ్యపేట జనసేన నాయకులు తీవ్రంగా ఖండించారు. రాజకీయంగా ప్రజల మద్దతు కోల్పోయిన కొందరు నాయకులు కేవలం పబ్లిసిటీ కోసం వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్నారని వారు విమర్శించారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన నాయకులు వ్యక్తిగత విమర్శలు, అనుచిత వ్యాఖ్యలతో రాజకీయ సంస్కృతిని దిగజార్చడం బాధాకరమన్నారు.ఇంటూరి రాజగోపాల్ చేసిన వ్యాఖ్యలు జనసేన పార్టీ కార్యకర్తలు, అభిమానుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయని పేర్కొన్నారు. రాజకీయాల్లో విభేదాలు సహజమే అయినప్పటికీ, వ్యక్తిగత దూషణలు, అసభ్య పదజాలం ఉపయోగించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు.ఇలాంటి వ్యాఖ్యలను జనసేన పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని, ఇంటూరి రాజగోపాల్ (చిన్నా) క్షమాపణలు చెప్పాలని జనసేన నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై చర్చించకుండా వ్యక్తిగత విమర్శలకు దిగడం వైసీపీ నాయకుల దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని జనసేన నాయకులు అన్నారు.

# పెంచిన మేతల ధరలు తగ్గించేవరకు ఉద్యమ బాట

### ఆక్వారైతులు అల్టిమేటం.. నేడు జిల్లా కేంద్రంలో నిరసన..



**అమలాపురం, జూన్ 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సిండికేట్‌గా ఏర్పడిన మేతల తయారీ దారులు రైతులను నట్టేట ముంచేలా ఇష్టారాజ్యంగా మేతల ధరలు పెంచుతున్నారని ఆక్వారైతు సంఘ నాయకులు మండిపడ్డారు. రాష్ట్ర ఆక్వారైతు సంఘం పిలుపు మేరకు అమలాపురంలో క్షత్రియ కళ్యాణ మండపం వద్ద కోనసీమ జిల్లా ఆక్వారైతు సంఘ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబు రాజు అధ్యక్షతన జిల్లా స్థాయి ఆక్వారైతులు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆక్వా రైతు సంఘ రాష్ట్ర కార్యదర్శి త్సవటపల్లి నాగభూషణం హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ ఆక్వారైతులు పెరిగిన పెట్టుబడులతో నష్టాల్లో కూరుపోతున్న సమయంలో మేతల తయారీదారులు ధరలు పెంచడం దారుణమన్నారు. ప్రభుత్వం మేతల కంపెనీలతో చర్చలు జరుపుతున్నక్రమంలో కూడా అవేమీ పట్టనట్టు వ్యవహరిస్తూ ఏకపక్షంగా మేతల ధరలు పెంచడం ఉద్దేశ్యపూర్వకమేనన్నారు. ప్రభుత్వం కూడా ఆక్వారైతుల ఇబ్బందులను ఏమాత్రం పట్టనట్టు వ్యవహరించడం సరైంది కాదన్నారు. పెంచిన ఆక్వామేతల ధరలను నిరసిస్తూ జిల్లా కేంద్రమైన అమలాపురంలోని నల్లవంతెన ధర్నా చౌక్ వద్ద మంగళవారం ఉదయం నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈకార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆక్వా రైతులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సంఘ జిల్లా అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబు రాజు మాట్లాడుతూ మేతల తయారీ దారులు సిండికేట్‌గా మారి ప్రభుత్వం చర్చలు జరుపుతున్నప్పటికీ అవేమీ పట్టకుండా ఏకపక్షంగా ధరలు పెంచాయన్నారు. దేశానికి విదేశీ మారకద్రవ్యాన్ని తీసుకొచ్చే ఆక్వా పరిశ్రమలోని ఇబ్బందులపై వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఆక్వా రైతులను అన్నివిధాలుగా దోచుకుంటున్న సిండికేట్ వ్యవస్థ రూపుమాపాలన్నారు. ఈకార్యక్రమంలో రైతు నాయకులు రుద్రరాజు నానీరాజు, అల్లూరి రమేష్‌రాజు, చెయ్యేరు సూరిబాబు రాజు, త్సవటపల్లి నాగు, పోతుకూరి సత్తిబాబు, త్సవటపల్లి మణికుమార్, రుద్రరాజు శ్రీనివాసరాజు, మోటూరి నాని, మేడిద శంకరం, రుద్రరాజు సూరిబాబు రాజు తదితరులు పాల్గొన్నారు.

## బిఎల్ఎ లకు ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రత్యేక శిక్షణ.

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి.



**ఎల్బీనగర్ / వార్తప్రభ (జూన్ 15):** నియోజకవర్గంలో 271 పోలింగ్ బూత్‌ల బిఎల్ఏలు, ఇన్‌చార్జ్‌లకు కడ్తాల్ మండలంలోని మైసిగండిలోగల ఎస్కే ప్యాలెస్ లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, టీపీసీసీ ఇన్‌చార్జ్ గౌరు సతీష్ పాల్గొని దిశా నిర్దేశం చేశారు. ఓటరు జాబితా సవరణ (ారx=) ప్రక్రియపై అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, తప్పుల సవరణ, కొత్త ఓటర్ల నమోదు మరియు అనవసర తొలగింపులను అడ్డుకోవడం బిఎల్ఏల బాధ్యతని స్పష్టం చేశారు. ఎన్నికల్లో పారదర్శకత కోసం బూత్ స్థాయిలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా శ్రమించాలని పిలుపునిచ్చారు.

**మైసిగండి ఆలయంలో ఎమ్మెల్యే కశిరెడ్డి ప్రత్యేక పూజలు** .కడ్తాల మండల మైసిగండి క్షేత్రంలో ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకున్న ఆయనకు పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. ఈ పూజల్లో కాంగ్రెస్ ముఖ్య నాయకులు బాలాజి సింగ్, శ్రీనివాస్ గౌడ్ మరియు ఇతర నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్థలం వివాదంలో తీవ్ర ఉద్రిక్తత



**ఇబ్రహీంపట్నం,జూన్ 15 (వార్తా ప్రభ ప్రతినిధి):** మండల పరిధిలోని కిలేశపురంలో రెండు కుటుంబాల మద్య నెలకొన్న స్థలం వివాదం సోమవారం తీవ్ర ఉద్రిక్తతకు దారిసింది. మంగళగిరి ప్రాంతానికి చెందిని కొందరు వచ్చి స్థలం వద్ద ఉద్దేశపూర్వకంగా గొడవలు సృష్టించారు. రెండు వర్గాలు బాహాబాహీకి దిగేంత పనైంది. సేకరించిన సమాచారం మేరకు 1956 లో పూర్వీకుల నుంచి వచ్చిన స్థలంపై దార్ల పెద్ద మార్కొండియులు, దార్ల మార్క్ ఇద్దరు అన్నదమ్ముల మద్య వివాదం నెలకొంది. ఇరువురు 40ఏల్ల క్రితమే కోర్టులను ఆశ్రయించారు. అన్నయ్యకు చెందిన మూడో తరం వారసులు 'ఆస్థలంలో ఇప్పటికీ ఉంటుండగా, తమ్ముడికి చెందిన వారసులు మంగళగికి ప్రాంతంలో సెటిలయ్యారు. 1985లో (41ఏళ్ల) క్రితం కోర్టు ఆర్డర్ వచ్చిందంటూ ఇళ్లు ఖాళీ చేయాలని తమ్ముడి భార్య. కుమార్తెలు గొడవకు దిగారు. ఈ వివాదం గ్రామ పెద్దలు అధికారుల వరకు చేరింది. 40ఏళ్ల కోర్టు ఆర్డర్ 14ఏళ్ళు దాటితే ఇప్పుడు చెల్లదని, అధికారులు. పెద్దలు నిర్ణయించారు. ఐదు సెంట్లు స్థలంలో ఇద్దరి వారసులు చెరిసగం తీసుకోవాలన్నారు. లేని పక్షంలో మరళా కోర్టును ఆశ్రయించాలని చెప్పారు. ఇందుకు అన్నయ్య వారసులు పెద్దల నిర్ణయాన్ని ఓప్పుకోగా, తమ్ముడి వారసులు గొడవకు దిగారు. కొద్దిసేపు వాదోపవాదనలు, తోపులాటలు జరిగాయి. తమ్ముడి వారసులు ఇంటిని కూల్చివేస్తామంటూ పైరువేలకు దిగారు. గ్రామస్తులు చేరుకొని స్థలంలో నివాసం ఉంటున్న అన్నయ్య కుటుంబ వారసులకు బాసటగా నిలిచారు. స్థలం వివాదంలో ఇరువర్గాలు గొడవపడుతున్నారని తెలుసుకున్న పోలీసులు స్థలం వద్దకు చేరుకుని ఇరువర్గాల వివాదాన్ని సద్దుమణిగేలా చేశారు. మంగళగిరి ప్రాంతం వారిని అక్కడ నుంచి పంపించి వేయడంతో గ్రామంలో ప్రశాంత వాతావరణ నెలకొంది.

## డ్రంక్ అండ్ డ్రైవ్లో 5 గురికి జైలు,ఇద్దరికి రూ.10 వేల జరిమానా- ఎస్సై జి సతీష్ కుమార్




**కిర్లంపూడి, :జూన్ 5(వార్తా ప్రభ )**రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా నిర్వహిస్తున్న డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఏడుగురిపై కోర్టు శిక్షలు విధించిందని ఎస్సై జి సతీష్ కుమార్ తెలిపారు.కాకినాడ జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ ఆదేశాలు,పెద్దాపురం డీఎస్పీ ఎ బి జి తిలక్ సూచనల మేరకు జగ్గంపేట సీఐ బి తిరుపతిరావు ఆధ్వర్యంలో కిర్లంపూడి ఎస్సై జి. సతీష్ కుమార్ సిబ్బందితో కలిసి కృష్ణవరం టోల్‌ప్లాజా వద్ద ప్రతిరోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు.ఇటీవల ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఏడుగురిని సోమవారం కోర్టులో హాజరు పరచగా,ప్రత్తిపాడు స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కె శారదామణి విచారణ అనంతరం ఇద్దరికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.మరో నలుగురికి ఐదు రోజుల జైలు శిక్ష,ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది.మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రాణాపాయం కలిగే ప్రమాదాలు సంభవిస్తాయని,అలాంటి వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని ఎస్సై జి. సతీష్ కుమార్ హెచ్చరించారు.ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణానికి సహకరించాలని సూచించారు.

# ప్రభుత్వ పాఠశాలల విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

### - కిర్లంపూడి ఎంపీపీ తోట రవి



**కిర్లంపూడి,జూన్ 15 (వార్తా ప్రభ)** , : ప్రభుత్వ పాఠశాలల విద్యతోనే విద్యార్థులకు మంచి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కిర్లంపూడి ఎంపీపీ తోట రవి అన్నారు. సోమవారం కిర్లంపూడి మండలం వీరవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం అందిస్తున్న నూతన పాఠ్యాంశ పుస్తకాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ తోట రవి ముఖ్యఅతిథిగా పాల్గొని వీరవరం సొసైటీ అధ్యక్షుడు తోట గాంధీ, వీరవరం టిడిపి అధ్యక్షుడు గొల్లపల్లి సూరిబాబులతో కలిసి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తోట రవి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు అన్ని చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు విద్యలో బాగా రాణించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాలకు చెందిన పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమంలో ప్రతి ఓటును కాపాడాలి-తన్నీరు నాగేశ్వరరావు



**జగ్గయ్యపేట జూన్ 15 (వార్తప్రభ)** రాష్ట్రవ్యాప్తంగా జూన్ 15 నుంచి జూలై 14 వరకు నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (సర్ ) కార్యక్రమాలో బి ఎల్ ఏ లు, వైఎస్ఆర్ పార్టీ నాయకులు జగ్గయ్యపేట నియోజకవర్గం లోని 222 బూతుల్లో అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహించాలని జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీఎల్ఏలు అప్రమత్తంగా ఉండి ప్రతి ఓటును క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా బీఎల్ఓల ద్వారా అవసరమైన ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు.అదేవిధంగా, చనిపోయిన వారి పేర్ల తొలగింపు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వెళ్లిపోయిన వారి ఓట్ల తొలగింపు, దొంగ ఓట్ల తొలగింపు, కొత్త అర్హులైన ఓటర్ల నమోదు వంటి అంశాలను నిబంధనల ప్రకారం బీఎల్ఏల ద్వారా బీఎల్ఓలకు తెలియజేసి పూర్తి చేయాలని తెలిపారు.ఓటర్ల జాబితాలో అక్రమాలు జరగకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, అధికార కూటమి పార్టీకి చెందిన వ్యక్తులు ప్రలోభాలకు గురిచేసి దొంగ ఓట్లను చేర్చే ప్రయత్నాలు చేసినా లేదా ఇతర అక్రమాలు జరిగినా వెంటనే సంబంధిత తహసీల్దార్ కార్యాలయానికి లేదా జగ్గయ్యపేట వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి సమాచారం అందించాలని ఆయన కోరారు.ప్రజాస్వామ్య పరిరక్షణలో స్వచ్ఛమైన ఓటర్ల జాబితా కీలకమని, ప్రతి ఓటు విలువైనదని, అందరూ బాధ్యతగా ఈ కార్యక్రమంలో పాల్గొని పారదర్శక ఓటర్ల జాబితా రూపకల్పనకు సహకరించాలని తన్నీరు నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా హర్షణపల్లి (అద్వానీ) సూర్యారావు పుట్టినరోజు వేడుకలు...

### జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన పలువురు ప్రముఖులు, బిజెపి సీనియర్ నాయకులు...



**కూకట్ పల్లి,జూన్15(వార్తాప్రభ):**కూకట్‌పల్లి నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ కార్యాలయం వద్ద కూకట్‌పల్లి బీజేపీ సీనియర్ నాయకులు హర్షణపల్లి (అద్వానీ) సూర్యారావు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. కూకట్‌పల్లి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ఈ సందర్భంగా రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు ఎన్. సూర్యప్రకాశ్ రావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు,మాధవరం కాంతారావు,ఆకుల వెంకటస్వామి ,ఎంజాల పద్మయ్య తదితర నాయకులు పాల్గొని హర్షణపల్లి సూర్యారావుతో కేక్ కట్ చేయించి ఘనంగా సన్మానించారు.అనంతరం ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి,ఆయురారోగ్యాలు, విజయాలు కలగాలని ఆకాంక్షించారు.అలాగే సూర్యారావు ఆయన తోటలో పండించిన స్వచ్ఛమైన నాలుగు టన్నుల మామిడిపళ్లను వేడుకలకు హాజరైన నాయకులు, కార్యకర్తలు అభిమానులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ సూర్యారావు ప్రజాసేవలో మరింత ఉన్నత స్థానాలను అధిరోహించాలని, ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ తమ శుభాభినందనలు తెలియజేశారు.